మాగజైన్ నా నారంబోట్లపై బిల్లెగ్స్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 119 పేజీలు: 10+4 వెల: 6.50

## భారత్‌లో ఇక ప్లాస్టిక్ కరెన్సీ!

5లో

## అన్ని అత్యవసర సేవలకు ఒకే నంబర్.. 112

## సిద్దరామయ్య రాజీనామాకు గవర్నర్ ఆమోదం

5లో

ఢిల్లీకి మారిన కర్ణాటక రాజకీయం

1 లేదా 4న కొత్త సిఎంగా డికె ప్రమాణం





## తీర్పులపై జాప్యం చేయొద్దు

రిజర్వ్ చేసిన కేసులపై 3 నెలల్లో వెలువరించాలి

బెయిలు ఉత్తర్వులపై అదే రోజు నిర్ణయించాలి

హైకోర్టులకు సుప్రీం మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ, మే 29:** సకాలంలో న్యాయం జరిగేలా చూడటానికి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వేగవంతమైన విచారణ పొందే ప్రాథమిక హక్కును పరిరక్షించడానికి ఒక ముఖ్యమైన చర్యగా, తీర్పు కోసం రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా తీర్పులను వెలువరించాలని అన్ని హైకోర్టులను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం సమగ్రమైన, తప్పనిసరి మార్గదర్శకాలను జారీ చేసింది. తీర్పులు వెలువరించడంలో ఆలస్యాన్ని అరికట్టడానికి అన్నిహైకోర్టులకు ఈ తప్పనిసరి ఆదేశాలను జారీ చేయడా >>2



శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రులు పొన్నం, తుమ్మల

## ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ టాప్

రైతులను తప్పుదోవ పట్టించేలా విపక్షాల విష ప్రచారం

బిఆర్ఎస్ హయాంలో కంటే ఎక్కువగా కొనుగోళ్లు

వడ్ల కోటా పెంచాలని బిజెపి నేతలు ఢిల్లీని కోరాలి

చివరి గింజదాకా కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. 29 రాష్ట్రాల్లో తెలంగాణలో కొనుగోలు చేస్తున్నట్లు మరెక్కడా చేయడంలేదని దీనిని భారత ప్రభుత్వమే అంగీకరించిం దన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నంబర్ 1 అని కేంద్రం చెబుతోందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఇప్పటి వరకు ఐదు పంటలు పండితే అయిదు పంటల్లో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిపామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సచివాల >>2

# ఎమ్మెల్యేలు జమీందార్లా?

పార్టీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనవలసిందే..

నెలలో 3 రోజులు కార్యకర్తలను కలుస్తా

నేతలంతా మాజీ పిసిసి చీఫ్‌ల సలహాలు తీసుకోండి

'సర్'పై అందరు సరైన అవగాహనతో ఉండాలి

ఇన్‌చార్జిలు సరిగా పనిచేస్తే ఓట్లు డిలిట్ కావు

పార్టీ పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే29:** పార్టీ కార్యక్రమాల్లో తనతో సహా ఎవరికీ మినహాయింపు లేదని, పది రోజులకు ఒకసారి కార్యకర్తలను కలుస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొనాల్సిందేనని కుండబద్దలు కొట్టారు. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లుగా తయారయ్యారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం గాంధీభవన్‌లో పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ, పిసిసి అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సదరు ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో కేవలం తమవ్యక్తిగత ప్రచారం తప్ప,పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను అస్సలు ప్రచారం చేయనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పరిస్థితి మారాలని, సోషల్ మీడియాపై ఎలా ఉపయో గించాలనే అంశంపై ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను, క్యాడర్‌ను ప్రజాప్రతినిధులు విస్మరించరాదని సిఎం హెచ్చరించారు.ఎస్ఐఆర్‌పై అందరు అవగహన పెంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్ఐఆర్‌వల్ల సామాన్యులు, పేదలు,కాంగ్రెస్ కార్యకర్తలుకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్, లంబాడీలు,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది వలస పోయారని తెలిపారు. మహిళలకు కూడా ఎస్ఐఆర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చునన్నారు. ఎస్ఐఆర్ వల్ల దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశం ఉందని ఆందోళన చెందారు.

ఎస్ఐఆర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా సిఎం సూచించారు. బూత్ ఎన్‌రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించామని వివరించారు. ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో >>2

## ఉద్యోగుల బకాయిలు 2వేల కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే29:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలంగాణ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని >>2

## యుపిఎస్సీని చూసి నేర్చుకోండి




• ఎన్‌టిఎపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం • నీట్ పేపర్ లీకేజి బాధాకరమని వ్యాఖ్య • సిఫార్సులలోనే లోపం ఉన్నదని విమర్శ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 29:** ఈ నెల 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ప్రశ్నాపత్రం లీకేజీపై దేశ అత్యున్నత న్యాయస్థానం పరీక్ష నిర్వహణ సంస్థ అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)పై ఆగ్రహం వ్యక్తం చేసింది. నీట్ నిర్వహణను పర్యవేక్షించేందుకు కమిటీ ఉన్నప్పటికీ ప్రశ్నాపత్రం ఎలా లీకైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఘటన విద్యార్థులకు మాత్రమేకాకుండా వారికుటుంబాలకుకూడా అత్యంత బాధాకరమైనదని అభిప్రాయపడింది. నీట్‌కు సన్నద్ధమయ్యే యువత ఎంతో కష్టపడుతుంటారని అలాంటి వారిని ఇలా నిరాశకు గురిచేయటం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. సుప్రీంకోర్టులో శుక్రవారం ఎన్‌టిఎను రద్దు చేయడం, నీట్ పరీక్ష నిర్వహణలో మార్పులు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ పరీక్ష నిర్వహణకు ఉన్నత స్థాయి కమిటీ ఉన్నప్పటికీ పేపర్ లీకైందంటే కమిటీ ఇచ్చిన సిఫార్సుల్లో లోపాలు ఉండొచ్చని లేదా కమిటీ సిఫార్సులను క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు చేసి ఉండకపోవచ్చని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వ్యవస్థలో జవాబుదారీతనం వచ్చేంత వరకు ఇలాంటి సమస్యలకు ముగింపు ఉండదని జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. శుక్రవారం జరిగిన కోర్టు విచారణకు ఎన్‌టిఎ తరఫున సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతోపాటు నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డాక్టర్ రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. విచారణ సందర్భంగా ఎన్‌టిఎ, డాక్టర్ రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను ధర్మాసనం పరిశీలించింది. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు యుపిఎస్‌సి అంశాన్ని ప్రస్తావిస్తూ.. >>2

## టెట్ అర్హత గడువు మూడేళ్లు పెంపు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపును నిరాకరించిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 29:** ఇన్ సర్వీస్ టీచర్లకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) అర్హత గడువును మూడు సంవత్సరాలకు పెంచుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపును నిరాకరిస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావటానికి సుప్రీంకోర్టు లోగడ విధించిన రెండు సంవత్సరాల గడువును మూడు సంవత్సరాలకు పొడిగించింది. 2010 ఆగస్టు 23కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. టెట్‌ను 6 నెలలకు ఒకసారి చొప్పున వీలైనన్ని ఎక్కువ సార్లు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.ఉద్యోగ విరమణకు ఐదు సంవత్సరాలకు పైబడిన సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు అందరూ రెండేళ్లలో తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులవ్వాలని సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీన ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ స్కూల్ టీచర్స్ ఫెడరే >>2

## కల్తీ మద్యం సేవించి 12 మంది మృతి: 8 మంది అరెస్టు

3లో



## ఇంకా తగ్గని హీట్

11 జిల్లాల్లో 46° పైగా ఉష్ణోగ్రతలు నమోదు

మంచిర్యాల జిల్లాలో 46.4°

మరో రెండు రోజులు వడగాడ్పులు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో గరిష్టఉష్ణోగ్రతలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసీఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం జిల్లాల్లో వీస్తాయని తెలిపింది.ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అదే సమయంలో రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని హెచ్చరించింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా కురుస్తాయని తెలిపింది. కాగా.. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 12 జిల్లాల్లో ప్రమాదకర స్థాయిలో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచిర్యాలజిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీలఉష్ణోగ్రత నమో >>2

## నైరుతి 10 రోజులు లేటు!

జూన్ 4, 5 తేదీల్లో కేరళ తీరానికి

తర్వాత వారానికి తెలంగాణలోకి



**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాలు ఈ యేడాది పదిరోజులు ఆలస్యం కానున్నాయి. నైరుతి రాక ఇంకాస్త ఆలస్యం అవుతుందని తాజాగా ఐఎండి ప్రకటించింది. జూన్ 4, 5 తేదీల్లో నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని, జూన్ రెండో వారంలో అంటే జూన్ 10 నాటికి తెలంగాణను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో రుతుపవనాల రాక గతంలో కంటే పదిరోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. గతేడాది మే 31 నుండి జూన్ 1 మధ్య >>2

## న్యాయవాది హత్యకేసులో ఏడుగురి అరెస్టు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** నగరంలో సంచలనం రేపిన న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ దారుణ హత్యపై మిస్టరీ వీడింది. వక్ఫ్ భూముల వివాదం కారణంగానే న్యాయవాదిని ప్రత్యర్థులు సుపారి ఇచ్చి దారుణంగా హత్య చేయించారని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ఏడుగురు నిందితులు అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి సుపారికి వాడిన పది లక్షల రూపాయలకుపైగా నగదును స్వాధీనం చేసుకున్నామని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని సిటి కొత్వాల్ సజ్జనార్ శుక్రవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కేసుకు >>2

## హార్ముజ్‌లో దిగ్బంధనం ఎత్తివేస్తున్నాం: ట్రంప్

**వాషింగ్టన్, మే 29:** హార్ముజ్ జలసంధి దిగ్బంధనం ఎత్తివేస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌లోని సుసంపన్న యురేనియం నిల్వలను అమెరికా వెలికితీస్తుందని కూడా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలా వద్దా అనే దానిపై తాను ఇప్పుడు తుది నిర్ణయం తీసుకుంటున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం తెలిపారు. తుది నిర్ణయం తీసుకోవడానికి నేను ఇప్పుడు సిట్యుయేషన్ రూమ్‌లో సమావేశమవుతానని ట్రంప్ ఒక సుదీర్ఘ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి >>2



## రైతులు కన్నీరు మున్నీరు

గాలివాన బీభత్సంతో తడిసిన ధాన్యం, నేలకొరిగిన చెట్లు

పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా పెకిలిపోగా, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో రాత్రి కురిసిన భారీ గాలివాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గాలుల ఉధృతికి చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఇక రాజన్న సిరిసిల్ల పట్టణాన్ని ఈదురు గాలులు వణికించాయి. పట్టణంలోని అనంతనగర్ ఏరియాలో ఉన్న అమృత చిల్డ్రెన్స్ హాస్పిటల్ సమీపంలో ఒక భారీ వృక్షం >>2

## బంగాళాఖాతంలో తుఫాన్ సూచన

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల వల్ల తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావం, అల్పపీడన పరిస్థితుల కారణంగా ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు జాంగ్మీ తుపాను రానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపాను ప్రభావం వల్ల కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలుపడే అవకాశం ఉంది. రాష్ట్రంలో రాగల మూడురోజులు మోస్తరు వర్షాలతో పాటు, పలుచోట్ల ఉరుములు, >>2



శుక్రవారం న్యూఢిల్లీలో రాహుల్ గాంధీతో భేటీ అయిన ఏపిసిసి చీఫ్ షర్మిల

## రాహుల్‌ను కలిసిన ఏపిసిసి చీఫ్ షర్మిల

**న్యూఢిల్లీ, మే 29:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. వైఎస్సార్‌టిపిని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపిలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున ఏపి గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది.

## టిపిసిసి ఉపాధ్యక్షుడు అలామ్‌పై బహిష్కరణ వేటు

### క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవి

**హైదరాబాద్,మే29,ప్రభాతవార్త:** హత్య ఆరోపణలపై అరెస్టైన టిపిసిసి ఉపాధ్యక్షుడు అలామ్ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఖాజా మొయినోద్దీన్ హత్య కేసులో అలామ్‌ఖాన్ తో పాటు ఆయన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు. ఈ హత్య అంశాన్ని క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించి ఆయనపై కాంగ్రెస్ బహిష్కరణ వేటువేశామని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీలో నేరస్తులకు స్థానం ఉండదనీ చైర్మన్ రవి తెలిపారు.

## యుపిఎస్సీని చూసి నేర్చుకోండి

>> యుపిఎస్‌సి ఇప్పటివరకు ఇలాంటి వివాదాల్లో చిక్కుకోలేదని తెలిపింది. వారిని చూసి నేర్చుకోవాలని ఎన్‌టిఎకు సూచించింది. ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు పర్యవేక్షించినా ఈ ఘటన జరిగిందంటే అసలు సిఫార్సుల్లోనే లోపం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి పరిస్థితి తలెత్తుతుందని మీరు ఊహించలేదని, రెండోది సమర్థవంతమైన పర్యవేక్షణ జరిగి ఉండదనిపేర్కొంది. ఇది ఎలా జరిగిందని కమిటీకి నేతృత్వం వహించిన రాధాకృష్ణన్‌ను జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. రాధాకృష్ణన్ బదులిస్తూ.. నీట్ పరీక్షలో తలెత్తిన సమస్యల నేపథ్యంలో 2024 జూన్‌లో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, వారు 101 సిఫార్సులు ఇచ్చారని తెలిపారు. స్వల్పకాలికంగా 2025,2026 సంవత్సరాల్లో పరీక్షలకోసం 60 సిఫార్సులు చేయగా, వాటిలో చాలా వరకు అమలు చేశామన్నారు. దీర్ఘకాలికంగా 35 సిఫార్సులు చేశామని వాటిలో చాలా వరకు ప్రారంభించామని ధర్మాసనానికి తెలిపారు. ఈ అంశంపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పరీక్షలను ఎలా నిర్వహించాలి? ఎన్‌టిఏలో నిపుణులను చేర్చడం ద్వారా మానవ వనరులను ఎలా మెరుగుపరచాలి? అనే అంశాలపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖకు బదులు, విద్యా శాఖ ముందుగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. 2024, 2026 పరీక్షలో జరిగినటువంటి ఘటన మళ్లీ జరగకుండా చూసేందుకు ఎన్‌టిఏకు భౌతికంగా, మేధోపరంగా అవసరమైన వనరులు ఉండేలా చూడటమే తమ ప్రయత్నమని కోర్టు వ్యాఖ్యానించింది. నీట్ యూజీ రీ షెడ్యూల్ పరీక్ష ప్రక్రియతో పాటు లీకేజీ వ్యవహారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. యువత ఆందోళనల పట్ల ప్రభుత్వం తీవ్రంగా శ్రద్ధ వహిస్తోందని.. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్ యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామని కోర్టుకు తెలిపారు. విచారణ అనంతరం సుప్రీంకోర్టు తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.

## 2వేల కోట్లు విడుదల

>> రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ఉద్యోగ జెఏసి నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్ట్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటిని పూర్తిగా చెల్లించారు. 'మందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ.4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది'. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ, శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## తుఫాన్ సూచన

>> మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో గంటలకు 40 నుండి 50 కి.మీ వేగంతో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంలో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే29:** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై అమీర్‌ఖాన్,అజారుద్దీన్ దాఖలు చేసిన ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్లపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణ జులై 22న చేపట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని ధర్మాసనం తెలిపింది. గత విచారణలో కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అజారుద్దీన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో గవర్నర్ తన పేరు సూచించి... తర్వాత నిర్ణయంమార్చుకున్నారని అమీర్‌ఖాన్ తెలిపారు. మంత్రి వర్గ నిర్ణయం ప్రకారం జరిగిన దానికి గవర్నర్ ఏం చేస్తారని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. ఇరువురి అప్లికేషన్లను ప్రధానకేసుతోనే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. రెండు అప్లికేషన్లపై ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన సుప్రీంకోర్టు తదుపరి విచారణ జులై 22కి వాయిదా వేసింది.

# ఎమ్మెల్యేలు జమీందార్లా?

>> సన్మానం చేయించా మన్నారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్‌రోలర్స్‌ను ఎస్ఐఆర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. డిజిటల్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంచార్జిను నియమించి నిరంతరం పర్యవేక్షించామని చెప్పారు. ఎస్ఐఆర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇంఛార్జ్‌ల నియమించాల్సి ఉందని వివరించారు. అసెంబ్లీ ఇంచార్జిలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని చెప్పారు. ఇంచార్జిలు కరెక్ట్‌గా పనిచేస్తే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడొచ్చునని నేతలకు సిఎం రేవంత్ వివరించారు. ఇంచార్జి మంత్రుల ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను ఇంఛార్జి మంత్రులు కలవాల్సి ఉందని వివరించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని చెప్పారు. నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం ఇస్తానని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేయాల్సిందే నేతలకు స్పష్టంచేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు.. ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనా ల్సిందేనని.. చివరకు తనతోపాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దని సిఎం రేవంత్ తెలిపారు. మాజీ పిసిసి అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని నేతలకు సూచించారు. దాదాపుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని స్పష్టం చేశారు. పార్టీ తరుపున ఇప్పుడు వేలాది మంది సర్పంచ్‌లు ఉన్నారని.. అలాగే మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు కూడా ఉన్నారని తెలిపారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడాల్సి ఉందన్నారు. పార్టీ నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే.. కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని వివరించారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యతలు అప్పగించాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాల్సిన అవశ్యకతను సిఎం రేవంత్ వివరించారు. ఎస్ఐఆర్‌పైన మహిళా కాంగ్రెస్ తరఫున క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని పార్టీలోని నేతలకు సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ పైన అందరు అవగహన పెంచుకోవడం సంతోషం... ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం అని చెప్పారు. ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షినటరాజన్,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వివేక్,అజారుద్దీన్,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్,తుమ్మల నాగేశ్వర్ రావు,సీతక్క. దామోదర రాజనర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## హార్ముజ్‌లో దిగ్బంధనం ఎత్తివేస్తున్నాం: ట్రంప్

>> ఉండబోదని, హార్ముజ్ షిప్పింగ్ మార్గాలను తెరవాలని ఆయన నొక్కి చెప్పారు. జలసంధిలోని మందుపాతరలను ఇరాన్ వెంటనే తొలగిస్తుందని, ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధనం ఇప్పుడు ఎత్తివేస్తామని, తద్వారా చమురు మరియు ఇతర ట్యాంకర్ల రాకపోకలు ప్రారంభమవుతాయని ట్రంప్ తెలిపారు. అయితే, దీనికి ఇరాన్ అంగీకరించిందా లేదా, ట్రంప్ తన నిర్ణయం తీసుకునే ముందే అమెరికా దిగ్బంధనం వాస్తవంగా ఎత్తివేయబడిందా అనేది స్పష్టంగా తెలియలేదు. ఇరాన్‌లోని సుసంపన్న యురేనియం నిల్వలను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్, అంతర్జాతీయ అణుశక్తి సంస్థతో సన్నిహిత సమన్వయంతో అమెరికా వెలికితీసి, ధ్వంసం చేస్తుందని కూడా ట్రంప్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్ క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఫ్లాట్ల నిర్మాణానికి జీవో జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే29:** హైదరాబాద్ క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజి, ఎంఐజి ఫ్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్యతరగతి కోసం లక్ష ఫ్లాట్లు నిర్మించనున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద 12వేల ఫ్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి లభించింది. ఎల్ఐజి ఫ్లాట్లకు ప్రభుత్వం భూమి యూడిఎస్, రూ.5లక్షల సబ్సిడీ ఇవ్వనుంది. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ఫ్లాట్లు నిర్మించనున్నారు.కెపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, తదితర ప్రాంతాల్లో గతంలో చేపట్టిన విధంగా ఎల్ఐజి, ఎంఐజీ ఫ్లాట్ల నిర్మాణం చేపట్టనుంది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఫ్లాట్లను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

## ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ టాప్

>> యంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్, ఎంపి రఘురాంరెడ్డి, తూడి దేవేందర్‌రెడ్డి తదితరులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్‌పి ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోందని దుయ్యబట్టారు. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోందని మంత్రి మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల కోటా పెంచాలని కేంద్రాన్ని కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే బిజెపి తెలంగాణ నేతలు ఇక్కడ ధర్నాలు చేయకుండా వడ్లను కొనాలని ఢిల్లీ వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని హితవు పలికారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయని, ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఏడాదికి 15వేల కోట్లు ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నారు. తెలంగాణలో 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటే పొరుగున ఉన్న ఏపిలో 24 లక్షల మెట్రిక్ టన్నులే కొన్నారని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని వివరించారు. రైతు పండించిన ప్రతీ గింజకూ మద్దతు ధర కల్పించి తీరుతామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, రైతులు ఎలాంటి వదంతులను నమ్మొద్దని కోరారు.

## ఏడుగురి అరెస్టు

>> సంబంధించి మరింతగా విచారణ జరగాల్సి వుందని, మరికొందరిని అరెస్టు చేయాల్సి వుందని ఆయన తెలిపారు. హైకోర్టులో న్యాయవాదిగా వున్న ఖాజా మొయిజుద్దీన్ (63)ను ఈ నెల 23వ తేదీన శాంతినగర్‌లోని ఆయన ఇంటి వద్ద తెల్లవారు జామున 5.45 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హత్య చేయడం తెలిసిందే. దీనిపై విచారణ చేబట్టిన నాంపల్లి పోలీసులు అన్ని కోణాల్లో విచారించగా ఖాజా మొయిజుద్దీన్‌కు ప్రత్యర్థులుగా వున్న ముజహిద్ ఆలం ఖాన్ అతని తండ్రి మహబూబ్ ఆలంఖాన్‌లు దీనికి కారకులుగా తేలింది. మలక్‌పేట్, లక్డికాపూల్‌లో గల కోట్లాది రూపాయల విలువచేసే వక్ఫ్ భూముల విషయమై ముజహిద్ ఆలంఖాన్, మహబూబ్ ఆలంఖాన్‌లతో ఖాజా మొయిజుద్దీన్‌తో గొడవలు వున్నాయి.ఈ విషయమై పలుమార్లు తండ్రి కొడుకులు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్‌ను హెచ్చరించడం, దాడులకు పాల్పడడం ద్వారా దారికి తెచ్చుకునేందుకుయత్నించారు. అయినా అతను తమమాట వినక పోవడంతో అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. దీని తరువాత న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్‌ను హత్య చేసేందుకు తమకు సన్నిహితులైన హసన్ అలీ, మునీర్‌లతో మాట్లాడి 15 లక్షల రూపాయల సుపారి ఇచ్చారు. దీని తరువాత హసన్ అలీ, మునీర్‌లకు సన్నిహితుడైన కిషన్ అలియాస్ పప్పును ముజహిద్ ఆలం ఖాన్, మహబూబ్ ఆలం ఖాన్‌లు కలిశారు. దీని తరువాత పప్పు తనకు తెలిసిన కిరాయి హంతకులు వినయ్, విక్రం, అభిజిత్‌లకు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్‌ను హత్య చేసేందుకు ఒప్పించాడు. కిరాయి హంతకులు సెకండ్ హ్యాండ్ స్కార్పియో వాహనం కొని గత జనవరి నెల నుంచి న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ కదలికలపై నిఘావుంచారు. చివరగా ఈ నెల 23వ తేదీన తమ పథకాన్ని అమలు చేశారు. ఈ కేసులో కిరాయి హంతకుల లీడర్‌గా వున్న పప్పును హరియాణా లోని పానిపట్‌లో అరెస్టు చేశారు. ఈ హత్యకు సూత్రధారులైన ముజహిద్ ఆలంఖాన్, మహబూబ్ ఆలంఖాన్‌లను జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో అరెస్టు చేశారు. కాగా హత్య జరిగిన రోజున స్కార్పియోను నడిపిన అభిజిత్‌ను హైదరాబాద్‌లో పట్టుకోగా అతని వద్ద రెండు లక్షల 80 వేల రూపాయలను, హత్యలో కీలకంగా వున్న దిగస్ వినయ్ అనే వ్యక్తిని జూబ్లీహిల్స్‌లో అరెస్టు చేసి హత్యకు వాడిన స్కార్పియో వాహనాన్ని, నాలుగున్నర లక్షల రూపాయలను జప్తు చేశారు. దీని తరువాత నిందితులకు సహకరించిన విక్రం ఆదిత్యను అరెస్టు చేసి అతని వద్ద నుంచి లక్ష రూపాయలను, మరో నిందితుడు మణిదీప్‌ను అరెస్టు చేసి అతని వద్ద 12 వేల రూపాయలను జప్తు చేశారు. ఈ కేసులో ఏడుగురు నిందితులు అరెస్ట వగా వారి వద్ద నుంచి పదిలక్షల 10 వేల రూపాయలను, అందరి సెల్ ఫోన్లను జప్తు చేశారు. ఈ కేసులో పరారీలో వున్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, దీనిపై మరింత లోతుగా విచారించాల్సి వుందని సిపి సజ్జనర్ తెలిపారు.

## ఇంకా తగ్గని హీట్

>> దైంది.అదేవిధంగా పెద్దపల్లి, వరంగల్, జయశంకర్, ఖమ్మం, కుమరం భీం ఆసీఫాబాద్,నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, జగిత్యాల, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ములుగు, హన్మకొండ, కరింనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం వర్షాలు కురిశాయి. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూలు, భూపాలపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో ఈదరుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి.

## వారం - వర్జ్యం

30-05-2026, అధికజ్యేష్ఠ శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
చతుర్దశి ఉ.11.59
విశాఖ మ.1.21
వర్జ్యం : సా.5.49-రా.7.37
దు.తె.5.33-ఉ.7.13
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కొన్ని అవినీతి కాండలకు సంబంధించిన విషయముల సెగ మిమ్ములను ఇబ్బంది పెడుతుంది.

**వృషభం:** కుటుంబము నందు ముఖ్య అనుబంధము కలిగిన వారి ఆరోగ్యము కుదుట పడుతుంది. వస్త్రలాభం.

**మిథునం:** ఆలోచనలతో మీ మనస్సును ఆందోళనకు గురిచేయకండి. పెద్దలతో సంభాషించునప్పుడు సంయమును పాటించండి.

**కర్కాటకం:** ఉద్యోగము నందు బదిలీకి పెట్టుకున్న అభ్యర్థన అనుకూలిస్తుంది. ఆర్థికముగా పరిస్థితి మెరుగు పడుతుంది.

**సింహం:** ఆహారమును స్వీకరించుటయందు తగిన జాగ్రత్తలను పాటించండి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహము.

**కన్య :** గతములో మీరు పోగొట్టుకున్న ఉద్యోగము తిరిగి పొందుగలుగుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**తుల:** చాలా కాలముగా పరిష్కారము గాని ఆర్థిక సమస్య ఈ రోజు నెరవేరుతుంది. సేవా కార్యక్రమములో పాల్గొంటారు.

**వృశ్చికం:** మీ మాటకు మంచితనమునకు బంధువులో మంచి పేరు లభిస్తుంది. స్థిరాస్తి విషయములో ఒక నిర్ణయమునకు వస్తారు.

**ధనుస్సు:** వ్యాపార సంబంధమైన కాగితములు, డాక్యుమెంట్లు మొదలగు నవి అందుతాయి. జీవిత భాగస్వామ్య నుండి ధనలాభం.

**మకరం:** సభలకు, సమావేశములకు, ఆహ్వానములకు అందుకుంటారు. స్త్రీల ఆభరణములను గురించి శ్రద్ధను వహిస్తారు.

**కుంభం:** వ్యక్తిగత సంభాషణల ద్వారా, ప్రత్యర్థుల రహస్య కార్యకలాపములను బయటపడతాయి. భూములు కొనుగోలు.

**మీనం:** మనస్సుకు ఇష్టము లేకపోయినా వృత్తిపరమైన బాధ్యతలను అశ్రద్ధ చేయవలసి ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ వద్ద భారత్ పాకిస్థాన్ సరిహద్దు వెంబడి ఉన్న ఔట్‌పోస్ట్ సిబ్బందితో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

## రైతులు కన్నీరు మున్నీరు

>> వేళ్లతో సహా ఊడిపడింది. అది నేరుగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో భారీ శబ్దంతో ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. సరిగ్గా అదే సమయంలో అక్కడ నిలిపి ఉంచిన ఒక కారుపై విద్యుత్ తీగలు పడటంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురై పరుగులు తీశారు. అదృష్టవశాత్తూ కారులో ఉన్న వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో సిరిసిల్లలోని పలు ప్రాంతాల్లో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదేవిధంగా ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. మండల పరిధిలోని బిఆర్‌కె పురం గ్రామంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఓ తాటిచెట్టుపై పిడుగు పడింది. పిడుగు పాటు ధాటికి చెట్టుపై మంటలుఎగసిపడ్డాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మానవపాడు మండలంలో పెద్దవాగు ఉధృతంగా పొంగిపొర్లడంతో మానవపాడు, అమరవాయి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐజ పట్టణంలో కురిసిన భారీ వర్షానికి మద్దికుంట వీధిలోని డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. డ్రైనేజీలు పొంగిపొర్లి, ఆ మురికి నీరంతా నేరుగా స్థానికుల ఇళ్లలోకి చేరింది. మోకాళ్లోతు నీటిలో కాలనీవాసులు నరకయాతన అనుభవించారు. వరద నీటితో పాటు ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తుండటంతో జనం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని భయం భయంగా కాలం గడిపారు. అధికారులు రంగంలోకి దిగి రోడ్లపై కూలిన చెట్లను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అకాల వర్షాలకు ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన వరి ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. "ఏడాది పొడవునా రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట కళ్లముందే కొట్టుకుపోతుంటే ఏం చేయాలో పాలుపోవడం లేదు" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం రంగు మారిపోతుందని, బరువు తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ఎలాంటి నిబంధనలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని ఇక్కడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## టెట్ అర్హత గడువు మూడేళ్లు పెంపు

>> షన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) తదితర ఉపాధ్యాయ సంఘాలు, తెలంగాణతో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. మే 13న వాదనలు జరగగా తీర్పు రిజర్వ్ చేసింది. శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం తీర్పును వెలువరించింది. గత పదిహేను సంవత్సరాలుగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని ఎన్‌సిటిఈ, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మినహాయింపును నిరాకరించడం పట్ల టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పార్లమెంట్‌లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించి ఉపాధ్యాయుల సర్వీసుకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## తీర్పులపై జాప్యం చేయొద్దు

>> నికి సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను ఉపయోగించుకుంది. జార్ఖండ్ హైకోర్టు క్రిమినల్ అప్పీళ్లలో తీర్పులు వెలువరించడంలో చూపుతున్న విపరీతమైన ఆలస్యానికి సంబంధించిన రిట్ పిటిషన్‌పై విచారణ జరుపుతున్నప్పుడు, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ విపిన్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. రిజర్వ్ చేసిన తీర్పులను వెలువరించడంలో ఆలస్యం వ్యాజ్యదారులకు, ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నవారికి నష్టం కలిగిస్తుందని కోర్టు నొక్కి చెప్పింది. ఒక విషయాన్ని తీర్పు కోసం రిజర్వ్ చేసిన తర్వాత, హైకోర్టు రిజర్వేషన్ తేదీ నుండి మూడు నెలలలోపు తీర్పును వెలువరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వ్యక్తిగత స్వేచ్ఛ, బెయిల్, జైలులో ఉన్న వ్యక్తులకు సంబంధించిన క్రిమినల్ అప్పీళ్లు, మరణశిక్షకు సంబంధించిన రిఫరెన్సుల వంటి విషయాలకు ప్రాధాన్యతనిచ్చి, వాటిని వెంటనే పరిష్కరించాలి. బెయిల్ విషయాలకు సంబంధించి, బెయిల్ దరఖాస్తులను ఆదర్శవంతంగా అదే రోజు విచారించి, తీర్పును వెలువరించి, అప్‌లోడ్ చేయాలని కోర్టు పేర్కొంది. ఒకవేళ రిజర్వ్ చేస్తే, తీర్పును మరుసటి రోజు వెలువరించి, వెంటనే అప్‌లోడ్ చేయాలి. బెయిల్ లేదా శిక్ష నిలుపుదల ఉత్తర్వులను అదే రోజు జైలు అధికారులకు తెలియజేయాలని, విచారణలో ఉన్న ఖైదీలను లేదా దోషులను వీలైతే అదే రోజు లేదా గరిష్టంగా మరుసటి రోజు జైలు నుండి విడుదల చేయాలని మార్గదర్శకాలు మరింతగా నిర్దేశిస్తున్నాయి. ట్రయల్ కోర్టులు ఈ విషయాన్ని హైకోర్టుకు తెలియజేయాలి. కోర్టులో బహిరంగ భాగంలో తీర్పును వెలువరిస్తే సరిపోతుంది, అయితే వివరణాత్మక కారణాలతో కూడిన తీర్పును ఏడు రోజులలోపు, లేదా ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్న సందర్భాలలో గరిష్టంగా 15 రోజులలోపు అప్‌లోడ్ చేయాలి. బహిరంగ కోర్టులో వెలువరించిన హేతుబద్ధమైన తీర్పులను 24 గంటలలోపు హైకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి, ఆ తీర్పులో విచారణ ముగింపు, రిజర్వేషన్, తీర్పు ప్రకటన తేదీలు స్పష్టంగా ప్రతిబింబించాలి. ఆలస్యం కేసులను పరిష్కరించడానికి, సుప్రీం కోర్టు ఒక యంత్రాంగాన్ని నిర్దేశించింది. దాని ప్రకారం, రిజర్వ్ చేయబడిన తీర్పు మూడు నెలల్లోగా వెలువడకపోతే, రిజిస్ట్రార్ జనరల్ ఆ విషయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచుతారు. ప్రధాన న్యాయమూర్తి సంబంధిత బెంచ్‌కు తెలియజేసి, అదనంగా మరో రెండు వారాల గడువు ఇస్తారు.

మూడు ప్లస్ ఒక నెలల పొడిగించిన గడువులోగా కూడా తీర్పు వెలువడకపోతే, ప్రధాన న్యాయమూర్తి ఆ విషయాన్ని మరోబెంచ్‌కు తిరిగి కేటాయించవచ్చు. వ్యాజ్యదారులు మూడు ప్లస్ ఒక నెలల గడువు ముగిసిన తర్వాత కూడా పునఃకేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా, తీర్పులోని ప్రధాన భాగాన్ని ప్రకటించిన 15 రోజుల్లోగా కారణాలతో కూడిన తీర్పును అప్‌లోడ్ చేయకపోతే, ఒక దరఖాస్తును దాఖలు చేయవచ్చు. ఒకవేళ 30 రోజుల్లోగా దానిని కూడా అప్‌లోడ్ చేయకపోతే, ఆ విషయాన్ని మరో బెంచ్‌కు తిరిగి కేటాయించవచ్చు. ఈ మార్గదర్శకాలను తక్షణ అమలు కోసం సంబంధిత ప్రధాన న్యాయమూర్తులముందు ఉంచాలని ప్రతిహైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించడం జరిగింది. రిజర్వేషన్ తేదీలు, పెండింగ్‌లోఉన్న రిజర్వ్ కేసులను ప్రతిబింబించేలా హైకోర్టు వెబ్‌సైట్ లలోకూడా అవసరమైన మార్పులు చేయాలి. జార్ఖండ్‌లోని షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన నలుగురు దోషులు దాఖలుచేసిన పిటిషన్‌కు సంబంధించిన ఒకకేసులో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

## నైరుతి 10 రోజులు లేటు!

>> రుతుపవనాలు తెలంగాణను తాకాయి. దేశంలో నైరుతి రుతుపవనాల గమనం రెండు, మూడు రోజుల్లో మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్ పరిసరాలు, అలాగే నైరుతి, తూర్పుమధ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంతో పాటు ఆగ్నేయ బంగాళాఖాతంలోని మిగిలిన భాగాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత విస్తరించేందుకు మార్గం సుగమమైంది. దేశంలోని పలు రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ రంగం ప్రారంభం నైరుతి రుతుపవనాల రాకపైనే ఆధారపడి ఉంటుంది. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించి విస్తారంగా వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు కూడా జోరుగా ముందుకు సాగుతాయి. దీంతో రైతులు రుతుపవనాల రాకకోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారు. గతేడాది అంచనా వేసిన సమయానికంటే ఎనిమిది రోజుల ముందుగానే మే 24ననే నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మే 26న తెలంగాణలోకి ప్రవేశించాయి. ఈసారి మాత్రం గతం కంటే పదిరోజులు ఆలస్యంగా నైరుతి తెలంగాణను పలుకరించనుంది.

దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. జూన్‌లోనూ యుపి, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో రుతుపవనాలు వచ్చే లోపు తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాబోయే రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుండి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల విపరీతమైన ఉక్కపోత, తీవ్రమైన వేడి గాల్పులు వీచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. రుతుపవనాలు పూర్తిగా విస్తరించే వరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎండవేడిమితో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు మరికొన్ని రోజులు నిరీక్షించక తప్పేలా లేదు.

# ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌రెడ్డికి సిట్ నోటీసులు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

### జూన్ 1న విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. జూన్ ఒకటవ తేదీన విచారణకు రావాలని అందులో పే ర్కొన్నారు. గతంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకుల్లో శ్రీనివాస్ రెడ్డి కూడా ఒకరు. గత అసె ంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురయ్యిందని శ్రీనివాస్ రెడ్డి పోలీసులకు అనేకమార్లు ఫిర్యాదు చేశారు. కాగా ఈ కేసు విచారణలో శ్రీనివాస్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు తేలింది. శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకుల ఫోన్‌లను అప్పట్లో ట్యాపింగ్ చేశారని ఈ కేసును విచారిస్తున్న సిట్ తేల్చింది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువరు బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకున్న సిట్ తాజాగా శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. జూన్ 1న ఆయనను బషీర్‌బాగ్‌లోని సిట్ కార్యాలయంలో సిట్ అధికారులు విచారించనున్నారు.

# నేడు ఎడ్‌సెట్ పరీక్ష ఫలితాలు

### పరీక్షకు 82.42 శాతం మంది అభ్యర్థుల హాజరు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్ సెట్-2026 పరీక్ష ఫలితాలను నేడు(శనివారం) విడుదల చేయనున్నారు. మధ్యాహ్నాం 12.30 గంటలకు మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఫలితాలను విడుదల చేయనున్నారని ఎడ్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ సెట్-2026 పరీక్ష ఈ నెల 12న రాష్ట్రంలో ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 82.42 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎడ్‌సెట్‌కు 35,600 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 29,441 మంది మహిళలు .. 6,155 మంది పురుష అభ్యర్థులు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 29,342 మంది(88.42శాతం) హాజరయ్యారు. పరీక్షల కోసం రాష్ట్రంలో 16 జోనల్ కేంద్రాల్లో 59 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన పిజి ఇ-సెట్ పరీక్షలు

### మొదటిరోజు 88 శాతం హాజరు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ఇంజినీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ ఈ సెట్-2026 పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలకు 88 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలు జూన్ 1 వరకు కొనసాగనున్నాయి. మొత్తం 19 పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 26,085 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం మొదటి రోజు ఉదయం సెషన్‌కి 3539 మంది హాజరు కావల్సి ఉండగా వారిలో 3084 మంది(87.14 శాతం) పరీక్షలకు హాజరయ్యారని పీజీ ఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నాం సెషన్‌కి 10,045 మంది హాజరు కావల్సి ఉండగా.. అందులో 8972 మంది (89.32శాతం) హాజరయ్యారు. పరీక్షలు జూన్ 1 వరకు కొనసాగనున్నాయి.

# జి-20 దేశాల్లో ఇప్పటికీ అమలుకాని లింగ సమానత్వం

### మేనేజర్ పదవుల్లో మహిళల శాతం తక్కువే

### భారత్‌లో 12 శాతమే వారికి అందలం

**న్యూఢిల్లీ, మే 29:** ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జి20 దేశాల్లోనూ లింగ వివక్ష కొనసాగుతోందని సర్వేలు చెపుతున్నాయి. మేనేజ్‌మెంట్ స్థాయి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం ఆశించిన స్థాయిలో పెరగడం లేదని అంతర్జాతీయ కార్మిక సంస్థ గణాంకాలు స్పష్టం చేస్తున్నా యి. స్టాటిస్టా అంచనా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మేనేజర్ల పదవుల్లో మహిళలు సగటున 31 శాతం వాటాతో ఉన్నారు. 2015లో ఇది 27 శాతంగా ఉండగా, పదేళ్లలో కేవలం 4 శాతం మాత్రమే స్వల్ప పురోగతి కనిపించింది. జీ20 దేశాల మధ్య భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. రష్యాలో అత్యధికంగా 45 శాతం మేనేజ్‌మెంట్ పదవుల్లో మహిళలు ఉండగా, అమెరికా 43 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్ 41 శాతం తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఫ్రాన్స్‌లో ఈ సంఖ్య 39 శాతంగా ఉంది. అయితే జర్మనీ 30 శాతం, ఇటలీ29 శాతం మాత్రమే ఉన్నాయి. అభివృద్ధిచెందిన దేశాల్లో పరిస్థితి కొంత వెనుకబడే ఉంది. ఈ జాబితాలో జపాన్ 14 శాతం, భారత్12 శాతం అత్యంత అట్టడుగున ఉండటం ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లో ప్రతి 100 మంది మేనేజర్లలో కేవలం 12 మంది మాత్రమే మహిళలు ఉన్నారని తేలింది. దక్షిణ కొరియా 2015లో 11 శాతం నుంచి 2025 నాటికి 18 శాతంకి చేరుకుని ప్రగతి సాధించింది. భారత్‌లో మహిళా మేనేజర్ల సంఖ్య ఇంత తక్కువగా ఉండటానికి ఇక్కడి మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం తక్కువగా ఉండటం ఒక ప్రధాన కారణంగా నిలుస్తోంది.

# కాజీపేట యూనిట్‌కు రైళ్ల తయారీ బాధ్యత

### ప్రధానికి, రైల్వే మంత్రికి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 29:** కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా స్పందించారు.

రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు.

ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షి తమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపా యాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధార ణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడ తాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు.

అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# పసికందు ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న లెడ్‌బల్బ్ తొలగింపు



**ముంబై, మే 29:** ఆర్మీ వైద్యులు 9 నెలల పసికందు ప్రాణాలు కాపాడారు. ఆ చిన్నారి మింగిన చిన్న ఎల్‌ఈడీ ఊపిరితిత్తులో ఇరుక్కున్నది. ఈ నేపథ్యంలో ఆర్మీ డాక్టర్లు అత్యంత క్లిష్టమైన, ప్రమాదకరమైన శస్త్ర చికిత్సను విజయ వంతంగా నిర్వహిం చారు. చిన్నారి ఉపిరితి త్తుల్లోని ఎల్‌ఈడీని సురక్షితంగా తొలగించారు. మహా రాష్ట్రకు చెందిన 9 నెలల శిశువు పొరపాటున చిన్న ఎల్‌ఈ డీని మింగింది. పుణేలోని ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియోథొరాసిక్ సైన్సెస్ (ఏఐసీటీఎస్)కు ఆ చిన్నారిని తరలించారు. కాగా, ఆర్మీ డాక్టర్లు ఆ శిశువును పరిశీలించారు. ఆ చిన్నారి మింగిన చిన్న ఎల్‌ఈడీ, ఎడమ ఊపిరితిత్తుల్లో లోతుగా ఇరు క్కున్నట్లు గుర్తించారు. దీంతో ఆర్మీ వైద్యులు బ్రాంకో స్కోపీ సర్జరీ నిర్వహించారు. కెమెరాతో కూడిన ఒక సన్నని, వంగే గొట్టాన్ని పసికందు గొంతు ద్వారా ఊపిరితిత్తుల్లోకి పంపారు. ఎడమ ఊపిరితిత్తుల వాయుమార్గంలో లోతుగా ఇరుక్కు న్న తుప్పుపట్టే తీగలున్న ప్రమాదకరమైన ఎల్‌ఈడీని సురక్షితంగా బయటకు తీశారు. 9 నెలల పసికందు ప్రాణాలను కాపాడినట్లు ఎక్స్ పోస్ట్‌లో ఆర్మీ పేర్కొంది. ఆర్మీ డాక్టర్లపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

# ఇ-సెట్‌లో 93.60 శాతం అర్హత

### వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ

### ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఈ సెట్-2026 ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. పరీక్షకు హాజరైన వారిలో 93.60 శాతం మంది అర్హత సాధించారు. ఈ సెట్ ఫలితాలను మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్ ఫలితాలను విడుదల చేశారు. వారం రోజుల్లో అడ్మిషన్లకు సంబంధించిన కౌన్సె లింగ్ షెడ్యూల్‌ను జారీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15న ఈ సెట్-2026 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 81,626 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 17,870 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 16,726 మంది(93.60శాతం) మంది విద్యార్థులు అర్హత సాధించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ కళాశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ విభాగాలలో అందించే రెగ్యులర్ బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ ప్రవేశం కోసం డిప్లొమా, బీఎస్సీ(గణితం) డిగ్రీ అభ్యర్థుల కొరకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరపున ఈ సెట్-2026 ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ సెట్ పరీక్షను నిర్వహించింది. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ గత ఏడాది జులై 23న క్లాసులను ప్రారంభించామని కానీ ఈ ఏడాది అంతకంటే ముందుగానే జులై మొదటి వారంలోనే క్లాసులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ఏడాది 179 కాలేజీల్లో 21,200 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిల్లో 10,899 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈ ఏడాది కూడా గత ఏడాదిలాగానే 179 కాలేజీల్లో 21,200 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జూన్ మొదటి వారంలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేయనున్నట్టు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి సంబంధించి గత ఏడాది ఎలాంటి నిబంధనలు ఉన్నాయో ఈ ఏడాది కూడా అవే నిబంధనలతో కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఓయూ అధికారులు మాట్లాడుతూ పార్ట్ టైమ్ ఇంజనీరింగ్ కోర్సులు(ఈవెనింగ్ కాలేజెస్) చేరడం కోసం వారం రోజుల్లో నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు తెలిపారు. 11 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో పార్ట్‌టైమ్ ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తున్నాయని తెలిపారు.

# కల్తీమద్యం సేవించి 12 మంది మృతి

### ఎనిమిది మంది అరెస్టు

**ముంబై, మే 29:** కల్తీ మద్యం సేవించి 12 మంది మరణించారు. అస్వస్థతకు గురయిన మరి కొందరి వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ కల్తీ మద్యంకేసుకు సంబంధించి ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పూణే, పరిసర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు కల్తీ మద్యం తాగారు. తీవ్ర అస్వస్థతకు గురై 12 మంది మరణించారు. పింప్రిచించ్వాడ్‌లోని ఫుగెవాడి ప్రాంతంలో ఏడుగురు, హడప్సర్‌లోని ససనే నగర్, కాలేపడల్ ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు చనిపోయారు. అనారోగ్యం పాలైన మరికొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ సంఘటనపై స్పందించారు. సమగ్ర విచారణ చేయాలని పూణే, పింప్రిచించ్వాడ్ పోలీస్ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం నెట్‌వర్క్‌ను అధికారులు గుర్తిం చారని, దీంతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశమున్నదని వివరించారు.

# వైవాహిక వివాదాలపై ఇన్ని వ్యాజ్యాలెందుకు?

### ఇది చాలా ఆందోళనకర ధోరణి

### క్రిమినల్ చట్టం దుర్వినియోగంపై సుప్రీంకోర్టు హెచ్చరిక

**న్యూఢిల్లీ, మే 29:** వైవాహిక వివాదాల్లో, వేధింపులకు గురిచేసే వ్యాజ్యాలు పెరగడం ఒక 'ఆందోళనకరమైన ధోరణి' అని సుప్రీంకోర్టు హెచ్చరించింది. వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి, ఎదుటి పక్షాలపై ఒత్తిడి తెచ్చేందుకు క్రిమినల్ చట్టాన్ని ఒక సాధనంగా దుర్వినియోగం చేస్తున్నారని కూడా హెచ్చరించింది. పోక్సో కేసులో ఒక వ్యక్తి, అతని కుటుంబంపై ప్రారంభించిన క్రిమినల్ విచారణను కొట్టివేస్తూ, జస్టిస్‌లు బి.వి. నాగారత్న, ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. మీరట్‌లోని స్థానిక కోర్టు జారీ చేసిన ఫిర్యాదు, కాగ్నిజెన్స్ ఆర్డర్, సమన్లు జారీచేసే ఉత్తర్వులను రద్దు చేయడానికి నిరాకరించిన అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వును సుప్రీం ధర్మాసనం పక్కన పెట్టింది. తన తీర్పులో.. వైవాహిక లేదా వాణిజ్య వివాదాల్లో చిక్కుకున్న పక్షాలు వేధింపులు, ప్రతీకార చర్యలకు ఒక మార్గంగా 'అనవసరమైన, వేధింపులకు గురిచేసే' క్రిమినల్ ఫిర్యాదులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. 'భార్యాభర్తలను, వారి కుటుంబసభ్యులను రెచ్చగొట్టడానికి, ఒత్తిడి చేయడానికి, వేధించడానికి, ఇబ్బంది పెట్టడానికి ఉద్దేశించిన ఇటువంటి అస్పష్టమైన, బాధాకరమైన వ్యాజ్యాల ద్వారా న్యాయస్థానాలు దుర్వినియోగం చేయబడుతున్నాయని, అధిక భారాన్ని మోస్తున్నాయని మేము బాధతో గమనిస్తున్నాము' అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీని విస్తృతప్రభావాన్ని ప్రస్తావిస్తూ, తప్పుడు కేసుల పెరుగుదల తరచుగా నిజమైన ఫిర్యాదులను కప్పి వేస్తుందని, తద్వారా నిజంగా అవసరంలో ఉన్న వారికి న్యాయం ఆలస్యం అవుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

# మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి కన్నుమూత

### ఉమ్మడి ప్రకాశం జిల్లాకు తీరనిలోటు

**చీరాల, మే 29, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు గాదె వెంకటరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన మరణ



వార్త ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయ వర్గాలలో తీవ్రవిషాదాన్ని నింపింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ, సామాజిక ప్రము ఖులు సంతాపం వ్యక్తం చేశారు. గాదె వెంకటరెడ్డి 1940లో జూలై 10 న ఉమ్మ డి ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరులోని సాధారణ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. న్యాయశాస్త్ర పట్టా పొందిన అనంతరం ఒంగోలు కేంద్రంగా కొంతకాలం న్యాయవాద వృత్తిని నిర్వహించారు. రాజకీయాలపై ఆసక్తితో కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాసేవలో అడుగుపెట్టారు. 1967లో పర్చూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం మరో రెండుసార్లు పర్చూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గాలలో ఎక్సైజ్, దేవాదాయ ధర్మాదాయ, స్టాంపులు తదితర శాఖల మంత్రిగా సేవలందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. శ్రీమతి వీరాంజనేయమ్మ గారితో కలిసి కుటుంబ జీవితాన్ని కొనసాగించిన గాదె వెంకటరెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతరం కొన్ని రాజకీయ కారణాల వల్ల 2020లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. గాదె వెంకటరెడ్డి మరణం ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయాలకు తీరనిలోటని పలువురు నేతలు, అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

# దేవుని ముందు అందరూ సమానులే

### మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

# వివిపి దర్శనం ఎందుకు?

**చెన్నై, మే 29:** ఆలయాల్లో విఐపి దర్శనాలపై మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవుని ముందు అందరూ సమానులేనని, మంత్రులు, ఎమ్మెల్యేల కోసం దేవుడు ఎదురు చూడాలా అని ప్రశ్నిం చింది. ఆలయాల్లో విఐపిలకు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేసి ఇతర భక్తులను వేచి ఉండేలా చేయకూడదని మద్రాస్ హైకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. వృద్ధులు, దివ్యాంగులు, ఆలయ కళాకారులు, నూతన వధూవరులు, దేశాధినేతలు, రాజ్యాంగబద్ధ అధికారులు, గర్భిణీలు మొదలైన వారికి మినహాయింపునిస్తూ, ఆలయాల్లో విఐపి దర్శనం, ప్రత్యేక దర్శనాలను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీ నారాయణన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'మంత్రులు, ఎమ్మెల్యేలు ఎప్పుడైనా గుడిలోకి నడుచుకుంటూ వెళ్తే దేవుడు వారి కోసం ఎదురుచూస్తూ ఉంటాడని అనుకోవద్దు. మనకు విఐపి దర్శనం ఎందుకు కావాలి? దేవుని ముందు అందరూ సమానులే' అని కోర్టు వ్యాఖ్యానించింది. విశ్వ హిందూ పరిషత్, ఉత్తర తమిళనాడు అధ్యక్షుడు పి. చోకలింగం ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రత్యేక దర్శనాలు కల్పించడం హిందూ శాస్త్రాల్లో లేదని, ఇది భక్తులను దోచుకోవడమేనని పిటిషనర్ వాదించారు.

వృద్ధులు, గర్భిణులు, రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్నవారికి మినహాయింపునిస్తూ, వీఐపీ సంస్కృతిని రద్దు చేయాలని కోరిన ఈ పిటిషన్‌పై స్పందించిన ధర్మాసనం, వివరణ ఇవ్వడానికి తమిళనాడు ప్రభుత్వానికి 6 వారాల సమయం ఇచ్చింది.

# బండి భగీరథ్‌కు ముగిసిన కస్టడీ

### చర్లపల్లి జైలుకు తరలింపు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో అరెస్టయిన బండి భగీరథ్ మూడు రోజుల కస్టడీ శు క్రవారం ముగిసింది. దీంతో అతన్ని పేట్ బషీరాబాద్ పోలీసులు మల్కాజిగిరి ఫోక్సో కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు చ ర్లపల్లి జైలుకు తరలించారు. ఈ నెల 10న భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదు కాగా మరుసటి రోజు బాలికపై లైంగిక దాడికి సంబంధించిన సెక్షన్‌ను జోడించారు. తరువాత సాక్ష్యాలు, ఆధారాలు ధ్వంసం చేసినందుకు మరో సెక్షన్ జోడించారు.

దీంతో అజ్ఞాతంలో వెళ్లిన భగీరథ్ హైకోర్టులో మధ్యంతర బెయిల్‌కు యత్నించగా న్యాయస్థానం ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీని తరువాత ఈ నెల 16వ తేదీన భగీరథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి అతను జైల్లో వున్నాడు. కాగా మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు తీవ్రమైనది కావడంతో అతన్ని కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు మల్కాజిగిరి ఫోక్సో కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన పోలీసులు మూడు రోజుల కస్టడీకి అనుమతి పొందారు. దీని తరువాత ఈ నెల 27వ తేదీన భగీరథ్‌ను ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు కస్టడీకి తీసు కుని శుక్రవారం వరకు విచారించారు. విచారణలో భాగంగా మొయినాబాద్‌లోని అరణ్య ఫాం హౌస్‌కు, గచ్చిబౌలిలో ని ఒక అపార్ట్‌మెంట్‌కు భ గీరథ్‌ను పోలీసులు తరలించారు. మొయినాబాద్‌లోని ఫాం హౌస్‌లో గత ఏడాది డిసెంబరు 31వ తేదీన నూతన ఏడాదికి సంబంధించిన వే డుకలు జరిగాయి. ఈ వేడుకల్లోనే భగీరథ్ బాధిత బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో ఫాం హౌస్‌లో భ గీరథ్‌ను విచారించే క్రమంలో ఆ రోజున అక్కడ వున్న వారిని కూడా సిట్ అధికారులు ప్రశ్నించారు. అక్కడ ఆ నాడు ఏం జరిగిందనేదానిపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించారు. కాగా గచ్చిబౌలిలోని అపార్ట్‌మెంట్‌లో బాధిత బాలికపై భగీరథ్ పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో అక్కడ కూడా ఇతన్ని విచారించారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ను, అక్కడి సిబ్బందిని విచారించారు. ఫాం హౌస్‌తో పాటు అపార్ట్ మెంట్ వద్ద సిసి టివి ఫుటేజిలను పోలీసులు తీసుకున్నారు. ఇక చివరగా శుక్రవారం నాడు భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో రెం డు గంటల పాటు విచారించి నేరుగా గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించి, మల్కాజిగిరి ఫోక్సో కోర్టులో హాజరు పరిచారు. కే సును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి రిమాండు విధించడంతో పోలీసులు నేరుగా చర్లపల్లి జైలుకు తరలించారు.



వార్త


తమ కాళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారు.

- ట్రోయ్‌గార్డెన్

# సత్వర న్యాయం కోసమే!

కేసు ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే.. గెలిచిన వాడు కోర్టు బయట ఏడుస్తాడన్న లోకరీతి ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటుంది. దీని నడక మార్చేందుకు కోర్టులు ఎప్పుడూ సంస్కరణలు చేస్తూనే ఉంటాయి.కోర్టు న్యాయ ప్రక్రియ సజావుగా నడిపించే విషయంలో ఎప్పుడూ కింది కోర్టులకు దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేస్తూనే ఉంటుంది. అన్నీ తమ ముందుకొచ్చిన కేసుల విచారణ ప్రక్రియలో అనుసరించదగిన మార్పులను సూచించడం సర్వోన్నత న్యాయపీఠం ఎప్పటికప్పుడు సూచిస్తూనే ఉంటుంది. అలాగే సహజ న్యాయసూత్రాల నేపథ్యంలో సాటి మేధావి వర్గంతో సమాలోచన చేసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక సర్క్యులర్ ఆదేశాల ద్వారా గాని, కోర్టు వ్యవహారశైలి, కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించడంలో ఔచిత్యాలను మార్గదర్శకాల రూపంలో జారీ చేస్తుంది. ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం రెండు ప్రధాన అంశాలకు సంబంధించి జాప్యాన్ని నివారించి కక్షిదారులకు ఉపశమనం కలిగించే నియమావళిని పేర్కొంటూ తగు సూచనలు పాటించాలని ఆదేశాలను జారీ చేసింది. కోర్టులో పెండింగ్ కేసులు అపరిష్కృతంగా ఉండిపోవటం ఒక సమస్య అయితే కోర్టుల్లో అనుసరించాల్సిన విధి విధాన ప్రక్రియలో స్పష్టమైన మార్గదర్శకాలు లేక నాన్చుడు వైఖరిలో కూరుకుపోవడం మరోప్రధాన అంశం. కోర్టుల్లో విచారణ పూర్తయినా తీర్పు వెలువరించాల్సిన అంశాల్లో వ్యవహరించాల్సిన విధి విధానాలు, మానవ అక్రమ రవాణా నిరోధంపై కొన్ని చారిత్రాత్మక మార్గదర్శకాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మరో ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ విపిన్ పంచోలితో కూడిన ధర్మాసనం మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో కక్షిదారులు జాప్యాన్ని భరించలేక సహనం కోల్పోతాడు. తీరావిచారణ తర్వాత సాగే ప్రక్రియల్లోనూ జాప్యం జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లో కక్షిదారు సరైన ఉపశమనం లభించక నిరుత్సాహంతో కృంగిపోతాడు. ఇలాంటి కేసులకు సంబంధించిన అంశాల పరిష్కారంలో సుప్రీం ధర్మాసనం పలు పరిష్కారాలు చూపింది. ఏదేని కేసులో విచారణ పూర్తయ్యాక వెలువరించాల్సిన తీర్పుకు మూడు నెలల్లోగానే కోర్టు తీర్పు వెలువరించాలి. తీర్పు వెలువరించిన మరుసటి రోజునే కోర్టు వెబ్‌సైట్‌లో ఆదేశాల కాపీ అప్‌లోడ్ చేయాలి. సాధారణంగానే తీర్పుల్లో కలిగే ఆలస్యం సామాన్యునికిఆవేదన కలిగిస్తుంది. న్యాయస్థానాలపై, వాటి తీరుతెన్నులపై ఆవేశాన్ని రగిలిస్తుంది. అయినా పేదవాని కోపం పెదవికి చేటు అన్న చందాన కోర్టుల్లో ఏమి జరిగినా నిస్సహాయంగా, మౌనంగా ఉండిపోవడమే తప్ప మరో మాట్లాడలేని పరిస్థితి ఉంటుంది. ఖైదీల విడుదలలో కూడా ఎలాంటి జాప్యం కలుగనీయ వద్దు. బెయిల్ ఉత్తర్వులు రద్దుచేస్తే వెంటనే ట్రయల్ కోర్టుకు తెలిపే బాధ్యత హైకోర్టులదేనని స్పష్టం చేసింది. ఇన్నాళ్లకైనా తీర్పులకు సంబంధించి ఎన్నో సందిగ్ధాలకు సమాధానలిచ్చినందున కనీసం కొన్ని కేసుల్లోనైనా కాస్త ఊరట లభిస్తుంది. ఇటీవల కాలంలో కారణం ఏదైతేనేం కోర్టులు తీర్పులను వెలువరించడం, తీర్పు పూర్తి పాఠాలను అప్‌లోడ్ చేయడంలో విపరీతమైన జాప్యం జరగడంపై కక్షిదారులకు న్యాయస్థానంపై నమ్మకం సన్నగిల్లుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తీర్పులు జాప్యానికి చెక్ పెట్టే దశగా సర్వోన్నత న్యాయస్థానం తాజా నిర్ణయాలు తీసుకొంది. వాటిని హైకోర్టులకు, కింది కోర్టులకు పంపింది. తగు నిబంధనలు పాటించనట్లయితే సదరు కేసులను ఇతర బెంచ్‌లకు బదలీ చేసే అవకాశముందని పేర్కొంది. బెయిల్ ఉత్తర్వును మరుసటి రోజే ప్రకటించాలని, అదే రోజు జైలు అధికారులకు ఆ ఆదేశాలను పంపాలి. బెయిల్ పొందిన అండర్ ట్రయల్ ఖైదీలను ఏ మాత్రం అవకాశంలేకున్నా అదే రోజుకానీ మరుసటిరోజు కానీ విడుదల చేయాలని సూచించింది. తీర్పు రోజున కోర్టు తీర్పు ప్రధాన భాగాన్ని పూర్తయిన 7 రోజుల్లోగా తీర్పు పూర్తి పాఠాన్ని అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ పాటించేందుకు వీలుగా సహకరించే అన్ని అంశాలలో వెబ్‌సైట్‌లను మార్చవలసి వస్తే మార్చాలి.గత యేడాది జార్ఖండ్ హైకోర్టు వెలువరించిన ఒక తీర్పును వెబ్‌సైట్‌లోఅప్‌లోడ్ చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహించింది. ఈ విషయమైదాఖలైన పిటిషన్‌ను పరిష్కరిస్తూ కోర్టులో న్యాయ ప్రక్రియ, ఆదేశాల అమలు నవ్వులు పాలు కాకుండా ఉండే దిశగా పలు నిర్ణయాలు ప్రకటించింది. సాధారణ పౌరులకుండే అన్నిహక్కులూ సెక్స్‌వర్కర్లకు ఉంటాయని వారి పట్ల గౌరవప్రదంగానే వ్యవహరించాలని పోలీసు శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది.వారికి ధృవపత్రాలున్నా లేకున్నా ఆధార్ కార్డులివ్వాలంది. వారికీ సంక్షేమ పథకాలందించడం విధియని పేర్కొంది. స్వచ్ఛందంగా సెక్స్ వర్కర్లుగా జీవనాన్ని గడుపుతున్నవారిపై కేసులుపెట్టడం, వారి ఫొటోలు, వీడియోలతో అల్లరి పెట్టడమో సమంజసం కాదని ప్రభోదించింది. మానవ అక్రమ రవాణా ద్వారా బలవంతంగా సెక్స్‌వర్కర్ల కూపంలోకిదింపబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు కీలకమార్గదర్శకాలను జారీ చేసింది.తాజాగా సుప్రీం జారీ చేసిన మార్గదర్శకాలు దగాపడిన మహిళలపై పోలీసు దాడులు లేకుండా ఊరట కలిగిస్తోంది. ఇకపై సెక్స్ వర్కర్లపై అనుచిత దాడులుండవని ఆశిద్దాం. కోర్టు కేసుల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న కక్షిదారులలో కొందరికైనా తీర్పు అనంతర పర్యవసాన ఫలితాలు త్వరితగతిన దక్కే అవకాశముంది.

ఏమీ చేయకుండానే చేశాననేవాడు అధముడు. కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.



ఆదిశంకరాచార్యులు

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### వడదెబ్బ ముప్పు

ఈ ఏడాది సూర్యుడి ప్రతాపం మునుపెన్నడూ లేనంత తీవ్రంగా ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వేసవి ఎండలు మండుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఒక జాతీయ విపత్తును తలపిస్తోంది. ఈతీవ్రమైన వడగాల్పుల నుండి ప్రజలను రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలతో కలిసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. వడదెబ్బపైఅవగాహన కల్పించడంతో పాటు చికిత్స సౌకర్యాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు,వీధివ్యాపారులు, వ్యవసాయ కూలీలు వంటి పేద వర్గాలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరికి సామాజిక భద్రతా చర్యలు కల్పించడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ప్రతి చోటా సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలి. బహిరంగ ప్రదేశాలలో తాత్కాలిక నీడ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. చలివేంద్రాల ద్వారా మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం ద్వారా వడదెబ్బ ముప్పును తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అతి నిద్ర ప్రమాదకరం

మానవ జీవితంలో నీరు,ఆరోగ్యం, ఆహారం,నిద్ర చాలా విలువైనవి.ప్రధానంగా సాధారణ మనిషికి 8 నుండి 10 గంటల నిద్ర చాలు అయినప్పటికీ కొందరు వ్యక్తులు అతి నిద్ర పోతుంటారు. ఇలాంటి వ్యక్తుల ఆరోగ్యం సమతుల్యత లేకపోవడంతో భవిష్యత్తులో దెబ్బతినే అవకాశాలు మెండుగా ఉంటాయి. అతి నిద్ర వల్ల ఉబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంది. ఒకసారి ఆరోగ్యపరంగా దెబ్బతింటే కోలుకోవడం కష్టం. కనుక ప్రతి రోజు సమంతరమైన నిద్ర సమయాన్ని పాటిస్తేనే ఆరోగ్యం బాగుంటుందనీ వైద్యులు సూచిస్తున్నారు. శరీరానికి వ్యాయామం కూడా చాలా అవసరం. కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### శేషన్‌కి ఎవరూ సాటిరారు

**పశుసంవర్ధక** ఇప్పటికిప్పుడు కాకపోయినా కొంత కాలం తరువాత ఎలక్షన్‌కమిషన్ జ్ఞానేష్‌కుమార్ తప్పుకోవలసిందే. ఆ పదవిలోకి మరొకరు రావలసిందే. అలా వచ్చిన వారు ఆరోపణలు ఎదుర్కొంటూ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌లా కాకూడదు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి.

-ఎం.ఎస్.శర్మ, హైదరాబాద్

### ఉసురు తీస్తున్న అకాల వర్షాలు!

గత 5 సంవత్సరాలుగా వాతావరణం అదుపు తప్పి ఎండాకాలంలో సైతం అకాలవర్షాలు కురుస్తూ,మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో రైతన్నల కష్టానికి తూట్లు పొడుస్తూ చేతికొచ్చిన పంటను ఈ అకాల వర్షాలు చాలా తీవ్ర స్థాయిలో నష్టాలు చేకూరుస్తున్నాయి అనే మాట సత్య దూరం కాదు.దీంతో ఎండాకాలంలో మొక్కజొన్న,కొర్ర,వరి పంటలు వేసిన రైతుల పరిస్థితి దినదిన గండంగామారుతున్నది.ఎందుకంటే ఎప్పుడు ఎలా ఏరూపంలో దాపురిస్తాయో తెలియని ఈ అకాల వర్షాల మూలాన రైతన్నల కంటి మీద కునుకు లేకుండా పోతున్నది. ఒక్కొక్కసారి కొంతమంది రైతన్నల తలరాత బాగుండి నాలుగు ఐదురోజులు వర్షాలు కురువకపోతే తాము పండించిన పంటలను త్వరగా అరబెట్టి మిషన్‌లలో వేసి ధాన్యాన్ని వ్యాపారస్తులకు అమ్మడమోలేదా ఇంటికి చేర్చుకోవడమే జరిగి సురక్షితంగా బయట పడుతూ వుంటారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుత ఏపిలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏ ప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, మహిళ విద్యార్థినీలకు ఇబ్బందిలేకుండా ఉంటుంది.ఇవి లేనందున కొందరు అమ్మాయిలు వేరే ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అతి సహజమైనది. కొందరు బడి మానివేయడం బాధాకరం. వీరు చెప్పే ధైర్యం లేక అలా చేస్తున్నారు. ఇది చిన్న సమస్య. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### బడిబాటకు వేళాయె..

మరికొద్ది రోజుల్లో స్కూళ్లు ప్రారంభమవుతాయి. వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపిన బాల బాలికలు ఇక పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం ఆసన్నమయింది. మొదటిసారి బడికి వెళ్లే పిల్లలు మారం చేయడం సహజం. అలాగే అల్లరి కూడా. ప్రథమ గురువు తల్లి అంటారు. కీలక పాత్ర మాతృమూర్తిదే అంటే అతిశయోక్తి కాదు. పాఠశాలలో స్నేహితులకుకొరతలేదు.క్రమంతప్పకుండా సమయపాలన పాటిస్తూ బడికి వెళ్లి చదివేలా చేయాలి. బిడ్డ బంగారు భవిష్యత్తుకై అహర్నిశలు పోరాడే తల్లిదండ్రుల బాధ్యత వెలకట్టలేనిది.

- ఆర్. వెంకటేశ్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# మాటల్లోనే వ్యవ'సాయం'

**మనదేశంలో మొత్తం భూభాగంలోనలభైఐదు శాతం పైగా వ్యవసాయ యోగ్యమైనదని అంచనా. పొరుగునున్న చైనాలో పదిపన్నెండు శాతానికి మించి లేదు. కానీ అక్కడ వూహించిన రీతిలో దిగుబడులు సాధిస్తున్నది. నిజమైన భారతదేశం గ్రామాల్లో ఉందని,గ్రామస్వరాజ్యం సాధించిన నాడే నిజమైన స్వాతంత్ర ఫలాలు అందినట్లని మహాత్ముడు చేసిన ప్రవచనం నేటికి ప్రామాణికమైనదే. మనదేశానికి వ్యవసాయమే జీవనాధారమన్న నిజాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ విషయం మొన్నటి కరోనాతో పాటు ఎన్నోసార్లు రుజువు అయింది. ఏదిఏమైనా రైతుల కష్టాలు రోజురోజు పెరుగుతున్నాయి. అందుకే ఒకనాడు వ్యవసాయం చేయడం గర్వంగా భావించే రైతులు నేడు ఏజన్మలో చేసుకొన్న పాపమో వ్యవసాయమే జీవనాధారంగా జీవించాల్సి వస్తున్నదని అన్నదాతలు వాపోయే దురదృష్టపరిస్థితులు దాపురించాయి.**

దామెర్ల సాయిబాబ

ఉన్నత పదవులు అధిష్టించేకొద్దీ, బాధ్యతలు పెరిగే కొద్దీ, వారి మాటలకు విలువ పెరుగుతుంది. అందులోనూ కీలక పదవుల్లో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాటకు ఎంతో విలువ ఉంటుంది. అందుకే బాధ్యత కలిగిన కీలకమైన మంత్రి పదవుల్లో ఉన్నవారు ఆచి తూచి ఆలోచించి మాట్లాడాలి. వారి నోట వెంట వెలువడే ప్రతి పలుకు ప్రభుత్వ ఉద్దేశ్యంగా ప్రజలు భావిస్తారు. ఆ మాటల వల్ల వచ్చే మంచి, చెడుల ప్రభావం పాలనపై పడుతుంది. ఎందుకోఏమోకానీ రైతుల విషయంలో పాలకులు ఇస్తున్న హామీలు, వాగ్దానాలకు, చేతలకు పొంతన లేకుండాపోతున్నది. విత్తన కొరత ఉండదు, సకాలంలో రుణాల పంపిణీ చేస్తాం,ఎరువుల సమస్య ఉండదు, అవసరం మేరకు అన్ని గోదాముల్లో నిల్వ ఉంచుతాం,అవసరమైతే అదనపు నిల్వలు తెప్పిస్తాం, ఏ రైతు విత్తనాలు, రుణాలకు, ఎరువులకు ఇబ్బంది పడకుండా చూస్తాం, నకిలీ, నాసిరకంపై ఉక్కు పాదం మోపి రైతులు మోసపోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఖరీఫ్ ముందు పెద్దపెద్ద మాటలు చెప్తారు. ఇదేదో ప్రస్తుత ప్రభుత్వాలు వచ్చిన తర్వాత చెబుతున్నారని చెప్పడం లేదు. ఏనాటి నుంచో జరుగుతున్నది. వ్యవసాయం,బ్యాంకు తదితర సంబంధిత శాఖలకు చెందిన ఉన్నతాధికారులందరూ ఖరీఫ్ ఆరంభానికి ముందే ఒక ప్రణాళిక తయారు చేసి సుదీర్ఘంగా చర్చించి ముసాయిదాను రూపొందిస్తారు. ఎరువులు ఎంత కావాలి? విత్తనాలు ఎన్ని కావాలి? బ్యాంకు నుంచి రుణాలు ఎంత ఇవ్వాలి? తదితర అంశాలన్నీ పొందుపరిచి పక్కా ప్రణాళికను తయారు చేసి ఆమోదముద్ర వేస్తారు. ఇది ప్రతి సంవత్సరం జరిగే తంతే. అయితే ఈ ప్రణాళిక ఎవరికోసం ఉద్దేశించబడిందో, ఎవరు ఆచరించాలో ఆ అన్నదాతలకే తెలియదు. కనీసం ఆ రైతు ప్రతినిధులకు కూడా అందులో ప్రవేశం ఉండదు. వారిని సంప్రదించే పద్ధతి కూడా లేదు. అసలు నిజానికి రైతులకు తమపై ఒక ప్రణాళిక తయారు చేస్తున్నారనే విషయం కూడా తెలియదు. ఇకపోతే అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి తయారు చేసిన ప్రణాళిక వాస్తవంగా రైతుల సాగుకు చాలా సందర్భాల్లో పొంతన ఉండడం లేదు. మనదేశంలో ఇప్పటికీ అధికశాతం సాగు వర్షాధారం మీదనే ఆధారపడి ఉంది. వర్షాలు, నీటి ఆధారాలను బట్టి ఏయే పంటలు ఎప్పుడు వేయాలి? ఏయే విత్తనాలు వాడాలి? తదితర అంశాలు రైతులే ఆయా ప్రాంతాలను బట్టి నిర్ణయించుకుంటున్నారు. అందరు ఊహించినట్లుగానే రోహిణికార్తెలోనే వర్షాలు ఆరంభమై సకాలంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి నీరు వస్తే విత్తే వంగడాలు వేరు. ఆ వర్షాలు ఆలస్యమైతే నీరు సమృద్ధిగా లేకపోతే విత్తే విత్తనాలు వేరు. ఇలా వర్షాలను బట్టి పరిస్థితులను బట్టి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇవన్నీ అధికారులకు తెలియంది కాదు. వారు జీతభత్యాలు తీసుకుంటున్నారు గనుక వారి పాటికి వారు రికార్డులేవో తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంటారు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి రోహిణికార్తె సోమవారం ఆరంభమైంది. వర్షాల ఆగమనంతో రకరకాల అంచనాలు వెలువడుతున్నాయి.ఎల్‌నినో వల్ల ఈ యేడాది వర్షాలు తగ్గుముఖం పట్టొచ్చని కొన్ని అంచనాలు చెబుతుంటే లేదు సాధారణ వర్షపాతం నమోదవుతుందని మరికొందరు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక పంటల విషయానికి వస్తే కూరగాయలు, పప్పుదినుసుల సాగు రాను రాను తగ్గిపోతున్నది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా

## ఒక్క మాట

కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఏ పంటలు ఎప్పుడు వేసుకోవాలో రైతులకు కొత్తగా ఉద్బోధించాల్సిన అవసరం ఉండదు.వారికి ఎంతో అనుభవం ఉంది. కానీ నూతనంగా అందుబాటులోకి వచ్చిన, వస్తున్న సాంకేతికత రైతులకు చేర్చడంలో అంతగా సఫలీకృతం కాలేకపోతున్నారు.పత్తి పెట్టొద్దు ప్రాణంమీదకు తెచ్చుకోవద్దు అని ఎందరు ఎన్ని విధాలుగా చెబుతున్నా చావో,బతుకో పత్తిలోనే తేల్చుకోవాలనే ధ్యేయంతో పత్తి సాగు వైపే మొగ్గుచూపుతున్నారు. వరి పంట వేయాలని ఏ రైతూ కోరుకోడు. లాభసాటిగా ఉండి, ప్రకృతి ఆటుపోట్లను తట్టుకోగలిగితే ఏ సాగు అయినా చేయడానికి రైతు వెనుకంజ వేయడు. తెలుగురాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు అంతగా అనుకూలించడం లేదు. అయితే అనావృష్టి, లేకపోతే అతివృష్టి ఈరెండూ కాకపోతే అకాల వర్షాలతో ప్రకృతి రైతుపై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నది. విత్తనాలు నాటి నుండి పంట చేతికి వచ్చేవరకు దేవుని మీదనే భారంవేసి గుండెలను అరచేతిలో పెట్టుకొని కాలం గడపాల్సి వస్తున్నది. చీడపీడలు ఆశిస్తేనో, నకిలీ విత్తనాలతో మోసపోతేనో,ఆరంభంలోనే ఆశలు అడుగంటిపోతాయి. ముఖ్యంగా నకిలీ, నాసిరకం విత్తనాలు, పురుగు మందులు వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. అన్నీ బాగుండి కాలం కలిసివచ్చి పంట చేతికంది మార్కెట్లోకి తీసుకువెళ్లితే తూకంలో మోసం, ధరల్లో దగా, ఒకటే మిటి ఎవరికి వీలైతేవారు రైతులను దోచుకుంటున్నారు. రైతులకు ఏమీ మిగలడంలేదు. అందుకే కాస్తోకూస్తో పంట దక్కిన రైతులుకూడా గంపెడు దరిద్రంతో అల్లాడుతున్నారు. రైతులు చారణా రాబడికి బారాణా ఖర్చు అన్నట్లుగా వాణిజ్య పంటల రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పండ్ల తోటల రైతులపరిస్థితి మరింత దారుణంగా ఉంది. యేడాది పాటు కాయకష్టం అంతా చేసి పంట నోటికి అందుతున్న దశలో అకాల వర్షాలు, కాయలు నేల రాలిపోతే యేడాది శ్రమ నీటిపాలైనట్లే. ఈయేడాది తెలుగు రాష్ట్రాల్లో మామిడి రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచిపోయాయి. ధరలు పాతాలలోకానికి పడిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం, డోకూరుకు చెందిన గంగుల నర్సింహ ముల కుటుంబ విషాద గాథ వింటేఎంతటి కఠినహృదయమైనా కరగక తప్పదు. మామిడి తోటను లీజుకు తీసుకొని గత ఐదారేళ్లుగా రాత్రింబవళ్లు కష్టం చేస్తూనే ఉన్నారు. ఈ యేడాది కూడా కౌలు డబ్బులు చెల్లించారు. ప్రకృతి సహకరించకపోవడం, మరొకపక్క చీడ పీడలు అన్నీకలిపిఆయన్ని నష్టాల ఊబిలోకి దించాయి. అరవై లక్షల వరకు అప్పులు చేస్తే అవి వడ్డీలతో కోటిఇరవై లక్షలవరకు పెరిగింది.ఇంటిపై రుణం తీసుకొని కొన్ని చెల్లించినా ఆ తర్వాత కిస్తులు కట్టలేని పరిస్థితికి చేరుకున్నాడు. ప్రైవేట్ అప్పులు ఆయనకు తలకుమించిన భారంగా తయారయ్యాయి. ఫైనాన్షియర్లు ఆయన ఇంటికి నోటీసులు అంటించి దాదాపు రెండు లక్షల విలువైన ఆయన భార్యపై ఉన్న బంగారు నగలు తీసుకు వెళ్లారు. ఒత్తిడిలు భరించలేక వారిపై కేసు పెట్టి కోర్టుకు వెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా వేధింపులు తప్పలేదు. ఇలా తనను వేధిస్తున్న వారి కొందరి పేర్లను ఒక వీడియో ద్వారా వెల్లడించి అప్‌లోడ్ చేశాడు. ఈ బాధలను భరించలేక గత మంగళవారం తన భార్యను, ఇద్దరి పిల్లలనుకాళ్ల చేతులు కట్టివేసి నీటి కుంటలో పడేశాడు. ఇదంతా తన బంధువులకు ఫోన్ ద్వారా తెలిపి తాను ఉరివేసుకున్నాడు. ఇలాఎందరో అన్నదాతలు తాము బలవంతపు మరణాలకు పాల్పడడమే కాదు కుటుంబం వీధిన పడుతుందనే భయంతో తమతో పాటే వారిని కూడా తీసు కుపోతున్నారు. మన దేశంలో మొత్తం భూభాగంలోనలభైఐదు శాతం పైగా వ్యవసాయ యోగ్యమైనదని అంచనా. పొరుగునున్న చైనాలో పదిపన్నెండు శాతానికి మించి లేదు. కానీ అక్కడ వూహించిన రీతిలో దిగుబడులు సాధిస్తున్నది.నిజమైన భారతదేశం గ్రామాల్లో ఉందని,గ్రామస్వరాజ్యం సాధించిన నాడేనిజమైన స్వాతంత్ర ఫలాలు అందినట్లని మహాత్ముడు చేసిన ప్రవచనం నేటికి ప్రామాణికమైనదే. మనదేశానికి వ్యవసాయమే జీవనాధారమన్న నిజాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ విషయం మొన్నటి కరోనాతో పాటు ఎన్నో సార్లు రుజువు అయింది. ఏదిఏమైనా రైతుల కష్టాలు రోజురోజు పెరుగుతున్నాయి. అందుకే ఒకనాడు వ్యవసాయం చేయడం గర్వంగా భావించే రైతులు నేడు ఏజన్మలో చేసుకొన్న పాపమో వ్యవసాయమే జీవనాధారంగా జీవించాల్సి వస్తున్నదని అన్నదాతలు వాపోయే దురదృష్ట పరిస్థితులు దాపురించాయి. •

# దేశాభివృద్ధికి నూతన ఆవిష్కరణలే పరిష్కారమా?


డి. జయరాం

ప్రపంచం కృత్రిమ మేధ, ఆటోమేషన్, డిజిటల్ విప్లవం గురించి గొప్పగా మాట్లాడుతున్న ఈ కాలంలో కూడా కోట్లాది మంది ప్రజలు ఇంకా ప్రాథమిక సాంకేతిక సేవలకే దూరంగా ఉండటం అభివృద్ధి యుగంలోని అతి పెద్ద వైరుధ్యాల్లో ఒకటి. ఒకవైపు మానవుడు అంతరిక్ష పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహిస్తుంటే, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఒక విద్యార్థి సరైన ఇంటర్నెట్ సౌకర్యం లేక చదువును కొనసాగించలేకపోతున్నాడు. ఒకరైతు మార్కెట్ ధరలు తెలియక నష్టపోతున్నాడు. ఒక పేదరోగి వైద్య సేవలు అందక ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఈ దృశ్యాలు మన ముందుకు ఒక అసౌకర్యమైన ప్రశ్నను తీసుకొస్తున్నాయి. అభివృద్ధి నిజంగా అందరికీ చేరుతోందా? ఆర్థిక వృద్ధి అనేది కేవలం గణాంకాల పెరుగుదల కాదు. అది ప్రతిమనిషి జీవితంలో గౌరవాన్ని,అవకాశాన్ని, భద్రతను తీసుకురాగలిగితేనే దానికి అసలు అర్థం ఉంటుంది. లేకపోతే అభివృద్ధి అనే పదం నివేదికలలో కనిపించే సంఖ్యలకే పరిమితమైపోతుంది. ఈ నేపథ్యంలోనే సమ్మిళిత వృద్ధి కోసం బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు అనే భావన ప్రాధాన్యం సంతరించుకుంది. సాంకేతికత అందరికీ చేరకపోతే అది అభివృద్ధి కాదు. కొత్త రూపంలో అసమానతకు వేసిన పునాది మాత్రమే. సాంకేతికపురోగతి కేవలం లాభాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను కూడా మోసుకెళ్లాలి. ఎందుకంటే సాంకేతికతకు సామాజిక స్పృహ లేకపోతే అది పురోగతికన్నా అసమానతను మరింత వేగంగా పెంచే ప్రమాదం ఉంది. ఈరోజు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఆదాయ అసమానత ఒకటి. సాంకేతిక పురోగతి పెరుగుతున్న కొద్దీ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. ఆవిష్కరణల ఫలాలు అందరికీ చేరకపోతే అభివృద్ధి అనేది కొందరి ప్రత్యేక హక్కుగా మారే ప్రమాదం ఉంది. అందుకే సమ్మిళిత వృద్ధి ఇప్పుడు కేవలం ఆర్థిక చర్చమాత్రమే కాదు,సామాజిక న్యాయానికి సంబంధించిన ప్రశ్నగా మారింది. బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు ఎందుకు అవసరం? సమ్మిళిత వృద్ధిని సాధించడంలో బాధ్యతాయుతమైన ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయి. వ్యవసాయ రంగంలో చిన్న రైతులకు తక్కువ ఖర్చుతో నీటి సంరక్షణ పద్ధతులు, మొబైల్ ద్వారా మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారాన్ని అందించడం వంటి చర్యలు వారి ఆదాయాన్ని పెంచడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో గౌరవప్రదమైన స్థానాన్ని కూడా కల్పిస్తాయి. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతు నేరుగా మార్కెట్‌ను చేరుకునే స్థితికి చేరుకోవచ్చు. ఆరోగ్య రంగంలో టెలిమెడిసిన్ సేవలు, తక్కువ ధరలో లభించే రోగ నిర్ధారణ పరికరాలు గ్రామీణ ప్రజలకు ప్రాణభరోసాగా మారగలవు. విద్యా రంగంలో డిజిటల్ వేదికలు గ్రామీణ విద్యార్థులకు అవకాశాల తలుపులు తెరవగలవు. సరైన దిశలో వినియోగిస్తే సాంకేతికత సామాజిక అంతరాలను తగ్గించే శక్తిగా మారుతుంది. తప్పు దిశలో ప్రయాణిస్తే అదే సాంకేతికత కొత్త గోడలను కూడా నిర్మించగలదు. పట్టణాల్లో వేగంగా విస్తరిస్తున్న సాంకేతిక సదుపాయాలు గ్రామీణ ప్రాంతాలకు అదే స్థాయిలో చేరడంలేదు. స్మార్ట్‌ఫోన్‌లు పెరిగినావాటినివిద్య, ఉపాధి, వ్యాపార అవసరాలకు సమర్థంగా ఉపయోగించే సామర్థ్యం ఇంకా పరిమితంగానే ఉంది. లాభం మాత్రమే లక్ష్యమైతే సమాజం వెనుకబడుతుంది.పరిశోధనవ్యయాలు పెరగడం వల్ల అనేక సాంకేతిక ఉత్పత్తులుఅధిక ధరలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఫలితంగా వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు దూరమవుతున్నాయి. మరోవైపు కృత్రిమ మేధ,ఆటోమేషన్ ఉత్పాదకతను పెంచుతున్నప్పటికీ ఉపాధి రంగంపై కొత్త ఒత్తిడులను సృష్టిస్తున్నాయి. ఒకవైపు పరిశ్రమలు నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటుంటే, మరోవైపు లక్షలాదిమంది యువతఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు.ఉపాధిని కోల్పోయిన వ్యక్తికి 'అభివృద్ధి' అనే పదం తరచుగా శూన్యంగా వినిపిస్తుంది. ఈసవాళ్లను అధిగమించాలంటే డిజిటల్ మౌలిక సదుపాయాలను ప్రజా హక్కుగా చూడాలి. ఇంటర్నెట్‌ను కేవలం సమాచార సాధనంగా కాకుండా విద్య, వైద్యం, వ్యవసాయ సేవలను స్థానిక భాషల్లో అందించే వేదికగా అభివృద్ధి చేయాలి.పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులను పెంచాలి. గ్రామీణసమస్యలకు పరిష్కారాలు చూపే తక్కువ ఖర్చు ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రోత్సాహం అవసరం. ప్రయోగశాలల్లో పుట్టిన ఆలోచనలు సమాజంలో మార్పు తీసుకురావాలంటే పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాల మధ్య సమన్వయం పెరగాలి. అలాగే 'రిస్కిల్లింగ్' 'అప్‌స్కిల్లింగ్' కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలి. సాంకేతికత ఉపాధిని హరించే శక్తిగా కాకుండా అవకాశాలను విస్తరించే సాధనంగా మారాలి. •

# 'ఆన్‌లైన్' మూల్యాంకనం'లో పారదర్శకత సాధ్యమేనా?

టి.నాగరాజు

దేశంలోనే అతిపెద్ద విద్యా బోర్డు అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఈసారి అమలు చేసిన డిజిటల్ మూల్యాంకన విధానం తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. 'డిజిటల్ ఇండియా', 'న్యూ ఇండియా', 'టెక్నాలజీ విప్లవం' అంటూ కేంద్ర ప్రభుత్వం చేసే ఆర్భాట ప్రచారానికి భిన్నంగా వాస్తవ పరిస్థితులు మాత్రం దేశ విద్యావ్యవస్థలోని ప్రమాదకరమైన బలహీనతలను బయట పెట్టాయి. విద్యార్థుల జీవితాలతో నేరుగా సంబంధం ఉన్న పరీక్షా మూల్యాంకన ప్రక్రియను సరైన సన్నద్ధత లేకుండా డిజిటల్ ప్రయోగంగా మార్చడం వల్ల లక్షలాది కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. ఈ ఏడాది క్లాస్ 12 బోర్డు పరీక్షల కోసం తొలిసారిగా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని అమలు చేశారు. కోటి సంఖ్యలో సమాధాన పత్రాలను స్కాన్ చేసి దేశవ్యాప్తంగా వేలాది ఎగ్జామినర్లతో ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహించారు. అధికారికంగాచూస్తే ఇది పారదర్శకత, వేగం, సాంకేతిక ఆధునికత పేరుతో తీసుకొచ్చిన సంస్కరణ. కానీ ఫలితాలు వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆవేదన వెల్లువెత్తింది. ప్రత్యేకంగా ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి సబ్జెక్టుల్లో అనూహ్యంగా మార్కులు తగ్గిపోయాయని వేలాది మంది విద్యార్థులు ఆరోపించారు. 'రెండేళ్లు కష్టపడి చదివాం.. కానీ బ్లర్ అయిన స్కాన్‌ల ఆధారంగా మా భవిష్యత్తును తీర్పు చెప్పారు' అంటూ విద్యార్థులు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోవడం కూడా అనుమానాలకు బలం చేకూర్చింది. అసలు సమస్య సాంకేతికతలో కాదు, దాన్ని అమలు చేసేప్రభుత్వ ధోరణిలోనే ఉందని నిపుణులు చెబుతున్నారు. లక్షలాది ఆన్సర్ షీట్లను స్కాన్ చేసే ప్రక్రియలో నాణ్యత నియంత్రణ లేకపోవడం, పోర్టల్ సామర్థ్యం తక్కువగా ఉండటం, ఎగ్జామినర్లకు తగిన శిక్షణ లేకపోవడం వంటి అంశాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. 'డిజిటల్ అనే పేరుతో వ్యవస్థను ప్రకటించడం సులువు. కానీ దాన్నిప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకుండా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే బాధ్యతలో సీబీఎస్‌ఈ విఫలమైంది. రికార్డు స్థాయిలో విద్యార్థులు రీవెరిఫికేషన్, ఆన్సర్ షీట్ కాపీల కోసం దరఖాస్తు చేయడం సాధారణ విషయం కాదు. ఇది విద్యార్థుల్లో బోర్డుపై పెరుగుతున్న అనిశ్చితికి నిదర్శనం. పోర్టల్ల వరుసగా క్రాష్ కావడం, ఫీజులు పలుమార్లు కట్ కావడం, అప్లికేషన్లు మధ్యలో ఆగిపోవడం వంటి ఘటనలు



'డిజిటల్ ఇండియా' ప్రచారానికి అసలు అద్దం పట్టాయి. ప్రభుత్వ ప్రకటనల్లో కనిపించే సాంకేతిక విజ్ఞానం, ప్రజల అనుభవాల్లో మాత్రం గందరగోళంగా మారుతోంది. ఇక తారుమారైన ఆన్సర్ షీట్ ఘటన పరిస్థితిని మరింత దిగజార్చింది. ఒక విద్యార్థి రోల్ నంబర్‌కు మరో విద్యార్థి సమాధాన పత్రం అప్‌లోడ్ కావడం చిన్న పొరపాటు కాదు. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నట్టే. తర్వాత సీబీఎస్‌ఈ తప్పును అంగీకరించినా అప్పటికే వేలాది కుటుంబాల్లో భయం వ్యాపించింది. మా ఆన్సర్ షీట్ నిజంగానే మాదేనా? అనే అనుమానం విద్యార్థుల్లో పెరిగింది. హ్యాకింగ్ ఆరోపణలు పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మార్చాయి. ఒక విద్యార్థి తాను కేవలం అరగంటలో మూల్యాంకన వ్యవస్థలోకి ప్రవేశించానని చెప్పడం దేశ విద్యా భద్రతపైనే ప్రశ్నలు లేవనెత్తింది. సీబీఎస్‌ఈ ఈ ఆరోపణలను ఖండించినా, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉన్న అనుమానాలు తొలగలేదు. ప్రజల వ్యక్తిగత డేటా, విద్యా రికార్డులు ఎంత భద్రంగా ఉన్నాయన్న ప్రశ్న ఇప్పుడు మరింత తీవ్రమైంది. ఈ మొత్తం వ్యవహారం మరో ప్రమాదకర ధోరణిని కూడా బయటపెట్టింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలను బలోపేతం చేయకుండా, ప్రైవేట్ ఎడ్యుటెక్ కంపెనీలు, కార్పొరేట్ సాంకేతిక వ్యవస్థలపై ఆధారపడటం పెరుగుతోంది. విద్యను హక్కుగా కాకుండా మార్కెట్ ఉత్పత్తిగా మార్చే విధానాల ఫలితమే ఈ పరిస్థితి. సాంకేతికతను విద్యలో ఉపయోగించడం తప్పు కాదు. కానీ విద్యార్థుల భవిష్యత్తును కార్పొరేట్ ప్రయోగాలకు అప్పగించడం ప్రమాదకరం. ఇది కేవలం సాంకేతిక వైఫల్యం మాత్రమే కాదు. ఇది దేశ విద్యావిధాన దిశను ప్రశ్నించే సంఘటన. విద్యార్థులను 'డేటా'గా చూసే విధానం, ఉపాధ్యాయుల పాత్రను తగ్గించే విధానం, ప్రభుత్వ బాధ్యతలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే విధానం ఇవన్నీకలిసి ఇప్పుడు విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెడుతున్నాయి. కేంద్రప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' పేరుతో ప్రచారం చేస్తున్న అభివృద్ధి నమూనా వాస్తవానికి ప్రజల అనుభవాల్లో ఎంత బలహీనంగా ఉందో సీబీఎస్‌ఈ ఘటన మరోసారి నిరూపించింది. ప్రజా వ్యవస్థలను బలోపేతం చేయకుండా కేవలం యాప్‌లు, పోర్టల్లు, ప్రకటనలతో దేశం ముందుకు సాగదు. ముఖ్యంగా విద్య వంటి అత్యంత కీలక రంగంలో ప్రయోగాలు కాదు, బాధ్యతాయుతమైన విధానాలు అవసరం. విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ ప్రచార నినాదాల కంటే గొప్పది. 'డిజిటల్ ఇండియా' నిజంగా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలంటే ముందుగా విద్యావ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, మానవీయ దృక్పథం ఉండాలి. లేకపోతే ఈ డిజిటల్ సంస్కరణలన్నీ కార్పొరేట్ ప్రకటనలుగానే మిగిలిపోతాయి. •



# భారత్‌లో ఇక ప్లాస్టిక్ కరెన్సీ!

## - ప్రపంచంలోని 60 దేశాల్లో ఇదే చెలామణి
## - నకిలీలు, బోగస్‌నోట్లకు సరైన ప్రత్యామ్నాయం

**ముంబయి, మే 29:** భారత్‌లో చెలామణిలో ఉన్న నగదు కొరత పెరిగిపోవడం, నకిలీలు, బోగస్ నోట్లు దేశంలోకి వెల్లువలా వచ్చిపడుతుండటంతో ఆర్‌బిఐ కొత్తప్రణాళికలకు దిగింది. ఇకపై ఇప్పటివరకూ ముగిస్తున్న కాగితపు నోట్లకు స్వస్తి చెప్పి వాటి స్థానంలో అత్యంత మన్నికైన ప్లాస్టిక్ అంటే పాలిమర్ నోట్లను ముద్రించే అంశాన్ని ఆర్‌బిఐ తీవ్రంగా పరిశీలిస్తోంది. పాట్నా, ముంబైలలో జరిగిన ఆర్‌బిఐ బోర్డు సమావేశాలలో ఈ మార్పుపై క్షుణ్ణంగా చర్చలు జరిగినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. వాస్తవానికి ప్రపంచ దేశాల్లో ఇప్పటికే ఈ ప్లాస్టిక్ నోట్లు చలామణిలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 దేశాలు ప్లాస్టిక్ నోట్లను పాక్షికంగా వాడుతున్నప్పటికీ, ఆరుదేశాలు మాత్రం తమ ఆర్థిక వ్యవస్థ నుంచి కాగితపు నోట్లను పూర్తిగా తుడిచేసి, వంద శాతం పాలిమర్ కరెన్సీని వాడుతున్నాయి. 1988లోనే పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టిన ప్రపంచపు మొట్టమొదటి దేశం ఆస్ట్రేలియా. ప్రస్తుతం ప్రపంచంలో ఈ నోట్లను ఉత్పత్తి చేస్తున్న ఏకైక దేశం కూడా ఇదే. న్యూజిలాండ్‌లో 1999లోనే తన కాగితపు కరెన్సీ మొత్తాన్ని చలామణి నుంచి తొలగించింది. ఇక్కడ 5 నుంచి 100 వరకు అన్నీ ప్లాస్టిక్ నోట్లే చలామణిలో ఉన్నాయి. ఆగ్నేయాసియాలోని సంపన్న దేశం బ్రూనై నకిలీ నోట్ల ముప్పును పూర్తిగా నిర్మూలించడానికి ప్లాస్టిక్ నోట్లను స్వీకరించింది. అలాగే వియత్నాంలో కూడా 2003లో పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టారు. ఇక్కడి కరెన్సీ డాంగ్ పూర్తిగా ప్లాస్టిక్‌తోనే తయారవుతుంది. ఇక 2005లో రొమేనియా దేశంలోని అన్ని నోట్లను పాలిమర్‌గా కరెన్సీగా మార్చిన ఏకైక యూరోపియన్ దేశంగా రికార్డు సృష్టించింది. 1975 తర్వాత కినా అనే సరికొత్త ప్లాస్టిక్ కరెన్సీని పపువా న్యూ గినియా వాడుకలోకి తీసుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కరెన్సీకి పెరుగుతున్న క్రేజ్.. కానీ ప్రస్తుతం సింగపూర్, ఇండోనేషియా, మలేషియా, థాయిలాండ్, కెనడా వంటి దాదాపు 60 దేశాల్లో ఈ సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ప్రపంచంలోనే అత్యంత బలమైన కరెన్సీ అయిన అమెరికా డాలర్ మాత్రం ఇప్పటికీ పూర్తిగా ప్లాస్టిక్‌తో తయారుకాలేదు. అమెరికా తన కరెన్సీని పత్తి, నారల ప్రత్యేక మిశ్రమంతో తయారు చేస్తుంది. ప్రస్తుతం ప్రపంచ ధోరణిని బట్టి చూస్తే త్వరలోనే భారత కరెన్సీ రూపాయి కూడా సరికొత్త ప్లాస్టిక్ రూపంలో మన జేబుల్లోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. కాగితపు నోట్లను దశలవారీగా తొలగించి, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి ప్రధాన కారణాలు లేకపోలేదు. వాటి తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక అనే చెబుతున్నారు. సాధారణ కాగితపు నోట్ల కంటే ప్లాస్టిక్ నోట్లు సుమారు రెండున్నర రెట్లు ఎక్కువ కాలం చలామణిలో ఉండగలవని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ నోట్లు నీరు, తేమ, మురికిని సులభంగా తట్టుకోవడం పెద్ద ప్లస్ అని అంటున్నారు. ఈ నోట్లు అంత తేలిగ్గా చిరగవు. దీనివల్ల పదేపదే కొత్త నోట్లు ముద్రించే ఖర్చు ప్రభుత్వానికి తప్పుతుంది. అన్నింటికంటే ప్లాస్టిక్ నోట్లను నకిలీ చేయడం లేదా కాపీ కొట్టడం ఎవరికీ సాధ్యం కాదని చెబుతున్నారు. ఇన్ని ప్రత్యేకతలు ఉండటం వల్లనే ఆర్బీఐ కూడా పాలిమర్‌కరెన్సీ వైపు మొగ్గుచూపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సెంట్రల్ బ్యాంకునుంచి మాత్రం ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు.





# దక్షిణాదిలో కొలువైన సంపన్న సిఎంలు!

## డికె, విజయ్‌ల ఆస్తులు వందల కోట్లు

**చెన్నై, మే 29:** ముఖ్యమంత్రులంటే ఎంతో నీతినియమాలతో ఉండాలి. సంపన్నులు ఈ పీఠంపైకి రాకూడదన్న భావనతో ఉండే పాతతరం పోకడలు ఇపుడు పోయాయి. ఎంత సంపన్నులైతే అంత పకడ్బందీగా పాలనచేస్తారన్న భావన అటు ప్రజల్లోను, ఇటు రాజకీయ నేతల్లో కూడా గూడుకట్టుకుపోయింది. ఇందులోభాగంగా తాజాగా రెండు దక్షిణాదిరాష్ట్రాల్లో ఉన్న సీఎంలపరిస్థితిని చూస్తే వారి సంపదసృష్టి, వారి విలాసజీవన శైలి ఎలా ఉంటుందో తెలుస్తుంది. విజయ్ స్వతహాగా నటుడే కావడంతో తనదైనశైలిని ప్రదర్శిస్తుంటారు. ఇక కర్ణాటకకు కాబోయే ముఖ్యమంత్రిగా ప్రచారంలో ఉన్న డీకే శివకుమార్ జీవనశైలిలోప్రత్యేకతను చాటుకుంటారు. తన విలాసవంతమైన జీవనశైలిని ఎప్పుడూ దాచుకోలేదు. ఖరీదైన గూచీ స్కార్ఫ్‌లు, లూయిూ విటన్ స్టోల్స్, రోలెక్స్, కార్టియర్ వంటి లగ్జరీ వాచ్‌లను ధరించి బహిరంగంగా కనిపిస్తారు. గతంలో తన వాచ్‌లపై విమర్శలు వచ్చినప్పుడు నాకు నచ్చిన వాచ్ ధరించే హక్కు నాకు లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. 2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తుల విలువ రూ. 1,413.80 కోట్లు. రియల్ ఎస్టేట్, క్వారీయింగ్, విద్యాసంస్థల ద్వారా ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారు. మరోవైపు తమిళనాడులో తన టీవీకే పార్టీని అతిపెద్ద శక్తిగా నిలిపిన నటుడురాజకీయవేత్త విజయ్ తీరు దీనికి భిన్నం. ఆయనది నిశ్శబ్ద సంపద. తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ. 624 కోట్ల నికర ఆస్తులు ప్రకటించిన విజయ్, డబ్బు విషయంలో చాలా సంప్రదాయబద్ధంగా వ్యవహరిస్తారు. ఆయన తన సంపదలో దాదాపు రూ. 313 కోట్లను కేవలం బ్యాంకు డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాల్లోనే ఉంచారు. ఒకే సేవింగ్స్ ఖాతాలో రూ. 213 కోట్లు ఉండటం గమనార్హం. స్టాక్ మార్కెట్‌లో ఆయన పెట్టుబడులు నామమాత్రం. రూ. 220 కోట్ల విలువైన స్థిరాస్తులు, రూ. 13.5 కోట్లు విలువైన లగ్జరీ కార్ల కలెక్షన్ ఆయనకు ఉంది. డీకే శివకుమార్ తన సంపదను ఆడంబరంగా ప్రదర్శిస్తే, విజయ్ దానిని నిశ్శబ్దంగా దాచుకున్నారు. కానీ వీరిద్దరూ ఒకే మార్పును సూచిస్తున్నారు.



## భారత్‌లో నాకు మెగా ఫాలోవర్లు ఉన్నారు!

### ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

**జెరూసలెం, మే 29:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి భారత్‌పై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమ దేశం ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ భారత్‌తో తమకు అద్భుతమైన మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. వెస్ట్ బ్యాంక్‌లో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాకు సమస్యలు లేని ఏకైక దేశం భారత్‌అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ ఒక అతిపెద్ద శక్తి. ఆ దేశంతో మాకు ఒక ప్రత్యేకమైన సంబంధం ఉంది. ప్రపంచంలోని చాలా దేశాల్లో మా ప్రతిష్ఠకు సవాలు ఎదురవుతోంది. ఇండియాలో మాత్రం మాకు ఎలాంటి సమస్యా లేదు.అక్కడ ఇజ్రాయెల్ పట్ల ప్రజల్లో పిచ్చి అభిమానం ఉంది. అది నిజంగా అసాధారణం అని నెతన్యాహు పేర్కొన్నారు. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంతగా, భారత్ నుంచే తనకు ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారని ఆయన తెలిపారు. అయితే, అంతర్జాతీయంగా ముఖ్యంగా అమెరికాలో నెతన్యాహు ప్రజాదరణ తగ్గుతున్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఏప్రిల్‌లో ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన సర్వే ప్రకారం అమెరికాలో 60 శాతం మందికి ఇజ్రాయెల్‌పై ప్రతికూల అభిప్రాయం ఉంది. గత ఏడాది ఇది 53 శాతంగా ఉండేది. అలాగే, 59 శాతం అమెరికన్లు నెతన్యాహు అంతర్జాతీయ వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకుంటారనే నమ్మకం లేదని వెల్లడించారు. గతంలో కూడా నెతన్యాహు అనేక సందర్భాల్లో భారత్‌పై ప్రశంసలు కురిపించారు. 2018లో తన భార్య సారాతో కలిసి భారత్‌లో పర్యటించినప్పుడు తనకు లభించిన ఆదరణను ఆయన లవ్ ఫెస్ట్ ప్రేమ పండుగగా అభివర్ణించారు.

# సిద్దరామయ్య రాజీనామాకు గవర్నర్ ఆమోదం

### ఢిల్లీలో మకాంవేసిన సిద్దరామయ్య, డికె శివకుమార్‌లు
### మంత్రివర్గ కూర్పు,చేర్పులపై రాహుల్‌తో భేటీ
### జూన్ 1 లేదా 4న కర్ణాటక కొత్త సిఎంగా డికె ప్రమాణం



**బెంగళూరు, మే 29:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆమోదించడంతో ప్రస్తుత మంత్రిమండలి కూడా తక్షణమే రద్దయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యను గవర్నర్ కోరారు. మరోవైపు కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియను పూర్తి చేసేందుకు అధిష్ఠానం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం రాత్రే ఢిల్లీ చేరుకున్నారు. ఆయన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై కొత్త ప్రభుత్వంపై చర్చిస్తున్నారు. మరోవైపు సిద్ధరామయ్య ప్రయాణిస్తున్న విమానం ప్రతికూల వాతావరణం వల్ల మొదట జైపూర్‌కు మళ్లించారు. దీంతో కాస్త ఆలస్యంగా ఆయన కూడా ఢిల్లీ చేరుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీకి సిద్ధమయ్యారు. కొత్త ముఖ్యమంత్రి ఎంపికపై ఢిల్లీ విమానాశ్రయంలో మీడియా అడిగిన ప్రశ్నలకు సిద్ధరామయ్య క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. శాసనసభ పక్షం, పార్టీ హైకమాండ్ కలిసి కొత్త నాయకుణ్ని ప్రకటిస్తాయని స్పష్టం చేశారు. తనకు రాజ్యసభ సీటు ఆఫర్ వచ్చినట్లు జరుగుతున్న ప్రచారంపై మాత్రం ఆయన స్పందించలేదు. ఆ ప్రశ్నకు సమాధానం దాటవేస్తూ నేరుగా ముందుకు సాగిపోయారు. డీకే శివకుమార్ కూడా అధిష్ఠానంతో చర్చల తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉంటే సిద్ధరామయ్య రాహుల్‌గాంధీ, ఖర్గే, కెసి వేణుగోపాల్ వంటి వారిని కలిసి తనవర్గానికి మంత్రిపదవులు ఇవ్వాలని లిస్ట్ ఇచ్చినట్లు సమాచారం. వారిలో తన కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య కూడా ఉన్నారు. తనవిధేయులకు దామాషా ప్రకారం మరోవైపు అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ డీకే. శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు దాదాపు మార్గం సుగమమైంది. మంత్రివర్గ కూర్పు, సిద్ధరామయ్య డిమాండ్లపైనే అధిష్ఠానంతో ఆయన చర్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇవి కొలిక్కి వస్తే ఆయన ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. జూన్ 1 లేదా 4వ తేదీన ఆయన ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందంటూ పార్టీల వర్గాల ద్వారా తెలుస్తోంది.

## వందేమాతరం ఆలపించకపోవడంపై కేరళ గవర్నర్ అసంతృప్తి

**తిరువనంతపురం,మే 29:** కేరళంలో వందేమాతరంపై మరోసారి వివాదం చోటుచేసుకుంది. యుడిఎఫ్ పాలసీ అడ్రస్ సందర్భంగా అసెంబ్లీలో వందేమాతరం గేయాన్ని పూర్తిస్థాయిలో పాడకపోవడంపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ శుక్రవారంనాడు అసంతృప్తి వ్యక్తం చేసారు. అసెంబ్లీ నుంచి బయటకు వస్తూ మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారిక కార్యక్రమాల్లో గవర్నర్ ఎప్పుడు హాజరైనా సరైన ప్రోటోకాల్ పాటించాల్సి ఉంటుందని అన్నారు.కేరళ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ముందు, తరువాత ఒక బ్యాండ్ టీమ్ వందేమాతరం గేయంలోని మొదటి చరణాలను మాత్రమే ప్లే చేసింది. దీనిపై గవర్నర్ మాట్లాడుతూ, గవర్నర్ ఎప్పుడు హాజరైనా వందేమాతర గేయాన్ని పూర్తిగానే పాడాల్సి ఉంటుందని అన్నారు. గేయాన్ని ఆలపించలేదు, ప్లే మాత్రమే చేశారు అని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ తిరువాంచూర్ రాధాకృష్ణన్‌తోమాట్లాడానని, ఏం జరుగుతోందో చూద్దామని అన్నారు.

# చంద్రుడిపై శాశ్వత నగరం!

## 20 బిలియన్ డాలర్లతో ప్రాజెక్టు



**న్యూయార్క్, మే 28 :** అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా మరో చరిత్రాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నది. చంద్రుడిపై మానవుల శాశ్వత నివాసం కోసం ఓ నగరాన్నే నిర్మించబోతున్నది. 20 బిలియన్ డాలర్ల ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు 2032 వరకు పూర్తవుతుందని నాసా ప్రకటిం చింది. దీంతో భూమి బయట మాన వులు బతికే మొదటి నివాసం ఇదే కాబో తున్నది. ఈ ఏడాది చివరికల్లా దీన్ని ప్రారంభిస్తారు. మొదట్లో చిన్న క్యాంపు లాగా ప్రారంభించి తర్వాత దాన్ని విస్తరించబోతున్నారు. ఈ నగరాన్ని భూమి మీద నుంచి తీసుకెళ్లే మడతపెట్టగల వసువులతో తయారు చేస్తారు. చంద్రుడి దక్షిణ ధృవంకు దగ్గర్లోనే ఈ నగరాన్ని నిర్మించబోతున్నారు. ఎందుకంటే అక్కడ నీటి నిక్షేపాలు ఉన్నాయి. ఈ నగరం భూమిమీద ఉన్న ఇండ్ల మాదిరిగా ఉండబోతున్నది. అలాగే కఠినమైన పరిస్థి తులను తట్టుకునేలా దీన్ని డిజైన్ చేస్తారు. నాసా అడ్మినిస్ట్రేటర్ జేరెడ్ ఇసాక్‌మాన్ మాట్లా డుతూ.. ఈ ఏడాది చివర్లో చంద్రుడిపైకి సైంటి ఫిక్ వస్తువులను పంపుతామన్నారు. వాటి ద్వా రా ఎక్కడ నగరం నిర్మాణానికి అనువుగా ఉంటుందో సెర్చ్ చేసి వచ్చే సంవత్సరం నుంచి నిర్మాణ పనులు మొదలు పెడుతామన్నారు.

# దేశంలో అత్యవసర సేవలన్నింటికీ ఒకే నంబర్ 112: సుప్రీం కోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, మే 29:** దేశవ్యాప్తంగా అందరికీ అన్నింటికీ ఒకే హెల్ప్‌లైన్ నెంబర్ అమలులోకి రాబోతుంది. 112 నెంబర్‌ను దేశవ్యాప్తంగా, ఎమర్జెన్సీ నెంబర్‌గా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లోగా ఈ నెంబర్ అమలయ్యేలాగా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. సేవ్ లైఫ్ ఫౌండేషన్ అనే రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యం లోని సుప్రీం బెంచ్ దీనిపై విచారణ జరిపి, ఆదేశాలిచ్చింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు ఎమర్జెన్సీ నెంబర్లు అమలులో ఉన్నాయి. పోలీసులకు 100, ఫైర్ సర్వీసెస్ కోసం 101, అంబులెన్స్‌ల కోసం 102, 108, హైవేలపై సహాయం కోసం 1033, మహిళల భద్రత కోసం 1091 నెంబర్లు దేశవ్యాప్తంగా అమలవు తున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వీరిలో ఏ నెంబర్‌కు చేయాల అనే విషయంలో చాలా మంది గందరగోళానికి గురవుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అందాల్సిన సహాయం అందడం లేదు అందుకే అన్నింటికీ కలిపి ఒకే ఎమర్జెన్సీ సర్వీస్ నెంబర్ ఉంటే బాగుటుందని సేవ్ లైఫ్ సంస్త కోరింది. ఈ నేపథ్యంలో అన్నింటినీ కలిపి ఒకే నెంబర్‌గా 112 అమలు చేయాలని కేంద్రం సూచించింది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరూ అత్యవసర వైద్య సేవలు పొందే హక్కు కలిగి ఉన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన పరిస్తితుల్లో ప్రతి నిమిషం కూడా ముఖ్యమేనని, బాధితుల పరిస్తితి క్షణాల్లోనే విషమించే అవకాశం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. అత్యవసర సేవలు ఆలస్యమైతే బాధితుల్ని కాపాడటం కష్టమవు తుందని కోర్టు అభిప్రాయపడింది. త్వరగా స్పందిస్తే బాధితుల్ని కాపాడవచ్చని తెలిపింది. ప్రభుత్వాలు మూడు నెలల్లోగా 112 నెంబర్‌ను పూర్తిస్థాయిలో అమలులోకి తేవాలని ఆదేశిం చింది. ప్రతినెలా నివేదిక ఇవ్వాలని సూచించింది. రోడ్డు ప్రమాదాల్లో సేవలందిం చేందుకు జాతీయ భద్రతా ప్రమాణాలకు అను గుణంగా ప్రభుత్వ, ప్రైవేటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాలకు సూచించింది.



## రూ.34 కోట్లభరణం చెల్లించి ఉరిశిక్ష నుంచి బయటపడిన కేరళవాసి!

**తిరువనంతపురం, మే 29:** బతుకుదెరువు కోసం ఇరవై ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లిన కేరళకు చెందిన వ్యక్తి తన యజమానిఇంట్లోని బాలుడి మరణానికి కారణమయ్యాడంటూ అక్కడి న్యాయస్థానం ఆయనకు మరణశిక్ష విధించింది. కానీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మలయాళీలు ఆయనకు సహాయం చేయడంతో సుమారు రూ.34 కోట్ల మొత్తాన్ని క్షమాధనంగా చెల్లించి, కేరళకు చేరుకున్నాడు. సొంత దేశానికి చేరుకున్న అతను తన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను చూడగానే భావోద్వేగానికి లోనయ్యాడు. కేరళలోని కోజీకోడ్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ 2006లో సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ ఒక దివ్యాంగ బాలుడికి కేర్ టేకర్‌గా చేరాడు. ప్రమాదవశాత్తూ ఆ బాలుడు మృతి చెందడంతో రహీమ్‌పై సౌదీ అధికారులు కేసు నమోదు చేశారు. రహీమ్‌కు క్షమాభిక్ష పెట్టడానికి బాలుడి కుటుంబం నిరాకరించింది. దీంతో 2018లో కోర్టు అతనికి మరణశిక్షను విధించింది. అబ్దుల్ రహీమ్ ఈ శిక్ష నుంచి తప్పించుకోవడానికి ఆ దేశ చట్టాల ప్రకారం భారీ మొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది. రహీమ్‌ను ఉరిశిక్ష నుంచి కాపాడటానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మలయాళీలు ఏకమయ్యారు. విరాళాల రూపంలో 15 మిలియన్ల సౌదీ రియాల్స్ సౌదీ కోర్టుకు చెల్లించారు.

ఈ మొత్తం మన కరెన్సీలో సుమారు రూ.34 కోట్లు. క్షమాధనం చెల్లించడంతో సౌదీ కోర్టు అతనిని విడుదల చేసింది.

## ఎన్నో విజయాలు.. వెన్నంటే ఆటుపోట్లు!

### అంచలంచెలుగా సిఎం స్థాయికి చేరుకున్న డికెశివకుమార్

**బెంగళూరు, మే 29:** నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో విజయాలను వెన్నంటే ఆటుపోట్లు, పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ప్రత్యర్థులకు కనకపుర బండగా పేరుపొందిన డైనమిక్ లీడర్ ఇప్పుడు రాష్ట్ర సీఎం పీఠంపైకి వస్తున్నాడని డిప్యూటీ సిఎం డికెశివకుమార్ అనుచరగణం సంబరపడిపోతోంది. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంచలంచెలుగా డిప్యూటీ స్థాయికి ఎదిగారు. ఎన్నికలకు ముందు ఆయనే సీఎం అవుతారని భావించినా చివరినిమిషంలో సిద్ధరామయ్య ఆ పదవిని తన్నుకుపోయారు. అయితే ముందుగా కుదిరిన అధికార మార్పిడి ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయడంతో, కర్ణాటక నూతన సారథిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 1980లలో విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన శివకుమార్, 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, ఇప్పటివరకు ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై అపజయం ఎరుగని నేతగా తన పట్టు నిలుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి కష్టకాలం వచ్చిన ప్రతీసారీ డీకే శివకుమార్ ముందుండి సమస్యలను పరిష్కరించేవారు. అందుకే ఆయనకు పార్టీలో ట్రబుల్ షూటర్ అనే పేరు స్థిరపడింది. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కఠినమైన దశ కూడా ఎదురైంది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయనను అరెస్ట్ చేయడంతో సుమారు 50 రోజులు తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. బీజేపీలో చేరండి, లేదంటే జైలుకు వెళ్లండి అని నాకు రెండు దారులు చూపారు. నేను జైలుకే వెళ్లానని శివకుమార్ ఆ రోజులను పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు.

ఆయన జైలులో ఉన్నప్పుడు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ స్వయంగా వెళ్లి పరామర్శించడం అప్పట్లో రాజకీయంగా సంచలనం సృష్టించింది. జైలు నుంచి బయటకు వచ్చాక మరింత బలపడిన శివకుమార్, కెపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో అహర్నిశలు శ్రమించారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా, బెంగళూరు నగర అభివృద్ధి శాఖ మంత్రిగా కాంగ్రెస్ ప్రకటించిన ఐదు గ్యారెంటీల అమలులో కీలక పాత్ర పోషించారు.

## గాలివానకు కూలిపోయిన నిర్మాణంలోని వంతెన

### ఆరుగురు కార్మికులు మృతి, మరో ముగ్గురుశిథిలాలకిందే

**లక్నో, మే 29:** గాలి వానకు నిర్మాణంలో ఉన్న వంతెన భాగం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు మరణించారు. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకున్నారు. అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మోరకందర్ నుంచి కందౌర్ గ్రామం వరకు బెట్వా నదిపై ఒక బ్రిడ్జి నిర్మిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో కొంత మంది కార్మికులు లిఫ్ట్ యంత్రం కింద నిల్చొని ఉన్నారు. అయితే గాలి వాన బీభత్సం వల్ల నిర్మాణంలో ఉన్న వంతెనకు చెందిన ఒక స్లాబ్ కూలిపోయింది. దీంతో ఆధార స్తంభాలు కూడా కూలిపోయాయి. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు, అధికారులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు.

# సంక్షిప్తంగా..

## బెజోస్ కంపెనీ న్యూగ్లెన్ రాకెట్ పరీక్ష విఫలం


**ఫ్లోరిడా, మే 29:** బిలియనీర్ జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆర్జిన్ కంపెనీ అంతరిక్ష ప్రయోగాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆ కంపెనీ చేపట్టిన న్యూగ్లెన్ రాకెట్ పరీక్ష విఫలమైంది. ఫ్లోరిడాలోని కేప్ కెనరవల్ లాంచ్ ప్యాడ్‌లో గ్లెన్ రాకెట్ పేలింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని ఆ కంపెనీ వెల్లడించింది. హాట్‌ఫైర్ పరీక్ష సమయంలో లోపాలు తలెత్తాయని ఆ కంపెనీ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నది. బ్లూ ఆర్జిన్ ప్రత్యర్థి స్పేస్ ఎక్స్ కంపెనీ ఆ ప్రమాదం పట్ల సంతాపం తెలిపింది. దురదృష్టకరమైన ఘటన అని వెల్లడిచింది. ప్రయోగ సమయంలో రాకెట్ కింద భాగం నుంచి పొగ వచ్చినట్లు ఓ విడియోలో కనిపించింది. సుమారు 98 మీటర్ల ఎత్తు ఉన్న ఆ రాకెట్ భారీ స్థాయిలో పేలడంతో ఫైర్‌బాల్ ఏర్పడింది. బెజోస్ ఈ ఘటనపై స్పందిస్తూ ఏం జరిగిందన్న దానిపై ఇప్పుడే ఏమీ అంచనా వేయలేమన్నారు.

## సిఐఎ మాజీ అధికారి అరెస్ట్, 300 కిలోల బంగారం స్వాధీనం

**వాషింగ్టన్, మే 29:** అమెరికా గూఢచర్య సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సిఐఎ) ప్రపంచంలోనే పెద్ద పెద్ద దేశాధినేతలనే బోల్తా కొట్టించి నిఘా సమాచారం సేకరిస్తుంది. అలాంటి సంస్థనే దోచేశాడు దాని మాజీ అధికారి ఒకరు అతడి ఇంట బంగారం ఖజానా చూసి ఎఫ్‌బిఐ సిబ్బంది అవాక్కయ్యారు. సిఐఎ మాజీ అధికారి డేవిడ్ రష్ ఇంట ఒక్కోటీ కిలో బరువున్న 300 బంగారం బిస్కెట్లను అధికారులు గుర్తించారు. వీటితోపాటు 35 లగ్జరీ వాచ్‌లు కూడా బయటపడ్డాయి. వీటిల్లో అత్యంత ఖరీదైన రోలెక్స్ మోడళ్లు ఉన్నాయి.

ఇక, 2 మిలియన్ డాలర్ల నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో డేవిడ్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. డేవిడ్ రష్ సిఐఎలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఉద్యోగ అవసరాల పేరిట 2025-26 మధ్య ప్రభుత్వం నుంచి భారీ మొత్తంలో బంగారం, నగదు తీసుకున్నట్లు ఎఫ్‌బిఐ చెబుతోంది.

## మంటల్లో చిక్కుకుని సిసిఐ తొలిచైర్మన్ మృతి





**న్యూఢిల్లీ, మే 29:** రాజధానిలోని హౌజ్ ఖాస్ ప్రాంతంలో ఉన్న ఒక నివాసంలో ఘోర ప్రమాదం జరిగింది. ఇంట్లోని ఎయిర్ కండిషనర్ (ఏసీ) ఇండోర్ యూనిట్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తొలి ఛైర్మన్, ప్రముఖ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనేంద్ర కుమార్ (80) తీవ్ర పొగ పీల్చడం వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన్ను రక్షించే క్రమంలో గాయపడిన కుమారుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఐదుగురు ఉండగా స్థానికులు, పోలీసులు కలిసి వారిని బయటకు తీసుకొచ్చారు. తీవ్ర అస్వస్థతకు గురైన ధనేంద్ర కుమార్‌ను ట్రామా సెంటర్‌కు తరలించినా ఫలితం లేదు.

## మహిళలపై లైంగిక దాడుల్లో రష్యా, ఇజ్రాయెల్

**న్యూయార్కు, మే 29:** ప్రపంచదేశాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్రిక్తతలున్న దేశాల్లో మహిళలపై జరుగుతున్న దాడులపైనా సమితి ఆందోళన వ్యక్తంచేసింది. వివిధ దేశాల్లోని సంక్షోభ ప్రదేశాల్లో లైంగిక హింసపై ఐక్యరాజ్యసమితి వార్షిక నివేదికను విడుదల చేసింది. గత 15 ఏళ్లుగా ఐక్యరాజ్యసమితి ఈ నివేదికను విడుదల చేస్తోంది. ఈసారి ఈ జాబితాలో రష్యా, ఇజ్రాయెల్ బలగాల పేర్లను కూడా చేర్చడం వివాదాస్పదమయింది. నివేదికలో తొలిసారి రష్యా, ఇజ్రాయెల్ పేర్లను ఐరాస చేర్చింది. ఉక్రెయిన్ బందీలపై రష్యా సైనికులు లైంగిక హింసకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో రష్యా బలగాలను నివేదికలో ఐక్యరాజ్యసమితి చేర్చింది.

## కాక్రోచ్ జనతాపార్టీ ఎక్స్ ఖాతా పునరుద్ధరణకు ఢిల్లీ హైకోర్టు నో






**న్యూఢిల్లీ, మే 29:** భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తాజా సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో యువత, సెలబ్రిటీలు ఈ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ఈ పార్టీ ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపి వేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎక్స్ ఖాతాను నిలిపివేయడంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ ఖాతాను ఎక్స్ నిలిపి వేసిందంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం పిటిషన్ ను విచారించింది.

# మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా మరో అడుగు

## ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాల ప్రారంభం

## 'మేడిన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్' నినాదం

## మార్కెట్‌ను శాసించాలి: మంత్రి సీతక్క




**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** మహిళల చేతుల్లో కేవలం బ్యాంకు పాస్‌బుక్కులు మాత్రమే కాకుండా పరిశ్రమలు, వ్యాపారాలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, ఆలోచనలకు, వ్యాపార కలలను సాకారం చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక, సాంకేతిక, వ్యాపార సహకారం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం బంజారాహిల్స్‌లోని కొమరంభీం ఆదివాసీభవన్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా పరిశ్రమలను స్థాపించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందని పేర్కొన్నారు.'ఈ రోజు మనం ప్రారంభించింది ఒక సాధారణ కార్యక్రమం కాదు. తెలంగాణ గ్రామీణ మహిళల భవిష్యత్తును మార్చే ఆర్థిక ఉద్యమం' అని పేర్కొన్నారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, ఆలోచనలకు, వ్యాపార కలలకు బలమైన వేదికగా ఈ ఇంక్యుబేటర్లు పని చేస్తాయన్నారు. బిట్స్ పిలానీ, దేశంలోనే అగ్రశ్రేణి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్ టి-హబ్ భాగస్వామ్యంతో రెండు ప్రత్యేక ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంక్యుబేటర్‌కు రూ.10.70 కోట్ల నిధులు కేటాయించామన్నారు. ఈ కేంద్రాల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ట్రైనింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ సపోర్ట్, ఫైనాన్షియల్ గైడెన్స్, బిజినెస్ మెంటారింగ్ వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. 300 మంది మహిళా పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 67 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో 6.43 లక్షల మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 'మహిళలు ఉద్యోగాలు వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి రావాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని వెల్లడించారు. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. మధిరలో మహిళలకు రూ.3 కోట్లతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుచేసి నెలకు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చేలా చేశామని తెలిపారు. మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు నెలకు రూ.4 లక్షల వరకు లాభాలు ఆర్జిస్తున్నాయని వివరించారు. ఫుడ్ ట్రక్కులు, ఫిష్ మొబైల్ ట్రక్కులు వంటి సులభమైన వ్యాపార నమూనాలను మహిళలకు అందిస్తున్నామని వెల్లడించారు. గ్రామాల్లో మహిళలు తయారు చేసే ఉత్పత్తులు స్థానిక మార్కెట్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ మార్కెట్లకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చేర్యాల మహిళలు తయారు చేసిన చింతగింజల మాస్కులు నెదర్లాండ్స్ వరకు ఎగుమతి కావడం తెలంగాణ మహిళల సృజనాత్మకతకు నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు దేశానికి ఆదర్శంగా నిలవాలని, గ్రామీణ మహిళల చేతుల్లో పరిశ్రమల జెండా ఎగరాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, టీ-హబ్ సీఈఓ కవికృత్, వి.హబ్ సీఈఓ సీత పల్లచోల, సెర్ప్‌నాన్‌ఫామ్ డైరెక్టర్ జాన్సన్, డిఆర్‌డిఒ ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు, పలు రంగాల నిపుణులు పాల్గొన్నారు.

## శాతవాహన వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సు మంజూరు చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం లేఖ

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** హుస్నాబాద్‌లో కొనసాగుతున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సును మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. తెలంగాణలో, ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో, సింగరేణి కాలరీస్ ద్వారా బొగ్గు తవ్వకం కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. దేశంలో, ప్రపంచవ్యాప్తంగా అర్హత కలిగిన మైనింగ్ ఇంజనీర్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ సంస్థల్లో బి.టెక్ (మైనింగ్ ఇంజనీరింగ్) చదవడానికి అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన చాలా మంది విద్యార్థులు, ఆసక్తి, సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో అధిక ఫీజుల కారణంగా ఈ కోర్సును చదవలేకపోతున్నారన్నారు. ఈ ప్రాంతం బొగ్గు గనుల ప్రాంతంలో ఉండటం, గనుల పరిశ్రమలకు సమీపంలో ఉండటం వలన, శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో హుస్నాబాద్ పట్టణంలో కొత్తగా స్థాపించబడిన ఈ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ (మైనింగ్ ఇంజనీరింగ్)ను ప్రవేశపెట్టడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్‌లోని శాతావాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో బి.టెక్ (మైనింగ్ ఇంజనీరింగ్) కోర్సును ప్రవేశపెట్టడాన్ని, అలాగే అవసరమైన సిబ్బందిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు మంత్రి లేఖలో పేర్కొన్నారు.

## సేంద్రియ సాగుకు ప్రోత్సాహం

### ఆహార అలవాట్ల మార్పుతోనే కార్పొరేట్ ఆస్పత్రులకు కాసుల పంట

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించి రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధా న్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మనం విని యోగి స్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని స్పష్టం చేశారు.కాగా.. పెట్రోల్, డీజిల్ కొరత మరియు ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వ విధానాలను మంత్రి తుమ్మల తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేందుకు కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇంధన కొరత కారణంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 428

**హైదరాబాద్ (బేగంపేట), మే 29, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 428దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 201దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 33,ఇందిరమ్మ ఇండ్ల కోసం 116,ప్రవాసీ ప్రజావాణీకి 03దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 75దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## గాదె వెంకట్‌రెడ్డి మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరనిలోటు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:**సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ మంత్రి గాదె వెంకట్ రెడ్డి మృతి తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటని అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆవేదనతో ప్రగాఢ సంతాపం తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్న కాంగ్రెస్ నాయకులు గాదె వెంకట్ రెడ్డి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన గాదె వెంకట్ రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రజల విశ్వాసాన్ని పొందారని తెలి పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ, సహకార ఎక్సైజ్ శాఖల మంత్రిగా సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు.ప్రజా సమస్యలపై లోతైన అవగాహన, విలువలతో కూడిన రాజకీయాలు, నిరాడంబర జీవనశైలి, అందరితో ఆత్మీయంగా మెలిగే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని మహేష్ కుమార్ గౌడ్ నివాళీ సందేశంలో పేర్కొన్నారు. గాదె వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు.

**పరిపక్వత కలిగిన నేత గాదె వెంకటరెడ్డి : మంత్రి పొన్నం**

రాజకీయాల్లో అనుభవం, పరిపక్వత కలిగిన గాదె వెంకట్ రెడ్డి మరణం తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఒక ప్రకటనలో నివాళ్ళు అర్పించారు. సర్వశక్తివంతుడైన దేవుడు ఆయన కుటుంబ సభ్యులకు అభిమానులకు అనుచరులకు ఈ పూడ్చుకోని నష్టం నుంచికోలుకొనే మనోధైర్యం ఇవ్వాలని ఆయన ఆకాంక్షను వ్యక్తంచేశారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా ,మంత్రిగా పని చేసిన గాదె వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ లో అనేక సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. వారి మరణం రాజకీయాల్లో తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

**మాజీ మంత్రుల సంతాపం**

మాజీ మంత్రులు డి.కె. సమరసింహా రెడ్డి, ఎం.వి. మైసూరా రెడ్డిగంగుల ప్రతాప్ రెడ్డి గార్ల సంతాపం.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి మృతి పట్ల మాజీ మంత్రులు డి.కె. సమరసింహా రెడ్డి, ఎం.వి. మైసూరా రెడ్డి గంగుల ప్రతాప్‌రెడ్డి, సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొం దుతూ ఆయన కన్నుమూయడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. వెంకటరెడ్డి సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో కొనసాగుతూ మంత్రిగా, శాసనసభ్యుడిగా ప్రజల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అదే విధంగా వారికి ఎంతో ఆత్మీయతతో, సఖ్యతతో ఉండేవారని తలచుకొని బాధ వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు. గాదె వెంకటరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కుమురంభీమ్ త్యాగం దేశానికి స్ఫూర్తి

### ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

### రౌటసంకేపల్లి గ్రామోత్సవంలో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ఆసిఫాబాద్, మే 29, ప్రభాతవార్త :** కుమురంభీం కలలు కన్న స్వరాజ్యం దగ్గర లో ఉందని, ఆయన చేసిన త్యాగం దేశానికి స్ఫూర్తియని, వారి ఆశయాలతో యువత ముందుకు సాగాలని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. శుక్ర వారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రౌటసంకెపల్లిలో నిర్వహించిన 'కుమురంభీమ్ జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం-2026' కార్య క్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రౌట సంకెపల్లి కేవలం ఒక గ్రామం మాత్రమే కాదని, ఆదివాసీ సమాజ వీరత్వం, త్యాగం, ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్ర స్థలమని పేర్కొన్నారు. ఈ పవిత్ర ప్రాంతంలో జన్మించిన గొప్ప ఆదివాసీ విప్లవకారుడు, అమరవీరుడు కుమురంభీమ్‌కు కోటి ప్రణామాలు అర్పించారు. కుమురం భీమ్ ఇచ్చిన చారిత్రాత్మక నినాదం 'జల్, జంగల్, జమీన్' ప్రాము ఖ్యతను వివరిస్తూ ఇది ప్రకృతి, మానవుల సహజీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. సభకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలను అభినందించారు. ఏ సమాజానికైనా నిజమైన శక్తి మహిళలేనని, మహిళలు సాధికారత, విద్య, గౌరవాన్ని పొందినప్పుడే ఏ సమాజమైనా, దేశమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆధునిక యుగంలో యువత తమ మూలాలను, సంపన్న చరిత్రను, మహానుభావుల పోరాటాలను మరువకూడదని పిలుపునిచ్చారు. మద్యపానంపై గ్రామస్తులు చేసిన ప్రతిజ్ఞను అభినందించారు.



ఆదివాసీల సంప్రదాయ పూజలో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం నిరంతరం చూపిస్తున్న నిబద్ధతను ప్రస్తావించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరుతోందని అన్నారు. గ్రామోత్సవం నిర్వహించిన నిర్వాహక కమిటీ సభ్యులను, సామాజిక సేవకులను గవర్నర్ అభినందించారు. రౌటా సంకెపల్లి గ్రామం భవిష్యత్తులో ఆదర్శ ఆదివాసీ అభివృద్ధి, సామాజిక చైతన్యానికి కేంద్రంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. మాజీ గవర్బర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఆత్మగౌరవ పోరాటానికి పునాది వేసిన పోరాట యోధుడు కొమురంభీం అని పేర్కొన్నారు. అనంతరం గవర్నర్ గిరిజన కుటుంబాలకు సౌర విద్యుత్తు పలకాలను, బట్టలు, చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు గవర్నర్ కొమరం భీం, ఎడ్లకొండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురం భీం కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన చేశారు.

## రాష్ట్రంలో పక్కాగా జల సంచయ్ అమలు

### జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూగర్భజలాల పెంచేందుకు చేపట్టిన 'జల సంచయ్ జన భాగీదారి- (జేఎస్‌బీజే 2.0)' కార్యక్రమంలో రాష్ట్రం దూసు కెళ్తోంది. జల సంరక్షణ పనుల్లో జాతీయ స్థాయిలో తెలంగాణ అయిదో స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 3,86,073 పనులు పూర్తి కావడంతోపాటు పోర్టల్‌లోనూ అప్‌లోడ్ అయ్యాయి. ఈ నెల 31తో ఈ పనుల అప్‌లోడింగ్ గడువు ముగియనుండడంతో పనుల్లో మరింత వేగం పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో జల సంరక్షణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈ నెల 26 నాటికి గ్రామ పంచాయతీల్లో మొత్తం 3,27,465 పనులు పూర్తయ్యాయి. ఈ నెల 20 నుంచి 26 వరకు కేవలం ఆరు రోజుల్లోనే 2,12,101 కొత్త పనులను పూర్తి చేసి రికార్డు సృష్టించారు.

జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్ జిల్లా 52,146 పనులతో అగ్రస్థానంలో ఉండగా ఆదిలాబాద్ 42,933, ఖమ్మం 28,409 జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా 1,538 పనులతో చివరి స్థానంలో నిలిచింది. పట్టణాల్లో ముందు వరసలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు, పట్టణ ప్రాంతాల్లో (యూఎల్‌బీ) పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో మొత్తం 32,986 పనులు పూర్తి కాగా.. ఇందులో జీహెచ్‌ఎంసీ నుంచే 19,440 పనులు అప్‌లోడ్ అయ్యాయి. వరంగల్ 8,091 పనులతో రెండో స్థానంలో ఉంది. భద్రాద్రి కొత్తగూడెం మున్సిపల్ విభాగం 1,079 పనులు అప్‌లోడ్ చేసింది. జల్ సంచయ్ - జన్‌భాగీదారీ కార్యక్రమంలో అయిదు కీలక శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోక్‌పిట్స్, ఫాంపాండ్స్, చెక్‌డ్యామ్‌లు, పురపాలక శాఖ పరిధిలో రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్, ఇంజక్షన్ వెల్స్, అటవీ శాఖ రాక్‌ఫిల్ డ్యామ్స్, నీటిపారుదల శాఖ నేతృత్వంలో చెక్ డ్యామ్స్, స్టోన్ గల్లీ ప్లగ్స్, భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ల పనులు పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

## దేశంలో 'సర్'తో బిజెపి విషపూరిత కుట్ర

### అర్హుల ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలి

### ఎఐసిసి శిక్షణ తరగతులతో మాస్టర్ ట్రైయినీలు తర్ఫీదు పొందాలి

### 90 నియోజకవర్గాలకు బిఎల్ఎ నియామకం పూర్తి

### రాష్ట్ర ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్



**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** దేశంలో బిజెపి సర్‌తో ఒక విష పూరిత కుట్ర చేస్తున్నదనీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడకుండా ఓట్ చోరీకి కీలకమైన ఓటర్ల తొలగింపు ప్రక్రియ అడ్డుకొనేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ముఖ్యంగా బిఎల్‌ఎలతో సమన్వయంగా ఉంటూ సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం సర్ శిక్షణ విభాగం చైర్మన్ ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి అధ్యక్షతన టిపిసిసి మాస్టర్ ట్రైనీల శిక్షణ కార్యక్రమం జరిగింది.టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షినటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్‌లు హాజరైనారుఎఐసిసి శిక్షణ విభాగం నుంచి వచ్చిన సౌరబ్, నిశాంత్, అనూషలు టిపిసిసి మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు నియోజకవర్గ బిఎల్.ఏ లకు శిక్షణ ఇస్తారనీ తెలిపారు.మాస్టర్ ట్రైనీలు బెంగాల్,కర్నాటక తదితర అనుభవాలపై పూర్తిగా అవగాహన పెంచుకొంటే సర్‌తో ఓట్లను అక్రమంగా తొలగించడాన్ని అడ్డుకోవడానికి వీలవుతోందని అన్నారు. పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగంసంస్థాగత నిర్మాణంలో దేశంలోనే తెలంగాణలో పకడ్బందీగా చేసామనీ అన్నారు. ఇక్కడ 90 నియోజకవర్గాలలో సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియ విజయవంతంగా ముగించామని అంతే కాకుండా బిఎల్ఎ నియామకాలు కూడా వందకు వందశాతం పూర్తి చేసామని గౌడ్ వివరించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీ లు దాదాపు పూర్తి చేసామనీ తెలిపారు.పశ్చిమ బెంగాల్ లో93 లక్షల ఓట్లు తీసేసి, మళ్లీ 30 లక్షల ఓట్లు మాత్రమే చేశారనీ ఆయన గుర్తుచేశారు. నికరంగా 60 లక్షల ఓట్లు తొలగించారనీ ఆయన వాపోయారు.అక్కడ బిజెపి చేసిన కుట్రలతో ప్రభుత్వమే మారిపోయిందనీ మాస్టర్ ట్రేనీలు గుర్తుపెట్టుకోవాలనీ ఆయన కోరారు. ఇక్కడ అలాంటి.కుట్రలు జరగకుండా చూసుకోవాలనీ హెచ్చరించారు. వయోజనుల ప్రతి ఓటును తప్పకుండా జాబితాలో ఉండేలా చూసుకోవాలనీ ఆయన సూచించారు. ఇది చాలా కీలకమైన శిక్షణ అనీ దీన్ని క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఎలు నైపుణ్యంగా చేయడానికి మీరు తిరిగి నియోజకవర్గాలలో తరగతులు నిర్వహించి బూత్‌లెవల్‌లో ప్రయోగాత్మకంగా అర్హులకు జాబితాలో చోటు ఉండేలా అమలు చేసుకోవాలనీ కోరారు.దేశంలో బిజెపి ఒక విషపూరిత కుట్రలు చేస్తూ చేస్తున్నదనీ దీనిని మనం అంతా కలిసికట్టుగా ఎదుర్కొని ప్రజాస్వామిక సౌధంను నిలబెట్టాల్సిన అవసరం ఉందని ఉద్బోదించారు.

## ప్రధాని మోడీ పాలనకు 12 యేళ్లు పూర్తి

### రాష్ట్రంలో బిజెపి ఆధ్వర్యంలో విస్తృత సేవా, ప్రజాహిత కార్యక్రమాలు

### పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్. గౌతంరావు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** కేంద్రంలో 12 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించిందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతం రావు మీడియా సమావేశంలో వెల్లడించారు. పార్టీ 12 ఏళ్ల మోడీ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల కోకన్వీనర్ వెంకటరమణి, సీనియర్ సిటిజన్ సెల్ కన్వీనర్ సుభాష్ చందర్జీ, అవినాష్, శ్రీరామ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. గౌతం రావు మాట్లాడుతూ, జూన్ 7వ తేదీతో మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, రాష్ట్ర జాతీయ అధ్యక్షుల సూచనల మేరకు విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం అనే అంశాల ప్రాతిపదికన ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ప్రతి బూత్, జిల్లా కార్యాలయాలు, రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరు మీద ఒక చెట్టు) అనే నినాదంతో ప్రతి కార్యకర్త అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని సంకల్పించాము. ఈ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో చేపట్టి పర్యావరణాన్ని కాపాడుతాం. 12 ఏళ్ల మోడీ పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో జరిగిన సమావేశాలను మీడియాకు వివరాలను వెల్లడిస్తామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి మండలంలో యోగా గురువులను సన్మానించనున్నట్లు, జూన్ 21న ప్రతి శక్తి కేంద్రం, మండలంలో స్థానిక ప్రజలతో కలిసి యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. 12 ఏళ్ల పాలనా విజయాలను వివరిస్తూ ప్రత్యేక ఎగ్జిబిషన్లు నిర్వహిస్తామని, ఇందులో మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై సన్మాన కార్యక్రమాలు, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సహజ వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్)పై పార్లమెంట్ స్థాయి సెమినార్స్, సమ్మేళనాలు చేపడుతాం. యువమోర్చా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వికసిత్ భారత్ సంకల్ప సమ్మేళనాలు నిర్వహిస్తూ, ప్రతి జిల్లాలో 500 మంది ప్రముఖులను కలిసి వారిని సన్మానిస్తామన్నారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో విబి జి రామ్ జి పథకం మహిళా మోర్చా ఆధ్వర్యంలో పిఎం స్వనిధి పథకం కింద ఉన్న లబ్ధిదారులతో సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు.

## జెసి సెట్ ఫలితాలను ప్రకటించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

### జూన్ 7లోపు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి విడతలో 18,401 సీట్లు భర్తీ అయినట్టు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. జేసీ సెట్-2026 మొదటి విడత ఫలితాలను మంత్రి శుక్రవారం సచివాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వోఎస్‌డీ వై.జె. విజయ్ కుమార్, సొసైటీ కార్యదర్శి కంభంపాటి శారద, జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, అసిస్టెంట్ సెక్రటరీ మధు నాయక్, డిప్యూటీ సెక్రటరీ సహజ, సూపరింటెండెంట్ మృణాళిని పాల్గొన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ), నాన్‌సీఓఈ, ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను మంత్రి విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోం దన్నారు. 2026 -27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు వచ్చాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఫేజ్1 అడ్మిషన్లలో 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. గ్రూపుల వారీగా ఎంపిసీలో 8,440 సీట్లకుగాను 8,156 సీట్లు, బైపీసీలో 8,280 సీట్లకుగాను 7,425 సీట్లు, ఎంఈసీలో 520 సీట్లకుగాను 377 సీట్లు, సీఈసీలో 1,520 సీట్లకుగాను 1,500 సీట్లు, హెచ్‌ఈసీలో 280 సీట్లకుగాను 257 సీట్లు, ఒకేషనల్‌లో 700 సీట్లకుగాను 686 సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు. ఫేజ్1లో ఎంపికైన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో జూన్ 7లోపు సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తల్లిదండ్రులకు సూచించారు. జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులను మొదటి రోజే కళాశాలలకు పంపించాలని మంత్రి కోరారు.

## ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో మొదటి ఫేజ్‌లో 18,401 సీట్ల భర్తీ



# ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే యువతకు ప్రోత్సాహం

## సమాకాలీన వార్తావిశ్లేషణల కోసం వార్షిక పుస్తకం విడుదల : మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనే తెలంగాణ యువత ఆశలను సాకారం చేసే దిశగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ పోటీ పరీక్షలలో యువత విజయం సాధించే దిశగా కావలసిన మెలకువలను, శిక్షణను ఉచితంగా అందిస్తూ 'మేధో తెలంగాణ' సాధన దిశగా పయనిస్తోందని, దీనికోసం పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలను యువతకు అందుబాటులోకి తీసుకొస్తుం దని మంత్రి తెలిపారు. పోటీ పరీక్షలలో కరెంట్ అఫైర్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉందని, దాదాపు 20 నుంచి 25 శాతం ప్రశ్నలు సమకాలీన వార్తలు విశేషాల మీద అడుగుతున్నారని, ఈ నేపథ్యంలో అభ్యర్థులందరూ కరెంట్ అఫైర్స్‌పైన సాధికారత సాధించేలాగా "వార్షిక 2025" పేరుతో 2025 సంవత్సరంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలు, విశేషాలు, వ్యక్తులు సంఘటనలకు సంబంధించిన సమాహారంగా ఈ పుస్తకాన్ని రూపొందించామన్నారు. ఈ పుస్తకంలో రాబోయే ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ ఉద్యోగాలకు సంబంధించిన "భారతీయ వైదిక హైందవ విజ్ఞానం" పేరుతో ప్రత్యేక సమాచారాన్ని కూడా అందించామని, ఈ పుస్తకంలో కరెంట్ అఫైర్స్ మాత్రమే కాక ప్రతి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థికి కావలసిన సాధారణ పరిజ్ఞానాన్ని, భారత రాజ్యాంగం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, భౌగోళిక శాస్త్రం, భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర, ఉద్యమం వంటి విశేషాలను ఎన్నిటినో ఈ పుస్తకం అందిస్తుందన్నారు. ఇలాంటి పుస్తకాన్ని బిసి స్టడీ సర్కిల్ ప్రచురించడం సంతోషదాయకమనీ, దీనికి సంపాదకత్వం వహించి ఈ పుస్తకాన్ని ప్రచురించిన డైరెక్టర్ మామిడి హరికృష్ణ అభినందిస్తున్నట్టు మంత్రి పొన్నం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలలో సివిల్ సర్వీసెస్, గ్రూప్ పరీక్షలు, బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమీషన్, పోలీస్, రైల్వే, ఉపాధ్యాయులు వంటి ఉద్యోగాల ఎంపికకు సంబంధించిన పోటీ పరీక్షల కోచింగ్ కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తూ అభ్యర్థులకు శిక్షణను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 బీసి స్టడీ సర్కిల్‌ల ద్వారా అందిస్తోందన్నారు. ఈ శిక్షణను యువత సక్రమంగా ఉపయోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

# వాక్కులను రక్షించాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సినీహీరో నాగచైతన్య

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** తన వ్యక్తిగత హక్కులు, గోప్యతను పరిరక్షించాలని కోరుతూ టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని ఢిల్లీ హైకోర్టులో నాగ చైతన్య పిటిషన్ దాఖలు చేశారు. నాగ చైతన్య పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కోర్టు నాగ చైతన్య అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి, వ్యక్తిత్వ హక్కులు పరిరక్షిస్తూ హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లేకుండా నాగ చైతన్య పేరు, ముఖ రూపం, కంఠస్వరం వాణిజ్యపరంగా వాడటంపై నిషేధం విధించింది. కాగా కొద్దిరోజుల క్రితం తన వ్యక్తిగత హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టులో సినీ నటుడు అక్కినేని నాగార్జున పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని నాగార్జున కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుపై మే 12వ తేదీన కోర్టు విచారణ జరిపింది. న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది. వ్యాపారి తరఫు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ ది ఘోస్ట్ సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది.

# గాదె వెంకట్‌రెడ్డి మృతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 29:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా పనిచేసిన సీనియర్ నాయకుడు గాదె వెంకట్ రెడ్డి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఐదుసార్లు ప్రాతినిథ్యం వహించిన వెంకట్ రెడ్డి, మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. సౌమ్యుడు, సహనశీలిగా పేరుగాంచిన వెంకట్ రెడ్డి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. వారు లేనిలోటు తీర్చలేనిదని పేర్కొంటూ, గాదె వెంకట్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వారి కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

# మైక్రోసాఫ్ట్ సంస్థలో ఎంపికైన యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ విద్యార్థులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 29:** మైక్రోసాఫ్ట్ సంస్థలో యేడాదికి రూ.7 లక్షల ప్యాకేజ్‌తో 11 మంది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ విద్యార్థులు సెలెక్ట్ అయ్యారు. మొత్తం 14 మంది డేటాసైన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేయగా 11 మంది మైక్రోసాఫ్ట్ సంస్థలో సెలెక్ట్ అయ్యారు.

# రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా?

## రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 29:** రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు.ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

# ఎన్‌ఎంఇఒ-ఒపి అమలులో తెలంగాణ టాప్

## దేశ ఆయిల్‌పామ్ విస్తీర్ణంలో 36 శాతం తెలంగాణలోనే.. జాతీయ సదస్సులో వెల్లడి

## రైతుల కృషి, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఈ విజయం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ (ఎన్ఎంఇఒ-ఒపి) కార్యక్రమం అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం న్యూ ఢిల్లీలో నిర్వహించిన జాతీయ వ్యవసాయ సదస్సు-2026లో రాష్ట్రాల వారీగా ఆయిల్ పామ్ సాగు పురోగతిని వెల్లడించగా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు స్పష్టమైందన్నారు. ఎన్ఎంఇఒ-ఒపి మిషన్ కింద 2021 నుండి 2026 వరకు దేశవ్యాప్తంగా 2,73,084 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టగా, అందులో 98,112 హెక్టార్లతో తెలంగాణ ఒక్కటే 36 శాతం వాటాను కలిగి ఉండటం రాష్ట్ర వ్యవసాయరంగానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతుండగా 79,448 మంది రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ విజయం కేవలం గణాంకాలకు మాత్రమే పరిమితం కాదన్నారు. రైతులు సంప్రదాయ పంటలతోపాటు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను స్వీకరిస్తూ ఆయిల్ పామ్ సాగు వైపు అడుగులు వేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. అయితే గతంలో అమలులో ఉన్న విధంగా కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై 44శాతం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరిస్తే, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు మరింత మేలు జరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. దిగుమతి సుంకం పెరగడం వల్ల దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి, ఆయిల్ పామ్ గెలల ధర మెట్రిక్ టన్నుకు రూ.25,000 వరకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఎడిబుల్ ఆయిల్స్ అవసరం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు, సిద్ధిపేట జిల్లాలో ఒకటి కలిపి మొత్తం మూడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని చెప్పారు. వీటి గంటకు ప్రాసెసింగ్ సామర్థ్యం 150 మెట్రిక్ టన్నుల వరకు ఉందన్నారు. అదనంగా మరో ఏడు ప్రాసెసింగ్ మిల్లులు నిర్మాణ దశలో ఉన్నాయని, అవి పూర్తయిన తర్వాత రైతులకు మరింత సమీపంలోనే ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆయిల్ పామ్‌రంగం కేవలం రైతుల ఆదాయాన్నే పెంచడం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రాసెసింగ్ మిల్లులు, రవాణా, కోత, నిల్వ, అనుబంధ కార్యకలాపాల ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు పరిశ్రమల అభివృద్ధికి కూడా ఈ రంగం దోహదపడుతోందన్నారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌సాగును మరింత విస్తరించాలని నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరో 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

# మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఇబ్బందులను పరిష్కరించాలి

## విరుద్ధ స్థలాలపై ముందుగానే నోటీసులు ఇవ్వాలి

## అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలి

## ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నియమ నిబంధనలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు ఇవ్వాలని, అధికారులు- పోలీసులు సమన్వయంతో పని చేయా లని సూచించారు. మహనీయుల విగ్రహాల ఏర్పాట్లలో ఎదురవుతున్న సమస్యలపై సచివాలయంలో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహాత్మా జ్యోతిబా పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అత్యంత కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధి లో మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో



ఎదురవుతున్న ఇబ్బందులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానిక స్థాయిలో తలెత్తు తున్న అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... మహనీయుల ఆశయాలను గ్రామస్థాయి నుంచి యువతలోకి తీసుకెళ్లే ప్రక్రియలో విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశంలో సామాజిక ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యాలతో సాగిందని మంత్రి పేర్కొన్నారు. ఆ యాత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే స్ఫూర్తి ప్రతిబింబించిందన్నారు. విగ్రహాల ప్రతిష్టాపనలో ఎలాంటి అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను చట్టబద్ధంగా, సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా లేని స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు స్పష్టమైన నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు.

# అమరావతిలో జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేస్తారా?

## ఎపి సిఎం చంద్రబాబుకు లేఖ రాసిన తెలంగాణ యంగ్ థింకర్స్ ఫోరం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 29:** అమరావతిలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు తెలంగాణ యంగ్ థింకర్స్ ఫోరమ్ కన్వీనర్ రోహిత్ వక్రాల లేఖ రాశారు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తెలంగాణలో పలువురు ఆంధ్ర నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. మాజీ సీఎం రోశయ్య, రవీంద్ర భారతిలో సినీ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఇటీవలే మైత్రి వైనంలో ఎన్టీఆర్ వంటి నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జయశంకర్ సార్ ఏర్పాటుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

# టివి ప్రకటనలపై బ్రాడ్‌కాస్టర్ల పిటిషన్లను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** వాణిజ్య ప్రకటనలకు సంబంధించి టీవీ ప్రేక్షకులకు భారీ ఊరట కల్పించేలా ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. టీవీ ఛానళ్లలో వాణిజ్య ప్రకటనల సమయాన్ని గంటకు గరిష్టంగా 12 నిమిషాలకే పరిమితం చేస్తూ టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా గతంలో తెచ్చిన నిబంధనలను హైకోర్టు శుక్రవారం సమర్థించింది. 2013లో ట్రాయ్ తీసుకు వచ్చిన ప్రకటనలపై కాలపరిమితిని సవాలు చేస్తూ పలువురు బ్రాడ్ కాస్టర్లు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను జస్టిస్ అనిల్ క్షేత్రపాల్, అమిత్ మహాజన్లతో కూడిన డివిజన్ బెంచ్ తిరస్కరించింది. ట్రాన్ నిబంధన ప్రకారం చానెళ్లు గంటకు 10 నిమిషాల వాణిజ్య ప్రకటనలు, 2 నిమిషాల స్వీయ ప్రచార కంటెంట్‌కు మాత్రమే అనుమతి కల్పించింది. అయితే ఈ నిబంధన టెలివిజన్ నెట్‌వర్క్‌లు ముఖ్యంగా ప్రకటనల ఆదాయంపై ఎక్కువగా ఆధారపడే వార్తా, ఉచిత ప్రసార చానెళ్ల ఆర్థిక స్థిరత్వానకి ముప్పు కలిగిస్తుందని వాదిస్తూ ప్రసారకర్తలు కోర్టుకెక్కారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న ఈ కేసులో చివరకు ఢిల్లీ హైకోర్టు ట్రాయ్ తెచ్చిన నిబంధనలను సమర్థించింది.

# పిఎంజె దోపిడి కేసులో ప్రధాన సూత్రధారి రిమాండ్



**కరీంనగర్ క్రైమ్, ప్రభాత వార్త:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యుయె లర్స్ దోపిడీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సుబోధ్ సింగ్‌ను పోలీ సులు రిమాండ్ కు తరలించారు. బీహార్‌లోని పూర్ణియా జైల్లో ఉన్న సుబోధ్ సింగ్ పై స్థానికంగా కూడా అనేక కేసులు ఉన్నాయి. అక్కడి కేసుల్లో భాగంగా అన్ని కోర్టులలో వీటి వారంట దాతలు చేసిన కరీంనగర్ పోలీసులు గురువారం రాత్రి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసి కరీంనగర్కు తీసుకువచ్చారు. అనంతరం నిందితున్ని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచయ రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుండి ఎలాంటి సమాచారం రాకపోవడంతో పాటు మరికొంతమంది నిందితులు పరారీ లోనే ఉండడం కేసు చిక్కుముడి వీడు ఎందుకు కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రధాన సూత్రధారుడిగా భావించిన నిందితుడిని తీసుకువచ్చిన కరీంనగర్ పోలీసులు శుక్రవారం ఉదయం నిందితున్ని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల కస్టడీ పిటిషన్ పై ఇంకా నిర్ణయం వెలువడకపోవడంతో తదుపరి చర్యల కోసం పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. కస్టడీకి కోర్టు అనుమతిస్తే సుబోద్ ముఠా సభ్యుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు రికవరీ కూడా కాకపోవడం మరికొందరు నిందితులు పట్టుబడకపోవడంతో కస్టడీలోకి కోర్టు అనుమతిస్తే ప్రధాన సూత్రధారి సుబోధసింగ్ నుండి పూర్తి సమాచారం రాబట్టే అవకాశం ఉంది.

# యేడాదిలో 14,434 కేసులు పరిష్కరించాం

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సమాచార కమిషనర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 29:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, సమాచార కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్ ,దేశాల భూపాల్ కలిశారు. బాధ్యతలు చేపట్టి యేడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సమాచార కమిషనర్లు ఆర్టీఐ కార్యకలాపాల గురించి ముఖ్యమంత్రికి తెలియజేశారు. సమాచార కమీషనర్లుగా బాధ్యత స్వీకరించాక 14,434 అప్పీల్స్, ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. నెలకు 1200 కేసుల చొప్పున పరిష్కరించామని, మే 2025నాటికి 11,973 అప్పీళ్ళు, 5,835 ఫిర్యాదులు మొత్తంగా 17,808 పెండింగ్‌లు ఉన్నాయని సిఎంకు ప్రధాన కమీషనర్ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. తాము పదవి బాధ్యతలు స్వీకరించాక కొత్తగా 7,622అప్పీల్స్, ఫిర్యాదులు వచ్చాయని పాతవాటితో కలిపితే మొత్తం 16వేల947 అప్పీళ్ళు, 8483 ఫిర్యాదులు మొత్తం 25,430 అప్పీల్స్, ఫిర్యాదులు కాగా వాటిని వెంటనే పరిష్కారం కోసం చొరవతీసుకొన్నామని తెలిపారు. దీనితో 9,355 అప్పీల్స్ 5,079 ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. ప్రస్తుతం 7,592 అప్పీల్స్, 3,404 పిర్యాదుల మొత్తం 10,996 ఇంకా పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. 23 జిల్లా కేంద్రాల్లో కూడా హియరింగ్ నిర్వహించామని తెలిపారు.

# కొత్త విద్యుత్ డిస్కం లోగో విడుదల

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ, మిషన్ భగీరథ తదితర వాటికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, కొత్తగా ఏర్పాటు చేసిన మూడో విద్యుత్ పంపిణీ సంస్థ అధికారిక లోగోను ఖ సంస్థ అధికారులు విడుదల చేశారు. ప్రధానంగా ఉచిత విద్యుత్ రంగానికి నాణ్యమైన సేవలందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కొత్త విద్యుత్ పంపిణీ సంస్థ ప్రారంభానికి ముహూర్తం ఇప్పటికే ఖరారైంది. ఈ మేరకు దీనికి సంబంధించి జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుండి ఈ నూతన డిస్కం పూర్తిస్థాయి సిబ్బందితో తన అధికారిక సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సంస్థకు సంబంధించి అధికారిక లోగో విడుదలైంది. అందులో సౌర, జల, పవన విద్యుత్‌కు సంబంధించి చిహ్నాలు ఉన్నాయి. అదేవిధంగా బ్యాక్ గ్రౌండ్లో పంట సాగు దృశ్యం కనిపిస్తుంది.

# ఒబిసిలపై కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు

## కర్ణాటకలో ఒబిసి సిఎంను గద్దె దించిన చరిత్ర కాంగ్రెస్‌ది

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు





**సూర్యాపేట బ్యూరో, ప్రభాతవార్త :** ఓబీసీల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శించారు. కర్ణాటకలో ఓబీసీ ముఖ్యమంత్రిని గద్దె దించి, అగ్రకులానికి చెందిన వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లోనూ అగ్రకులాల వారే ముఖ్య మంత్రులుగా ఉన్నారని, ఓబీసీలపై కాంగ్రెస్ చూపిస్తున్న ప్రేమ అంతా మొసలి కన్నీరేనని మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముస్లింల ఓట్ల కోసం మతాన్ని రెచ్చగొట్టి కాంగ్రెస్ రాజకీయం చేసిందని ఆరోపించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ దెబ్బ తీయడంతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదాన్ని మొదట ఇచ్చింది కూడా ఎన్టీఆరేనని తెలిపారు. అలాంటి ఎన్టీఆర్‌ను గతంలో అవమానపరిచిన కాంగ్రెస్ పార్టీకి చెందిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం రాజకీయ స్వార్థం కోసమేనని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రామచంద్రరావు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ శాతం పేరుతో రైతుల ధాన్యానికి కోతలు విధిస్తున్న మిల్లర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కైందని ఆరోపించారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోలేక రోడ్లపై ఏడుస్తుంటే, ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో ఎకరం రూ.250 కోట్లకు భూములు విక్రయిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.

మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కొనుగోళ్లపై రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రతి గింజ కొంటామని చెప్పిన మంత్రులు ఇప్పుడు కేంద్రం కొనడం లేదంటూ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.13 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. కేంద్రం అన్ని రకాలుగా సహకరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

# ప్రభుత్వానికి రైతుల ఆక్రందనలు వినబడట్లేదా?

## బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఫైర్




**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఘోర వైఫల్యాలపై బిజెపి శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి చేపట్టిన రైతు గోస బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల క్రితం చేవెళ్ల, పరిగి నియోజకవర్గాల నుండి ప్రారంభమైన తమ పర్యటనలో రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలలో రైతులు పడుతున్న అగచాట్లను కళ్లారా చూశామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కిలోమీటర్ల మేర రోడ్లపై ధాన్యం కుప్పలు పోసి, మండుటెండల్లో భార్యాపిల్లలతో సహా రైతులు కాపలా కాస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఐకెపి కేంద్రాలు ఏఎంసి సెంటర్లుగా కాకుండా జైళ్లలా కనిపిస్తున్నాయని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి, మొలకలు వస్తుంటే ఆరబోసుకోలేక, కాపలా కాయలేక ఆరుగాలం కష్టపడిన రైతన్న కన్నీరు పెడుతున్నాడని, సాగు సమయం దగ్గర పడుతున్నా ధాన్యం అమ్ముడుపోక పొలం పనులు చేసుకోలేని దయనీయ స్థితిలో రైతాంగం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పచ్చి అబద్ధాలు చెప్తున్నారని ఏలేటి మండిపడ్డారు. ఇప్పటివరకు కేవలం 45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 80 శాతం అయిపోయిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బిజెపి శ్రేణులు కళ్లాల్లోకి వెళ్లి రైతుల పక్షాన పోరాడుతుండటంతోనే ప్రభుత్వంలో చలనం వచ్చిందని, అందుకే నిన్న కాంగ్రెస్ మంత్రులు గాలి మోటార్లలో పెద్దపల్లి, మంథని వంటి ప్రాంతాలకు పరుగులు తీశారని ఎద్దేవా చేశారు. సమస్యే లేకుంటే ఇసుక, సిమెంట్ లారీలను, ట్రాక్టర్లను ఆపేసి ధాన్యం తరలించాలని రాత్రికి రాత్రే సమీక్షా సమావేశాలు ఎందుకు పెడుతున్నారని, ఈ సోయి, ప్రణాళిక నెల రోజుల క్రితం ఎందుకు లేదని ఆయన నిలదీశారు. ఉత్తర తెలంగాణ నుండి దక్షిణ తెలంగాణ వరకు రాష్ట్రవ్యాప్తంగా దళారుల మాఫియా రాజ్యమేలుతోందని, మిల్లుల వద్ద తరుగు పేరిట సంచికి 2 నుండి 4 కిలోలు కోత విధిస్తూ, క్వింటాలుకు ఏకంగా 10 కిలోల వరకు నష్టపరుస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లు, గన్నీ బ్యాగులు, రవాణా, హమాలీ చార్జీల కోసం కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా నిధులు ఇస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సంచికి రూ.75 నుండి రూ.80 వరకు రైతులతోనే బలవంతంగా వసూలు చేయిస్తోందని మండిపడ్డారు. ఈ అదనపు తరుగు, అక్రమ వసూళ్ల ద్వారా రాష్ట్రంలో రైతుల రక్తాన్ని తాగుతూ దాదాపు రూ.4,000 కోట్ల దోపిడీ సాగుతోందని, ఈ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్తోందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మంత్రులు కేవలం తమ పదవులను కాపాడుకోవడానికి ఢిల్లీ టూర్లు చేస్తూ సూట్‌కేసులు మోయడానికే పరిమితమయ్యారని, పరిపాలన చేతగాకనే బిజెపిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకు, భట్టి విక్రమార్కకు బహిరంగ సవాల్ విసిరారు. ధాన్యం కొనుగోళ్లు, లెక్కలపై మంత్రులకు దమ్ము, ధైర్యం ఉంటే ఏ ఛానల్‌లోనైనా ఓపెన్ డిబేట్‌కు రావాలని, తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. జూన్ 1వ తేదీ లోపు కళ్లాల్లో ఉన్న ప్రతి గింజను కొనుగోలు పూర్తి చేయాలని, లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో తదుపరి ఉమ్మడి కార్యాచరణ, పోరాట ప్రణాళిక ప్రకటిస్తామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

# కొత్త విద్యుత్ డిస్కంపై భిన్నాభిప్రాయాలు


## తీవ్ర వాదోపవాదాల మధ్య ముగిసిన విచారణ

## త్వరలో విద్యుత్ నియంత్రణ కమిషన్ తుది నిర్ణయం

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త** : తెలంగాణలో కొత్త డిస్కం ఏర్పాటు, లైసెన్స్ జారీపై జరిగిన బహిరంగ విచారణ తీవ్ర వాదోపవాదాలు, భిన్నాభిప్రాయాలు మధ్య ముగిసింది. హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ బహిరంగ విచారణ జరిగింది. వివిధ రాజకీయ పక్షాలు, రైతు సంఘాలు ఈ ప్రతిపాదనపై తమ అభ్యంతరాలను, అభిప్రాయాలను ఈఆర్సీ ముందు వ్యక్తం చేశాయి. ఈ విచారణలో వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ పంపిణీ లైసెన్స్ జారీ చేయాలని ఈఆర్సీకి ప్రభుత్వం దరఖాస్తు చేసింది. అయితే ఈ విధానం వల్ల విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రమాదం ఉందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పలువురు ఈఆర్సీకి లేఖలు సమర్పించి విచారణలో వాదించారు. రైతు డిస్కం ఏర్పాటుతో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టే కుట్ర జరుగుతోందని, ఇది ప్రైవేటీకరణకు దారితీస్తుందని బీఆర్ఎస్ నేతలు వ్యతిరేకించారు. అసెట్స్ (ఆస్తులు), అప్పుల స్పష్టత లేకుండా కొత్త డిస్కమ్‌కు బదలాయించడం చట్టవిరుద్ధమని రిటైర్డ్ ఇంజనీర్లు సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బహిరంగ విచారణలో పాల్గొన్న భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తన అభిప్రాయం వ్యక్తం చేస్తూ రైతు డిస్కం ఏర్పాటుపై ప్రతిపక్ష పార్టీలు ఊహాజనితంగా మాట్లాడుతున్నాయని విమర్శించారు. రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని ప్రభుత్వం రైతు డిస్కం ఏర్పాటు చేసిందన్నారు. 2014లో విద్యుత్ బకాయిలు రూ.1,595 కోట్లు ఉండేవని, ఇప్పుడవి రూ.31,698 కోట్లకు పెరిగాయన్నారు. డిస్కంలను బలోపేతం చేయడం కోసమే ఈ కొత్త డిస్కంను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 10 ఏళ్లలో డిస్కంలను అప్పుల కుప్పగా మార్చారని, కాంగ్రెస్ సర్కార్‌పై చెడు ప్రచారం చేయడమే బిఆర్ఎస్ నేతల అజెండా అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయంలో నాలుగు గోడల మధ్య నిర్ణయాలు జరిగితే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఈఆర్సీ వద్ద అన్ని పార్టీల వాళ్ళు చర్చ చేస్తున్నారన్నారు. అలాగే తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రైతు డిస్కమ్ పేరుతో రైతులపై ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. రైతు డిస్కమ్ తో వ్యవసాయానికి ఎండ్రిన్ పోసినట్టేనని విమర్శించారు. ఈ కొత్త డిస్కమ్ కారణంగా మొత్తం 29 లక్షల బోర్ల మోటార్ల పరిస్థితి డోలాయనంలో పడుతుందన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ఎందుకు చర్చ పెట్టలేదని ప్రశ్నించారు. కచ్చితంగా రైతు డిస్కమ్ విషయంలో ప్రభుత్వానికి దురుద్దేశంతో ఉందన్న అనుమానం కలుగుతోంది. ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌ల పరిస్థితి బాగాలేదనేది ప్రభుత్వమే అంటోందని చెప్పారు. ఇప్పటికే రూ. 25 వేల కోట్ల నష్టంలో డిస్కమ్‌ను కంపెనీ పేరుతో రిజిస్టర్ చేస్తామంటున్నారు. ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ వస్తే 2 నెలల సమయం పడుతున్నారు. సబ్సిడీ, డొమెస్టిక్ ఫ్రీ కరెంట్‌కు ఇవ్వాల్సిన మొత్తంతో పాటు, ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ.35 వేల కోట్లు ఉన్నాయని, అలాంటప్పుడు ఈ కంపెనీ లాభాల్లో ఎలా ఉంటుందని నిలదీశారు. వీరితో పాటు, పలువురు తమ అభిప్రాయాలను విద్యుత్ నియంత్రణ కమిషన్ ముందు వెల్లడించారు. ఈ అభిప్రాయ సేకరణలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, కొత్త డిస్కం సిఎండిలు హాజరయ్యారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన నేపథ్యంలో అన్ని వర్గాల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈఆర్సీ త్వరలోనే లైసెన్స్ జారీపై తుది నిర్ణయం తీసుకోనుంది.

## హార్ముజ్ జలసంధిలో చిక్కుకుపోయిన 2వేల నౌకలు

# సురక్షితంగా జలసంధిని దాటిన భారత్ నౌక



**వాషింగ్టన్, మే 29:** అమెరికా ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయిన దాదాపు 2,000 వాణిజ్య నౌకలు హార్మూజ్ జలసంధి నుంచి బయటకు వచ్చేందుకు ఎదురుచూస్తున్నాయని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్నాయని, నౌకల రాకపోకలకు మార్గం సుగమం అయితే ప్రపంచ చమురు సరఫరాలు వేగంగా పుంజుకుని, ధరలు తగ్గే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో ఐదో వంతు హార్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది. ఇది అత్యంత కీలకమైన వాణిజ్య మార్గం. ఈ ఏడాది ప్రథమార్ధంలో అమెరికాఇరాన్ మధ్య వివాదం ముదరడంతో ఈ మార్గంలో నౌకల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. భద్రతా కారణాలు, బీమా సమస్యలు, ఇరాన్ ఆంక్షల వల్ల గతంలో రోజుకు 100కి పైగా నౌకలు ప్రయాణించే ఈ మార్గంలో రద్దీ పూర్తిగా పడిపోయింది. దీంతో వేలాది మంది నావికులు నౌకల్లోనే చిక్కుకుపోగా, ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. నిలిచిపోయిన వాటిలో అత్యధికంగా చమురు ట్యాంకర్లే ఉన్నాయి. ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ మే నెలలో చమురు ధరలు ఇప్పటికే 10 శాతం తగ్గాయని బెస్సెంట్ తెలిపారు. జలసంధిలో రాకపోకలు పూర్తిగా పునరుద్ధరణ పెద్ద సంఖ్యలో వేచిచూస్తున్న నౌకల వల్ల చమురు సరఫరా మార్కెట్‌లో పుష్కలంగా ఉంటుందని ఆయన వివరించారు. హార్మూజ్ జలసంధిపై ఎలాంటి టోల్ విధించే ప్రణాళికలు లేవని ఒమన్ హామీ ఇచ్చిందని కూడా ఆయన ధ్రువీకరించారు. షిప్పింగ్ కంపెనీలలో విశ్వాసం నింపేందుకు అమెరికా ఇప్పటికే నౌకాదళ ఎస్కార్ట్‌లు, సముద్రయాన పునర్‌బీమా కార్యక్రమం వంటి చర్యలను ప్రకటించింది. నెలల తరబడి నౌకలు నిలిచిపోవడంతో వేలాది మంది నావికులు కుటుంబాలకు దూరంగా, అనిశ్చిత పరిస్థితుల్లో చిక్కుకుపోయారు. షిప్పింగ్ కంపెనీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయని ప్రస్తుతం కాల్పుల విరమణ, అణు ఒప్పందంపై చర్చలు పురోగమిస్తేనే నౌకల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆయన అన్నారు. ఒకవేళ అదే జరిగితే చమురు మార్కెట్‌కు అవసరమైన దానికంటే ఎక్కువ సరఫరా అంది, ధరలు వివాదానికి ముందునాటి స్థాయి కంటే కూడా కిందకు పడిపోవచ్చని బెస్సెంట్ అంచనా వేశారు. భారత్‌కు వస్తున్న ఓ చమురు ట్యాంకర్ కీలకమైన హార్మూజ్ జలసంధిని శుక్రవారం సురక్షితంగా దాటింది. అమెరికా, ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు ఊపందుకోవడంతో ఈపరిణామాలు భారత్‌కు సానుకూలంగా మారుతున్నాయి. ప్రాంతీయ ఘర్షణల కారణంగా గత కొన్ని నెలలుగా ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు, గ్యాస్ రవాణా జరిగే హార్మూజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ, నౌకలపై దాడులతో ఫిబ్రవరినుంచి ఇక్కడ సంక్షోభం కొనసాగుతోంది. మొత్తం అవసరాల్లో 85 శాతానికి పైగా చమురును దిగుమతి చేసుకునే భారత్‌పై తీవ్ర ప్రభావం చూపింది.

# నకిలీ జీవోలతో ప్రభుత్వ భూమి స్వాహా యత్నం

## పది ఎకరాలు కాజేసేందుకు యత్నించిన ముగ్గురి అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్ తదితరులు

**గచ్చిబౌలి, మే 29 ప్రభాతవార్త:** ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన కేటుగాళ్లు ఏకంగా ప్రభుత్వ ఉత్వర్వుల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు స ృష్టించారు. సదరు భూములు తమవంటూ కోర్టును ఆశ్రయించగా, కోర్టు వీరి అభ్యర్థనను కొట్టివేసి, ప్రభుత్వ భూమిగా తేల్చిన విషయాన్ని దాచిపెట్టడంతో పాటు నకిలీ రెగ్యులరైజేషన్ పత్రాలు స ృష్టించి లావాదేవీలు నిర్వహించారు. సదరు పత్రాలను చూపించి ఎదుటి పార్టీ వద్ద 4కోట్లు వసూలు చేశారు. ఈ డాక్యుమెంట్ల విషయమై గండిపేట తాహశీల్దార్ నుంచి పిర్యాదు అందుకున్న పోలీసులు మొత్తం తతంగంపై విచారణ చేపట్టడంతో నకిలీ డాక్యుమెంట్ల విషయం బహిర్గతమైంది. ఈమేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు మరికొందరి కోసం గాలింపు చేపట్టారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం సైబరాబాద్ కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు.. గండిపేట మండలం గండిపేట గ్రామం సర్వే నెంబరు 18లో గల 10 ఎకరాల ప్రభుత్వ భూమి తమదంటూ దివంగత దశరథ్ కుటుంబ సభ్యులు వాదిస్తున్నారు. ఈ క్రమంలో దశరథ్ కుమారులు నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, కుమార్తె మంగలు సదరు 10 ఎకరాలకు తామే యజమానులమంటూ హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ శాఖకు వ్యతిరేఖంగా వీరు పిటీషన్ దఖలు చేయగా గత సంవత్సరం అక్టోబరులో వీరి పిటీషన్‌ను కొట్టివేసిన కోర్టు సదరు భూమి ప్రభుత్వానిదని తేల్చి చెప్పింది. దీంతో వీరు బిల్ల రమేష్, బ్రహ్మానాయుడుతో కలిసి చేతులు కలిపి సదరు భూముల యజమానులు తామేనంటూ భారీ కుట్రకు పథకం వేశారు. ఇందులో భాగంగా నిమ్మల కుటుంబ సభ్యులు, బోల్ల రమేష్, బ్రహ్మానాయుడుల మధ్య ఓ ఎంఓయు చేసుకున్నారు. దీని లావాదేవీలో భాగంగా సెకండ్ పార్టీ నుంచి 4కోట్ల రూపాయలను నిమ్మల కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఈ లావాదేవీకి సునీల్, రాధాక్రిష్ణ అనే వ్యక్తులు మద్యవర్తులుగా వ్యవహరించారు. ఈ లావాదేవి కోసం నిమ్మల వేణుగోపాల్ కుటుంబ సభ్యులు బొల్ల రమేష్, బ్రహ్మానాయుడు, సునీల్, రాధాక్రిష్ణలతో కలిసి నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులను తయారు చేశారు. ఓ వైపు కోర్టు వీరి పిటీషన్‌ను కొట్టివేసి ప్రభుత్వ భూమిగా తేల్చగా, మరోవైపు ఈ ముఠా నకిలీ డాక్యుమెంట్లతో ప్రభుత్వ స్థలం విక్రయించే పథకం వేసింది. సర్వే నెంబరు 18లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం తమకు రెగ్యులరైజేషన్ చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు స ృష్టించారు. సదరు రెగ్యులరైజేషన్‌తో ప్రభుత్వం 10 ఎకరాల భూమిని తమకే కేటాయించినట్లు నమ్మించారు. కాగా ఈ రెగ్యులరైజేషన్ డాక్యుమెంట్ల విషయం తెలుసుకున్న గండిపేట తాహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి విచారణ చేపట్టారు. ఈ విచారణలో ప్రభుత్వం ఎటువంటి రెగ్యులరైజేషన్ చేయలేదని, సదరు పత్రాలు నకిలీవని గుర్తించాడు. ఈ మేరకు తాహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి నార్సింగి పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకొని నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, నిమ్మల రాజేశ్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించగా, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఎంఓయు డాక్యుమెంట్లు,

మొబైల ఫోన్లు, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నకిలీ డాక్యుమెంట్లు స ృష్టించి ప్రభుత్వ స్థలాన్ని కాజేయాలని చూసిన నిమ్మల రాజేష్‌గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## రైతు డిస్కం ప్రతిపాదనను వ్యతిరేకించిన బిఆర్ఎస్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే29:** తెలంగాణ రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ విధానాన్ని బలహీన పరిచే , రద్దు చేసే ఏ ప్రయత్నాన్నైనా బీఆర్ఎస్ నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తుందని బృందం సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రైతు డిస్కం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తు,ఈ ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వరాదని డిమాండ్ చేసింది. శుక్రవారం తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపె లిమిటెడ్‌కు డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ మంజూరు కోసం దాఖలు చేసిన దరఖాస్తుపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి అన్ని రాజకీయ పక్షాలతో అభిప్రాయ సేకరణను చేపట్టింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి,,జగదీశ్ రెడ్డి,మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, రెడ్కో మాజీ చైర్మన్ వై సతీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి పాల్గొని అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ మండలి చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుల పేరిట ప్రవేశపెట్టే ఏ సంస్కరణ పథకం, పునర్వ్యవస్థీకరణ, సంస్థాగత మార్పులు ఏవైనా రైతులకు స్పష్టమైన ప్రయోజనాన్ని చేకూర్చేలా ఉండాలని సూచించారు. దురదృష్టవశాత్తు వ్యవసాయంపై మాత్రమే దృష్టి సారించే ప్రత్యేక డిస్కంను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ రైతులకు ఏ నిర్దిష్ట ప్రయోజనం కలుగుతుందో వివరించడంలో ప్రస్తుత ప్రతిపాదన విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం స్పష్టమైన సంక్షేమ లక్ష్యాలతో రైతు కేంద్రకమైన అనేక చారిత్రాత్మక కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తు చేశారు. రైతుబంధు ద్వారా రైతులకు నేరుగా పెట్టుబడి సాయం అందించామని, రైతు బీమా ద్వారా వ్యవసాయ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించామని, ఉచిత విద్యుత్‌ను అందించామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు డిస్కం ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుత ఉన్న సమీకృత వ్యవస్థలో లేని అదనపు ప్రయోజనం ఈ కొత్త సంస్థ ద్వారా ఏమొస్తుందో అటు రైతులకు గానీ ఇటు విద్యుత్ వినియోగదారులకు గానీ అర్థం కావడం లేదని విమర్శించారు. భారత దేశంలో ఏ రాష్ట్రం కూడా కేవలం వ్యవసాయ వినియోగదారుల కోసం ప్రత్యేక డిస్కంను ఏర్పాటు చేయలేదని వెల్లడించారు. ఇప్పటికీ రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న తెలంగాణ విద్యుత్ రంగాన్ని ప్రమాదకరమైన పునర్వ్యవస్థీకరణ ప్రయోగానికి గురిచేస్తున్నారని, రైతు డిస్కం ప్రతిపాదన వెనుక ఉన్న నిజమైన ఉద్దేశంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.





# దేశవ్యాప్తంగా పెరుగుతున్న రూ.500 నకిలీనోట్లు!

## అప్రమత్తం కావాలని హెచ్చరించిన ఆర్బీఐ

**ముంబయి, మే 29:** దేశవ్యాప్తంగా అత్యధికంగా చెలామణిలో ఉన్న 500 రూపాయల నోట్లలో నకిలీనోట్లుకూడాపెరుగుతున్నట్లు రిజర్వుబ్యాంకు గుర్తించింది. గత ఆర్థిక సంవత్సరంలో వాస్తవ 500 రూపాయలనోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న నోట్ల సంఖ్య 11.2 శాతం మేర పెరిగింది. అదే సమయంలో నకిలీ నోట్లు కూడా ఎక్కువవుతున్నాయని తెలుస్తోంది. ఈ మేరకు కరెన్సీ నోట్ల గురించి ఆర్బీఐ తన వార్షిక నివేదికలో కీలక వివరాల్ని వెల్లడించింది. నిజానికి కరెన్సీలో ఇప్పుడు రూ. 500 పెద్ద నోటుగా ఉంది. దీనికే ఆదరణ కూడా పెరిగిందని చెప్పొచ్చు. ఈ మేరకు కరెన్సీ నోట్ల చెలామణి గురించి ఆర్బీఐ తన వార్షిక నివేదికలో ముఖ్య వివరాల్ని వెల్లడించింది. 2026 ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చి 31 నాటికి 7,05,482 లక్షల మేర రూ. 500 నోట్లు చలామణిలో ఉండగా అంతకుముందు ఇదే సమయంలో వీటి సంఖ్య 6,34,458 లక్షల నోట్లు ఉన్నాయి. విలువ పరంగా చూస్తే ఏడాది వ్యవధిలో రూ. 31.72 లక్షల కోట్ల నుంచి రూ. 35.27 లక్షల కోట్లకు పెరిగిందని ఆర్బీఐ తెలిపింది. ఇక ప్రస్తుతం మార్కెట్లో చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో అధిక వాటా రూ. 500 నోటుదే ఉంది. సంఖ్యా పరంగా చూసినా దీని వాటానే 41.2 శాతంగా ఉంది. ఇంకా విలువ పరంగా మెజార్టీ భాగం ఏకంగా 86 శాతం వాటా 500 రూపాయల నోటుదే కావడం విశేషం. సంఖ్యా పరంగా రూ. 10 నోటు 16.1 శాతం ఉండగా దీనిదే రెండో స్థానం. చలామణిలో ఉన్న రూ. 10 నోట్లలో మొత్తం ఈ నోట్ల విలువ 11.9 శాతం, సంఖ్యా పరంగా 10.5 శాతం పెరిగింది. దీనిని బట్టి ఆర్థిక వ్యవస్థలో క్యాష్ డిమాండ్ ఇంకా బాగానే కొనసాగుతుందనడానికి ఇది నిదర్శనంగా చెప్పొచ్చు. ఇక్కడ ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవస్థలో రూ. 500 నకిలీ నోట్లు పెద్ద సంఖ్యలో చలామణిలో ఉన్నట్లు ఆర్బీఐ గుర్తించింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఈ నోట్ల నకిలీ 20 శాతం మేర పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నకిలీ రూ. 500 నోట్ల సంఖ్య 1,17,222 గా గుర్తించగా 2025 -26లో చూస్తే ఇది 1,41,907 కి పెరిగింది. ఇది దాదాపు 20 శాతం ఎక్కువగా ఉంది. అన్ని నోట్ల పరంగా చూస్తే నకిలీ నోట్ల బెడద 5.7 శాతం మేర పెరిగిందని ఆర్బీఐ పేర్కొంది. రూ. 500 ఫేక్ కరెన్సీ నోటును గుర్తించి నకిలీ బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. ఇందుకు ఆర్బీఐ ఎప్పటికప్పుడు జనాన్ని అప్రమత్తం చేస్తోంది. ఆర్బీఐ కెహ్తా హై వెబ్‌సైట్‌లో దీని గురించి వివరించింది. ఈ వెబ్‌సైట్‌లో నోయువర్‌బ్యాంక్ సెక్షన్‌లోకి వెళ్తే అక్కడ అన్ని డినామినేషన్ కరెన్సీ నోట్లు కనిపిస్తాయి. వాటిపై క్లిక్ చేయడం ద్వారా అక్కడ కరెన్సీ నోటు ఫీచర్స్ తెలుసుకోవచ్చు. అన్నీ మార్క్ చేసి వివరించింది. గమనించడం ద్వారా ఏది నకిలీదో కనిపెట్టొచ్చవని ఆర్బీఐ సూచించింది.

## తెలుగు వర్సిటీలో సురవరం ప్రతాపరెడ్డి విగ్రహావిష్కరణ



తెలుగు యూనివర్సిటీలో సురవరం విగ్రహావిష్కరణలో పాల్గొన్న చిన్నారెడ్డి

**నిజాంపేట్, మే 29, ప్రభాతవార్త** తెలుగు జాతి సామాజిక, సాంస్కృతిక చరిత్రను పరిశోధించి ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు, ప్రముఖ జర్నలిస్టు, రచయిత, చరిత్రకారుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహాణ్ణి బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణలో సురవరం ప్రతాపరెడ్డి అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ విశ్వవిద్యాలయం చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు సమాజ చరిత్ర, సంస్కృతి, భాషా వికాసంపై చేసిన కృషి అపూర్వమని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. నిజాం పాలన కాలంలో తెలుగు భాషాభివృద్ధి, సామాజిక చైతన్యానికి ఆయన చేసిన సేవలను యువతకు పరిచయం చేసే లక్ష్యంతో తెలుగు విశ్వవిద్యాలయం ముందుకు సాగాలని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి జీవిత విశేషాలు, సాహిత్య సేవలు, తెలంగాణ సామాజిక చరిత్రపై ఆయన ప్రభావం, నేటి తరానికి ఆయన ఆలోచనల ప్రాసంగికతపై చర్చ జరుగాలని అన్నారు.

## రూ.2,546 కోట్లతో ట్రైకార్ వార్షిక ప్రణాళికకు ఆమోదం

### గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ బెల్లయ్యనాయక్

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:**తెలంగాణ షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్)కు ప్రస్తుత 2026-27ఆర్థిక సంవత్సరంలో రూ.2,546.24 కోట్లతో ప్రణాళికను అమలు చేయనున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఛైర్మన్, బెల్లయ్య నాయక్ తేజావత్ అధ్యక్షతన జరిగిన గిరిజన ఆర్థిక సహకార సంస్థ 11 వ బోర్డు సమావేశంలో ఈ మొత్తానికి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ ట్రైకార్ వార్షిక ప్రణాళికకు కేటాయించిన మొత్తంలో రూ.2085 కోట్లు సబ్సిడీ రూపంలో, మరో రూ.461.24 కోట్లు బ్యాంక్ రుణం రూపంలో గిరిజన యువతకు స్వయం ఉపాధి పథకాల నిమిత్తం ఆర్థిక సహకారం అందించుటకు ప్రణాళిక చేయటం జరిగిందన్నారు. ట్రైకార్ ద్వారా గిరిజనుల అభివృద్ధికి వివిధ వినూత్న పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా రాజీవ్ యువ వికాసం, ఆదిమ గిరిజనులకు జీవనోపాది అభివృద్ధి కార్యక్రమం,

రూరల్ ట్రాన్స్ పోర్ట్ పథకం, గిరిజన రైతులకు యాంత్రికరణ పథకం, క్యూర్ ప్రాంతంలో ఆటో రిక్షాల రిట్రోఫిట్టింగ్‌కు ఎలక్ట్రికల్ ఫిట్‌మెంట్ ఏర్పాటు, సీఎం ఎస్టీ ఎంటర్ ప్రెన్యూర్షిప్, ఇన్నొవేషన్ పథకం, ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడం కోసం ఈ వార్షిక ప్రణాళిక ఆమోదించడం జరిగినదని వివరించరు.

తద్వారా రాష్ట్రంలోని 1,36,184 మంది గిరిజన యువతకు లబ్ది చేకూరనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రైకార్ ఎండి సంతోష్, బోర్డు సభ్యులు హాజరయ్యారు.

## యువతను కాంగ్రెస్ మోసం చేస్తోంది

### బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే

**హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త:**రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేస్తుందని, నిరుద్యోగ యువత ఆశలను వమ్ము చేస్తుందని బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే మండిపడ్డారు. శుక్రవారం బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించి అనంతరం యూత్ డిక్లరేషన్ పేరుతో ప్రభుత్వం చేస్తున్న వైఖరిని నిరసిస్తూ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో యువత కీలక పాత్ర పోషించినప్పటికీ, నేటి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో ఆటలాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, పారదర్శక నియామకాలు వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ యువతకు న్యాయం జరిగే వరకు బిజెవైఎం పోరాటం కొనసాగుతుందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి గోరి కడతాం అని స్పష్టం చేస్తూ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రతి మండలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి, కలెక్టరేట్ల ముందు నిరసన కార్యక్రమాలు, మంత్రుల కార్యాలయాల ముట్టడి, చలో తెలంగాణ సచివాలయం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గావినోళ్ల హరిశ్వర్ రెడ్డి, మల్కా యశస్వి ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సందీప్ గౌడ్, నితిన్, అనిత రెడ్డి, శరత్ చంద్ర, సాయినాథ్‌తో పాటు కార్యదర్శులు, రాష్ట్ర పదాధికారుల, జిల్లా నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో విద్యుత్ సంస్థలు

## - రూ.69,741 కోట్ల నష్టాలు - రూ.59,230 కోట్ల అప్పులు - పంపిణీ సంస్థల్లో ఆర్థిక సంక్షోభం - దేశంలోనే రుణాల్లో ఆరో స్థానం

**హైదరాబాద్, మే 29, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా అప్పుల్లో కూరుకుపోయి ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్య పంపిణీ సంస్థల భవిష్యత్ అగమ్య గోచరంగా తయారయింది. అలాగే తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్కో), రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్కో) ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. కేంద్ర విద్యుత్ శాఖ నివేదిక-2025 ప్రకారం రాష్ట్రంలోని ఈ రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. రూ.69,741 కోట్ల నష్టాలు మూటగట్టుకోగా, సాంకేతిక, వాణిజ్య నష్టాలు 19.8 శాతంతో సి రేటింగ్‌లో ఉన్నాయి. దీంతో దేశంలోనే రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు 2వ స్థానంలో నిలిచాయి. దీనికి తగినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వీటికి రూ.54,090 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉందనేది విద్యుత్ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్చి నెలతో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో, రాష్ట్రం ఎదుర్కొంటున్న విస్తృత ఆర్థిక సవాళ్ల ప్రభావంతో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు అధిక రుణభారాన్ని మోస్తున్నాయి. రాష్ట్రం మొత్తం రూ.82,151 కోట్లకు పైగా రుణాలు ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల రుణాలు, ఫైనాన్స్‌కు సంబంధించి కీలక అంశాలు రుణాల స్థితిని చూస్తే తరచుగా డిస్కామ్ రుణాలకు మద్దతు ఇచ్చే తెలంగాణ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన రూ.71,400 కోట్ల ప్రారంభ పరిమితిని అధిగమించి, మొత్తం రాష్ట్ర రుణాలు రూ.80,000 కోట్లకు పైగా చేరాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డిస్కంల అప్పులు రూ.35,239 కోట్లు ఉండగా, 2023-24లో రూ.46,127 కోట్లు, 2024-25లో రూ.59,230 కోట్లకు పెరిగింది. 2024-25లో రూ.59,230 కోట్లగా ఉన్న ఈ అప్పు రూ.2025 మార్చి 31 నాటికి రూ.59,671కోట్లు, 2025 జూలై 31 నాటికి రూ.62,897 కోట్లకు చేరింది. అంటే ఈ రెండేండ్లల్లోనే డిస్కంల అప్పులు రూ. 27,658 కోట్లు పెరిగాయి. కాగా గత రెండేండ్లలో అప్పుల భారం మరింత పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అప్పులు అమాంతం పెరిగిపోయాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వ శాఖలకు చెందిన బకాయిలు రూ.48 వేల కోట్లు కూడా డిస్కంల పాలిట గుదిబండలా మారాయి. అప్పులతోపాటు రావాల్సిన బకాయిలు కూడా పెరుగుతుండటంతో డిస్కంలు సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకుంటున్నాయి. విద్యుత్తు సబ్సిడీ తప్ప ప్రభుత్వం ఇతరత్రా నిధులను సమకూర్చడంలేదు. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలు తీవ్ర ఒడిదుడుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సర్కార్ విద్యుత్ పంపిణీ సంస్థల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉచిత విద్యుత్ పంపిణీ నిమిత్తం కొత్తగా మూడో విద్యుత్ పంపిణీ సంస్థలను ఏర్పాటు చేసింది. ఇదే సమయంలో కేంద్రం అమలు చేస్తున్న రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్డీఎస్ఎస్) లో చేరేందుకు రాష్ట్ర కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్‌లో చేరినందువల్ల అదనంగా 0.5 శాతం చొప్పున దాదాపు రూ.67 వేల కోట్ల నిధులు కేంద్రం నుండి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంచనా.

## జిఐఎస్, రిమోట్ సెన్సింగ్ సాంకేతిక సామర్థ్యాభివృద్ధికి ఐఇఐ, ఎజిఐఎల్ఇ మధ్య ఒప్పందం

**హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త:**ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్, అసోసియేషన్ ఆఫ్ జియోఇన్ఫర్మాటిక్స్ లాబొరేటరీస్ ఫర్ ఎర్త్ సైన్సెస్ హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ద్వారా దేశవ్యాప్తంగా జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలలో సామర్థ్యాభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ, విజ్ఞాన విస్తరణకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా నిర్ణయించబడిందన్నారు. ఈ అవగాహన ఒప్పందం జియోఇన్ఫర్మాటిక్స్, జిఐఎస్, రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సాంకేతికతలు, భూవిజ్ఞాన అనువర్తనాల రంగాలలో సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ-విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందన్నారు. ఈ ఎంఓయు సంతక కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నిపుణులు, రెండు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా. జి. రమేశ్వర్ రావు పలు అంశాలపై వివరాలు వెల్లడించారు.

# కఫ్తాన్ భలే కంఫర్ట్ !

ఫ్యాషన్ ఫ్యాషన్







బయట ఎండలు దంచేస్తున్నాయ్. ఈ ఉక్కబోతకు వదులు దుస్తుల్లో ఉండే సౌకర్యం.. దేన్లోనూ ఉండదు కదా! మరి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు టాప్‌లూ, లెగ్గింగ్‌లూ ఒంటికి బిగుతుగా అనిపిస్తాయి. అవే వదులు దుస్తులు వేసుకుంటే కంఫర్ట్‌గా ఉంటాయి. పైగా శుభకార్యాలు ఏమైనా వచ్చినా పట్టు చీరలూ, ఒణీలాంటివి ఈ సీజన్‌లో అసౌకర్యంగా ఉంటాయి. ఇలాంటప్పుడు కఫ్తాన్ దుస్తులే ఫ్యాషన్. రకరకాల డిజైన్లలో, వదులుగా, సౌకర్యంగా ఉండే ఈ కఫ్తాన్ ఫ్యాషన్ ఎప్పటికీ ట్రెండే.అందుకే నేటితరం అమ్మాయిలు అటు ఇష్టం. ఇటు సౌకర్యానికే తగ్గట్టు వీటికే ఓటేస్తున్నారు. ట్రెండీగా, ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకుంటే వింటేజ్ స్టైల్, కొంచెం పాష్‌గా, అధునాతనంగా మెరవాలనుకున్నప్పుడు మ్యాక్సీను ఎంచుకుంటే సరి. గ్లామర్‌గా కనిపించాలనుకున్నప్పుడు ఆఫ్ షోల్డర్ డిజైన్ సరిగ్గా నప్పుతుంది. మీరు కనుక కొంచెం ఎత్తు తక్కువ. ఉంటే, అలాంట ప్పుడు మిడీ కఫ్తాన్ డ్రెస్ ఉత్తమ ఎంపిక షార్ట్ డ్రెస్‌లో మీరు ఎత్తుగా కనిపి స్తారు. ఫ్యాషన బుల్ గానూ, ఆకర్షణీ యం గానూ ఉంటారు

# గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్ భవిత



**అంతర్జాతీయ ఫ్యాషన్ ప్రపంచంలో హైదరాబాద్‌కు చెందిన 26 ఏళ్ల తెలుగు యువతి భవిత మండవ, అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు.**

ప్రతిష్ఠాత్మక ఫోర్బ్స్ '30 అండర్ 30' ఆసియా జాబితాలో చోటు దక్కించుకుని దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఆసియా ఖండంలోని యువ పారిశ్రామికవేత్తలు, కళాకారులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులతో కూడిన ఈ జాబితాలో భవితకు స్థానం లభించింది.'రైజింగ్ టాలెంట్స్' కేటగిరీలో భవితను ఫోర్బ్స్ ఎంపికైంది తెలుగు కుటుంబంలో జన్మించిన భవిత, హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఆర్కిటెక్చర్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత విద్య కోసం న్యూయార్క్‌లోని టాండన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. అతి తక్కువ కాలంలోనే ఆమె అంతర్జాతీయ వేదికలపై మెరిశారు. గత డిసెంబర్‌లో ప్రముఖ లగ్జరీ బ్రాండ్ షానెల్ మెటియర్స్ డి'ఆర్ట్ కలెక్షన్‌ను ప్రారంభించిన తొలి భారతీయ మోడల్‌గా చరిత్ర సృష్టించారు. ఆమె ప్రతిభకు ముగ్ధురాలైన షానెల్, మార్చి 2026లో ఆమెను తమ హౌస్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన మెట్ గాలా ఈవెంట్‌లో ఆమె పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# ముల్లంగితో ప్రయోజనాలు

ఆరోగ్య భాగ్యం

ముల్లంగిలోని మెథనాల్ వల్ల బరువు తగ్గి స్థూలకాయం తగ్గుతుంది. హైపోపెన్సిల్ ప్రభావం వల్ల హై.బి.పి తగ్గుతుంది. పచ్చి ముల్లంగి తినడం వల్ల, ముల్లంగి పేస్ట్ మొలలపైన పూయడం వల్ల లేదా ముల్లంగి రసం+తేనె తినడం వల్ల మొలలు, మొలల నుండి రక్తస్రావం కారడం తగ్గుతుంది. ముల్లంగి జ్యూస్ కామెర్లు కాలేయం వ్యాధులకి పనిచేస్తుంది. ఇది హెపటోటాక్సిన్స్‌కి ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముల్లంగి శరీరంలో వేడిని కల్గించి సంతానోత్పత్తి శక్తిని పెంచుతుంది. వీర్య వృద్ధిని కల్గిస్తుంది. ముల్లంగిలోని అనోటోసియనిన్లు వల్ల తక్కువ గ్లెసిమిక్ ఇండెక్స్ కల్గి ఉండడం వల్ల గ్లూకోజ్ శోషణని తగ్గించి రక్తంలో చక్కెరస్థాయిల్ని తగ్గించి చక్కెర నిరోధకత, నిర్వహణకు ఉపయోగపడుతుంది. ఆంటి కేన్సర్ ఏజెంట్‌గా కోలన్, కడుపు, ప్రేవులు, నోరు, కిడ్నీ కేన్సర్‌ల నిరోధకతకుపయోగపడుతుంది. థైరాయిడ్ హార్మోన్స్ వాటి సమ తుల్యతకు ముల్లంగి ఎంతగానో ఉపయోగపడుతుంది. కడుపునొప్పి, మంట, మలబద్ధకం, కడుపుబ్బరం వంటి గ్యాస్ట్రిక్ వ్యాధులు తీవ్రతని తగ్గించి, జీర్ణక్రియ శోషణ నియంత్రణలో ఉపయోగపడుతుంది. ముల్లంగిలోని ఫైబర్ వల్ల మలవిసర్జన సులభతరం అయి ప్రేవుల ఆరోగ్యానికుపయోగపడు తుంది. కిడ్నీలో స్టోన్స్ ఏర్పడకుండా, క్రియాటిగ్, యూరియాలు తగ్గించి మూత్రపిండాల ఆరోగ్యానికి తోడ్పడుతాయి. ముల్లంగిలోని సల్ఫక సమ్మేళనాల వల్ల విరేచనాలు అతి సారవ్యాధిని తగ్గించి కడుపులోని పురుగుల్ని నయం చేస్తుంది. ముల్లంగి విత్తనాలకి వెనిగర్ కలిపి చర్మంపై వచ్చే బొల్లి వ్యాధికి అప్లై చేస్తే తగు ఫలితం ఉంటుంది. కంది రీగలు, తేనెటీగలు కుట్టినచోట ముల్లంగి రసం అప్లై చేస్తే తగు ఫలితం ఉంటుంది. ముల్లంగి రసంలోకి నల్ల ఉప్పు జీలకర్ర మిరియాలపొడి కలిపి త్రాగితే దగ్గు, ఎలర్జీలు, శ్వాసకోశ ఇన్ఫె క్షన్స్. జ్వరం, కఫం తగ్గుతుంది. ముల్లంగిని ఎక్కువగా తీసుకోవ డం వల్ల మూత్రకోశ ఇన్ఫెక్షన్స్ తగ్గి మూత్ర సమస్యలూ, మంట, వాపు అదుపులో ఉండి వ్యర్థాలుండే మూత్రం ద్వారా వెళ్లిపోయే లా చేస్తుంది. ముల్లంగి గుజ్జుకాని, ముల్లంగి రసంలో నువ్వుల నూనె కలిపి చర్మానికి రాసినప్పుడు చర్మంపై వచ్చే దురదలు, మంటలు, మురికి, పచ్చలు పోయి చర్మం సౌందర్యం ఇనుమడిస్తుంది.

**జాగ్రత్తలు :** ముల్లంగిని మితంగా తీసుకోవాలి. ఎక్కువగా ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక సైడ్‌ఎఫెక్ట్స్ కల్గుతాయి. ఇవి కొందరిలో కన్పించవచ్చు. వికారం, లోబి.పి. డీ హైడ్రేషన్, థైరాయిడ్ క్రియాశీలత తగ్గడం, హైపో థైరాయిడిజమ్, హార్మోన్ స్రావం తగ్గుతుంది. ముల్లంగిలోని అధిక పీచు వల్ల అతిసారం, పొత్తి కడుపు నొప్పి, వాంతులు, వికారం, హైపోగ్లైసీమియా వస్తుంది. గర్భధారణ సమయంలో ముల్లంగి ఎక్కువగా తినరాదు. దీనిలో హిస్టమిన్ లెవల్స్ తక్కువగా ఉంటాయి. కాబట్టి అరుదుగా కొందరిలో ఎలర్జీ వస్తుంది. రాష్, దద్దుర్లు అంజియోడిమా, క్రాంప్స్, పొట్ట ఉబ్బరం, పెదవుల వాపు వస్తుంది. పిల్లలకి ముల్లంగి తురుము మెత్తగా ఉడికించి నలిపి తీసుకోవాలి.



ముల్లంగిని సాధ్యమైనంత వరకు రాత్రిపూట తినకుండా ఉంటేనే మంచిది. ఎందుకంటే దీని వల్ల మూత్రవిసర్జన జరిగి నిద్రా భంగం అవుతుంది. గర్భిణీలు పిత్తాశయంలో రాళ్ళు ఉన్నవారు, వాతరోగులు వీటిని తీసు కోకుండా ఉంటేనే మంచిది. ముల్లంగికి విరుగుడుగా తేనె, జీల కర్ర, ఉప్పు, వెనిగర్ ఆవాల్ని వాడ వచ్చు. రంగు మారినా, జిగటగా ఉన్న, కుళ్లిన నల్లని గోధుమ రంగు మచ్చలుండే ముల్లంగిని తినరాదు. గ్యాస్ ట్రబుల్, ఆసిడ్ రిఫ్లెక్స్. ప్రేవుల సమస్య ఉంటే పచ్చవి తినరాదు. దీన్ని బెండ కాయతో, అరెంజెస్, దోసకాయ, టీతో తీసుకోరాదు. రెండింటికి మధ్య అరగంట నుండి గంట వ్యవధి ఉండాలి. జ్వరం, వళ్ళు నొప్పులు, శారీరక శ్రమ చేయనివారు మితంగా తీసుకోవాలి. ఆపరేషన్స్‌కి రెండు వారాల ముందు తర్వాత తినరాదు ముల్లంగి రసంని ఖాళీ కడుపుతో త్రాగవచ్చు. వాడి పోయిన ముల్లంగి ఆకులు, కాండం వేర్లపై పగిలిన చర్మం ఉన్న ముల్లంగులు ముదిరి లెక్క. ముల్లంగి పెరుగు, కాకర కాయతో కలిపి తినరాదు. ముల్లంగి తిన్న వెంటనే సిట్రస్ పండ్లు తినరాదు, కొందరిలో తిన్నతర్వాత తెల్ల మచ్చలు, కడుపు నొప్పి, గ్ర్యాస్ ట్రబుల్ రావచ్చు. వండిన ఆహారంతో పచ్చికూర గాయల్ని తినరాదు. తింటే జీర్ణకోశ సమస్యలు వస్తాయి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# ప్లాస్టిక్‌తో ముప్పు



ప్లాస్టిక్ వినియోగం విషయంలో చాలామందికి ఈ సందేహం ఉంటుంది. ప్లాస్టిక్, క్యాన్సర్ మధ్య గల సంబంధాన్ని పరిశీలిస్తే.. ప్లాస్టిక్ తయారీ వాడే రసాయన సమ్మేళనాలు ఇందుకు కారణమవుతుంటాయి. ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో ఈ సమ్మేళనాలు గ్యాస్ రూపంలో బయటకు వస్తాయి. వాటిని పీల్చినప్పుడు కొంత ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఫుడ్ గ్రేడ్ కాని ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను పెట్టకపోవడం, అవెన్‌లో పెట్టి వేడి చేయకపోవడం, అలాంటి వస్తువులను వాడకపోవడం మంచిది. అలాగే క్యాన్సర్‌ను కారణమయ్యే రసాయ నాలను విడుదల చేసే పరిశ్రమలకు దూరంగా ఉండడం అన్ని రకాలుగానూ మంచిది. ఏ రకంగా అయిన సర్వే ప్లాస్టిక్ వినియోగానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉన్నప్పుడే ఇటు క్యాన్సర్ అటు ఇతర ఆర్యోగాల ముప్పును తగ్గించుకోవచ్చు.

# బీట్‌రూట్ ఖర్జూరం హల్వా



**కావాలసినవి :** బీట్‌రూట్ రసం-కప్పు, ఖర్జూరం-10 (వేడి నీళ్లల్లో కడిగి..కాసేపు నానబెట్టి, గుజ్జులా చేసుకోవాలి) పంచదార- పావు కప్పుపైనే, నెయ్యి-పావు కప్పు, ఏలకులు 2 . జీడి పప్పు-15 పైనే ఫుడ్‌కలర్- కొద్దిగా, ముందుగా స్టవ్ ఆన్ చేసుకుని.. మంట చిన్నగా పెట్టుకోవాలి. కళాయి వేడికా గానే.. 1 టేబుల్ స్పూన్ నెయ్యి వేసుకుని.. అందులో జీడిపప్పు దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. అనంతరం కళాయిలో ఇంకాస్త నెయ్యి వేసి.. ఖర్జూరం గుజ్జు వేసుకుని తిప్పుతూ ఉండాలి. మధ్యమధ్యలో నెయ్యి వేసుకుంటూ బాగా కలపాలి. తర్వాత సరిపడా పంచదార, బీట్‌రూట్ రసం, ఫుడ్ కలర్ వేసి చిన్నగా గరిటెతో తిప్పుతూ ఉడికించు కోవాలి. మళ్లీ కొద్దిగా నెయ్యి వేసుకుని తిప్పాలి ఏలకులు, జీడిపప్పు వేసుకుని కలపాలి. మిగిలిన నెయ్యి మొత్తం వేసుకుని. తప్పుతూ దగ్గర పడగానే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ లోపలంతా నెయ్యిరాసి..ఆ మొత్తం మిశ్రమాన్ని..దానిలోకి తీసుకోవాలి. కాస్త చల్లారాక నచ్చిన షేప్‌లో కట్ చేసుకుంటే సరిపోతుంది.

# 'ఇట్లు అర్జున' ఫస్ట్ సింగిల్ 'హాయ్ రే' పాట



స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల తన నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున' 'న్యూ గై ఇన్ టౌన్' అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, మహేష్‌ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది అనౌన్స్‌మెంట్ వీడియో, ప్రోమోతో అంచనాలు పెంచిన మేకర్స్, తాజాగా ఫస్ట్ సింగిల్ హాయ్ రేను విడుదల చేస్తూ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. నేచురల్ స్టార్ నాని లాంచ్ చేసిన ఈ పాట యూత్‌ఫుల్ ఎనర్జీతో, క్యాచీ ట్యూన్‌తో ఆకట్టుకుంటోంది. ఎస్. థమన్ ఈ పాటను స్ట్రాంగ్ ఎలక్ట్రానిక్, హిప్‌హాప్ బీట్స్‌తో ఫాస్ట్ పేస్డ్ రిథమ్ నంబర్‌గా కంపోజ్ చేశారు. ట్రెండీ రిథమ్స్‌తో పాటు క్లాసికల్ టచ్, బ్రైట్ ఇన్‌స్ట్రు మెంటేషన్ పాటకు మోడ్రన్ సోల్‌ఫుల్ ఫీల్ తీసుకొచ్చాయి. అనిరుధ్ రవిచందర్ తన ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాఫ్ట్ ఎమోషన్స్ నుంచి హై ఎనర్జీ హుక్స్ వరకు ఆయన వాయిస్ పాట మూడ్‌ను మరింత ఎలివేట్ చేసింది. ప్రోమోలో ఛాలెంజింగ్ పాత్రతో ఆకట్టుకున్న అనీష్, 'హాయ్ రే' పాటలో మరో కొత్త కోణాన్ని చూపించాడు. ముఖ్యంగా డ్యాన్స్‌లో తన నేచురల్ ఫ్లో, క్లీన్ మూవ్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకు న్నాడు. హిప్‌హాప్ స్టైల్‌లో ఆయన చేసిన డ్యాన్స్ విజువల్‌గా ఫ్రెష్ ఫీల్ ఇస్తోంది. థమన్ ఎనర్జిటిక్ కంపోజిషన్, అనిరుధ్ మ్యాజికల్ వాయిస్, అనీష్ స్టైలిష్ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ కలిసి 'హాయ్ రే'ను ఇన్‌స్టంట్ లైకబుల్ ఫస్ట్ సింగిల్‌గా నిలబెట్టాయి.

# 'రోమాంచకం' మూవీ టైటిల్ పోస్టర్ రిలీజ్



అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ రూపొందించిన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ పై తన సోదరుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ప్రతి చిత్రాన్ని నిర్మిస్తున్నారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా. ఈ సెన్సేషనల్ బ్రదర్స్ ఒక యంగ్ టీమ్ తో సినిమా ప్రొడ్యూస్ చేస్తున్నారంటే ఆ ప్రాజెక్ట్ తప్పకుండా మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తుంది, అందరిలో అంచనాలు పెంచేస్తుంది. అలాంటి క్రేజీ సినిమానే 'రోమాంచకం' సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్‌రెడ్డి వంగా సమర్పిస్తుండగా, ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. 'రోమాంచకం' సినిమా టైటిల్ పోస్టర్ ఈ రోజు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ మనసుకు హత్తుకునే ఫీల్ తో యూత్ ఫుల్ వైబ్స్ తో ఆకట్టుకుం టోంది. ఈ సినిమా లవ్, ఫన్, బ్యూటిఫుల్ ఎమోషన్స్ ఉన్న ఒక ఫ్రెష్ ఎంటర్ టైనర్ అనే ఇంప్రెషన్ టైటిల్ పోస్టర్‌తో కలుగు తోంది. ఈ చిత్రానికి పెట్టిన ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్ లైన్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సరికొత్త కథకు సుమంత్ ప్రభాస్, అనంతిక జంట మరింత ఫ్రెష్ నెస్ తీసుకొస్తున్నారు. ఎంతోమంది యంగ్ టాలెంటెడ్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్న 'రోమాంచకం' సినిమా ఒక ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా రూపొందుతోంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ వెల్లడించనున్నారు.

తెర

# 'పెద్ది' థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా



రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

ఢిల్లీ ప్రెస్ మీట్ లో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా కోసం మేమంతా ఎంతో నిజాయితీగా పనిచేశాం. అంకితభావం కలిగిన దర్శకుడు బుచ్చిబాబు గారు, నిర్మాత సతీష్ గారు, లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ గారు, బోమన్ ఇరానీ గారు, దివ్యేందు ఇలా అద్భుతమైన టీమ్‌తో కలిసి పని చేయడం చాలా ఆనందంగా అనిపించింది. హీరోయిన్ జాన్వి కపూర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాలో నేను చాలా అద్భుతమైన పాత్ర చేశాను. డైరెక్టర్ బుచ్చిబాబుఆ క్యారెక్టర్‌ను చాలా చక్కగా డిజైన్ చేశారు. బోమన్ ఇరానీ మాట్లాడుతూ..

రామ్ చరణ్ అమేజింగ్ స్టార్. ఆయన డాన్స్, ఎనర్జీ అన్నీ అద్భుతంగా ఉంటాయి.

# 'దీవాన' 'తెల్లపోరి...' లిరికల్ సాంగ్ విడుదల



'దీవాన' వన్ సైడ్ లవ్ స్టోరీ లో ఉన్న మ్యాడ్ నెస్ ప్రేక్షకులకు ఆకట్టుకునేలా చూపించబోతోంది. "దీవాన' సినిమా ఇప్పటికే మ్యూజికల్‌గా సక్సెస్ అవుతోంది. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన ఇది ప్రేమా .. ఇది ప్రేమా.. ఛాట్ బస్టర్ కాగా..ఇప్పుడు ఎనర్జిటిక్ టీజింగ్ సాంగ్ 'తెల్లపోరి...'ని మేకర్స్ రిలీజ్ చేశారు.తెల్లపోరి...' పాటను సంగీత దర్శకుడు ఈశ్వర్ చంద్ స్వరపర్చి, సాహిత్యాన్ని అందించి పాడటం విశేషం. ఈ పాటకు ది క్రింజ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ అనే క్యాప్షన్ మంచి జస్టిఫికేషన్ ఇస్తోంది. ఈ పాట ఎలా ఉందో చూస్తే తెల్లపోరి, నా తెల్లపోరి బల్లి కంటే తెల్లగుంటది..తెల్లపోరి, నా తెల్లపోరి బల్లి కంటే తెల్లగుంటది., మెత్తమెత్త బుగ్గలు, పందిపిల్ల పెదవులు, గింతకంటే క్యూటు పిల్ల యాడ ఉంటది, బ్రష్ చేస్తున్నా, ఫ్లష్ చేస్తున్నా, గా పిల్ల మొఖమే తిరుగుతుంటది, నా బండి మీద స్టిక్కర్ ఆమె పేరు మీదే, పాస్ వర్డ్ నెంబర్ అంటే ఆమె బర్త్ డే, ఇంతమంచి ఫీలింగ్ కావాలనంటే లవ్ లోనే శాతనైతదే.. అంటూ ఫన్నీగా ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. పాటలోని కాన్సెప్ట్‌లకు యాప్ట్ అయ్యేలా డిజైన్ చేసిన కొరియోగ్రఫీ, డిఫరెంట్ లొకేషన్స్ లో చేసిన పిక్చరైజేషన్ ఈ సాంగ్‌కు హైలైట్‌గా నిలుస్తున్నాయి. ఈ వన్ సైడ్ లవ్ స్టోరీ ఇప్పటికే సాంగ్, టీజర్ వంటి ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. "దీవాన" సినిమా టీజర్, సాంగ్స్ సూపర్బ్ రెస్పాన్స్ తెచ్చుకుంటు న్నాయి. యూత్ ఆడియెన్స్ లో "దీవాన" సినిమా పట్ల మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తు న్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో మణిమేగలై మరియు దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు.

# 'సిగ్మా' జూలై 31న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్



లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'సిగ్మా' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా జూలై 31న ప్రేక్షకుల ముందుకురానుంది. జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. అనౌన్స్మెంట్ నాటి నుంచే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా, టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. టీజర్ ఇప్పటికే 20 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సినిమాపై అంచనాలను పెంచింది. లైకా ప్రొడక్షన్స్ హెడ్ జి.కె.ఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ.. 'జూలై 31న 'సిగ్మా' ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉంది. సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులకు ఇది ఒక కొత్త సినీ అనుభూతిని అందిస్తుందని నమ్ముతున్నాం. దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. 'సిగ్మా' నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన ప్రయాణం. నా విజన్‌ను నమ్మి, ప్రతి దశలోనూ అండగా నిలిచిన లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు. భారీ స్థాయిలో రూపొందిన ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబుదాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# 'ది రెడ్ బ్యాగ్' హీరోయిన్ పోస్టర్ రిలీజ్..



డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి, మెమరీ మేకర్స్ బ్యానర్ మీద 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. రీసెంట్‌గా రాశీ పాత్రకు సంబంధించిన పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా హీరోయిన్ రాధ్య పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆమెను చూపించిన తీరు, గన్ను పట్టుకున్న విధానం, చేతిలో ఉన్న ఆ వస్తువు ఇలా అన్నీ హైలెట్ అవుతున్నాయి. పవర్ ఫుల్ లుక్‌లో రాధ్య అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తొలి సినిమానే అయినా, నిర్మాత హారికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపురి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు. త్వరలోనే టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ చేయనున్నారు.




# దర్జాగా ఫైనల్లో గుజరాత్

## గిల్ సూపర్ సెంచరీ

**క్వాలిఫయర్-1లో మిస్సయితే, క్వాలిఫయర్-2లో అందుకుంది. రాజస్థాన్ రాయల్స్ ఆశలను గల్లంతు చేస్తూ గుజరాత్ టైటాన్స్ దర్జాగా ఫైనల్లో ప్రవేశించింది. మొదట పేస్ చతుష్టయం రబడ, హోల్డర్, సిరాజ్, ప్రసిద్ధ్... రాజస్థాన్‌ను 214 పరుగులకే కట్టడి చేయగా... ఆ తర్వాత శుభ్‌మన్ గిల్ సెంచరీకి తోడు సాయి సుదర్శన్ మెరుపులతో లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ అందుకుంది. గుజరాత్ టైటాన్స్‌పై 8 వికెట్ల తేడాతో నెగ్గి ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం ఆర్సీబీతో ట్రోఫీ పోరుకు రెడీ అయింది.**

**న్యూచండీఘర్:** ఫైనల్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్‌షో చేసింది. రాయల్స్ ఉంచిన 215 లక్ష్యాన్ని ఛేధించేందుకు క్రీజ్‌లోకివచ్చిన శుభమన్ గిల్(53 బంతల్లో 104; 15 ఫోర్లు, 3సిక్స్‌లు), సాయి సుదర్శన్(32 బంతుల్లో 58, 8 ఫోర్లు, ఒ సిక్స్) తమ మోటో ఏంటో తొలి ఓవర్లో 19 రన్స్ పిండుకోవడం ద్వారా నిరూపించాడు. అక్కడి నుండి వీరిద్దరూ జోరుకు ఎదురులేకపోయింది. 6ఓవర్లకు 69 రన్స్‌కు, 8.4 ఓవర్లకు వంద మార్కును దాటించారు. చూస్తుండగానే జీటీ స్కోరు 11.5 ఓవర్లలో 150 రన్స్ దాటింది. ఈ క్రమంలో గిల్ 30 బంతుల్లో, సాయి 23బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తిచేశారు. అదే జోరు కొనసాగిస్తూ తొలి వికెట్‌కు 12.5 ఓవర్లలో 167 పరుగులు జోడించి గెలుపు పక్కా చేశారు. ఈ జోడీని చివరకు బ్రిజేష్ విడదీశాడు. గిల్ 47బంతుల్లో సెంచరీ చేసిన తర్వాత అర్చర్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. మిగతా పనిని సుందర్(16), బట్లర్(9నాటౌట్), తేవాటియా(17 నాటౌట్) పూర్తి చేశారు. మరో 8 బంతులు జీటీకి 7 వికెట్ల ఘనవిజయాన్ని అందుకుంది.

**మరోసారి ఆ 15 ఏళ్ల యూనివర్సల్ బేబీ బాస్ దిక్కయ్యాడు. ముల్లన్ పూర్ స్టేడియంలో రాజస్తాన్‌తో కీలక మ్యాచ్‌లో ఒక వైపు వికెట్లు పడుతున్నా... మరో ఎండ్‌లో కొరకరాని కొయ్యగా మారాడు. తన శైలికి భిన్నంగా బంతులను కాచుకుంటూనే రాజస్థాన్ బౌలర్లను చితక్కొట్టాడు. ముల్లాన్‌లో వరుసగా రెండోసారి సెంచరీని తృటిలో మిస్సయ్యాడు. 47 బంతుల్లో 96 రన్స్ సాధించాడు. అందులో 8 ఫోర్లు, 7 సిక్స్‌లు ఉన్నాయి. కేవలం నాలుగు పరుగుల తేడాతో సెంచరీ చేజారినా జట్టుకు బలమైన పునాది వేశాడు. దీంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 రన్స్‌కు చేరుకుంది. అలాగే ఈ ఐపీఎల్ సీజన్‌లో వైభవ్ మొత్తం పరుగులు 776కు, మొత్తం సిక్స్‌లు 72కు చేరుకున్నాయి.**

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాయల్స్‌కు ఆరంభంలోనే మైండ్ బ్లాంక్ అయ్యే షాక్ తగిలింది. జైస్వాల్ (1)ను ఇన్నింగ్స్ ఫస్ట్ ఓవర్లో సిరాజ్, ధ్రువ్ జురెల్ (7)ను రెండో ఓవర్లో కగిసో రబాడ అవుట్ చేయడంతో 9 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయింది.

### రియాన్ పరాగ్, దాసున్ షనక ఫెయిల్

థర్డ్ డౌన్‌లో వచ్చిన రవీంద్ర జడేజా(35 బంతుల్లో 45; 5 ఫోర్లు, ఒక సిక్స్) మరో ఎండ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి రాయల్స్ ఇన్నింగ్స్‌ను దారిలో పెట్టారు. ఈ దశలో దురదృష్టవశాత్తూ చేతికి గాయం కావడంతో జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుతిరిగాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ రియాన్ పరాగ్ రాగానే ఫోర్, సిక్స్ కొట్టి మంచి ఊపు మీద కనిపించినప్పటికీ.. 11 రన్స్ మాత్రమే చేసి జేసన్ హోల్డర్ బౌలింగ్ లో అవుట్ అయ్యాడు. దాసున్ షనక(3), జోఫ్రా ఆర్చర్ (7) కూడా చేతులెత్తేయడంతో రాజస్తాన్ కష్టాలు రెట్టింపయ్యాయి.

### సెంచరీ మిస్ చేసుకున్న వైభవ్

ఒకవైపు వికెట్లు పడుతున్నా..వైభవ్ మాత్రం గుజరాత్ బౌలర్లపై బాదుడు కంటిన్యూ చేశాడు. 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత మరింత దాటిగా ఆడాడు. 17వ ఓవర్లో సుందర్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో సెంచరీకి చేరువయ్యాడు. అయితే కేవలం 4 రన్స్ తేడాతో మరోసారి సెంచరీ మార్క్‌ను మిస్ చేసుకున్నాడు. రబాడ బంతికి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. మళ్లీ క్రీజులోకి వచ్చిన జడేజా రాజస్థాన్ స్కోర్ బోర్డును పరిగెత్తించాడు. పక్కా ప్లానింగ్ తో ఆడిన జడ్డూ 45 రన్స్ చేసి జట్టు భారీ స్కోర్ చేయడంలో కీ రోల్ ప్లే చేశాడు.

### ఫెరీరా విధ్వంసం, చివరి ఓవర్లో 27 రన్స్

స్పిన్నర్ రషీద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ లాస్ట్ ఓవర్లో డోనోవన్ ఫెరీరా(11బంతుల్లో 38) విధ్వంసం సృష్టించాడు. ఆ ఓవర్లో వరుసగా 6, 6, 6, 2, 6 బాదేశాడు. ఒకే ఓవర్లో ఏకంగా 27 రన్స్ పిండుకోవడంతో రాజస్థాన్ స్కోరు 214కు చేరింది.







# మెస్సీపై వీడిన సస్పెన్స్

## ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్జెంటీనా జట్టు ప్రకటన

**బ్యూనర్‌ఎయిర్స్:** స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సీ ఫిఫా ప్రపంచకప్ ఆడడంపై ఉత్కంఠ వీడింది. గాయంతో మెస్సీ జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఫిఫా ప్రపంచ కప్‌లో ఆడేది అనుమానమేన్న వార్తలు వచ్చాయి. వాటికి తెరదించుతూ ఫిఫి ప్రపంచకప్‌కు తమ జట్టును అర్జెంటీనా ప్రకటించింది. మెస్సీకి సారథ్య బాధ్యతలు అప్పగించింది. 2022లో మెస్సీ సారథ్యంలోనే అర్జెంటీనా... ఫుట్‌బాల్ ప్రపంచకప్ అందుకుంది.

26 మంది సభ్యులతో కూడిన జట్టును అర్జెంటీనా కోచ్ లియోనిల్ స్కలోని వెల్లడించారు. ఇటీవల ఇంటర్‌మియామీ తరఫున మ్యాచ్ ఆడుతూ మెస్సీ గాయపడ్డాడు. అయితే గాయం నుంచి కోలుకుని మెస్సీ పూర్తిగా అందుబాటులో ఉన్నారని, జట్టుకు నాయకత్వం వహించనున్నారని స్కలోని స్పష్టం చేశారు. దీంతో మెస్సీ రికార్డు స్థాయిలో ఆరోసారి ఫిఫా ప్రపంచకప్‌లో బరిలోకి దిగనున్నాడు. ఇప్పటికే 8 సార్లు బాలన్ డిఓర్ గెలిచిన మెస్సీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నాలుగేళ్ల క్రితం ఖతార్ వేదికగా జరిగిన అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించిన మెస్సీ మరోసారి మ్యాజిక్ చేస్తాడని ఆశిస్తున్నారు. ఈసారి కూడా అదే జోరును కొనసాగించాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రియల్ మాడ్రిడ్ యువ ఆటగాడు ఫ్రాంకో మస్తాంటునోకు జట్టులో చోటు దక్కలేదు. ఈ ఏడాది ఫిఫా ప్రపంచకప్‌కు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. గ్రూప్-జీలో ఉన్న అర్జెంటీనా తమ తొలి మ్యాచ్‌ను జూన్ 17న కన్సాస్ సిటీ వేదికగా అల్జీరియాతో ఆడనుంది. అదే గ్రూప్‌లో అల్జీరియా, ఆస్ట్రియా, జోర్డాన్ జట్లు ఉన్నాయి.

**అర్జెంటీనా జట్టు : గోల్‌కీపర్స్:** మార్టినేజ్, జెరోనిమా, జువాన్ ముసో; **డిఫెండర్స్:** గొంజాలో మాంటిల్, మోలినా, లిసాండ్రో మార్టినేట్, నికోలస్, లియోనార్డో, క్రిస్టియానా రొమారియో, మెదీనా, నికోలస్ ఫికో; **మిడ్‌ఫీల్డర్లు:** లియాండ్రో, రోడ్రిగో డీపాల్, పాలేసియస్, ఎంజో ఫెర్నాండేజ్, మాక్ అలిస్టర్, జియోవాని, బార్కో; **స్ట్రైకర్లు:** లియోనిల్ మెస్సీ (కెప్టెన్), నికోలస్ పాజ్, థియాగో అల్మడా, గొంజాలెజ్, జులియన్ అల్వరేజ్, గులియానో సిమోని, లౌతారో మార్టినేజ్, జోస్ లోపేజ్.

# గుకేశ్ ఓటమి; రెండో స్థానంలో ప్రజ్ఞానంద

**ఓస్లో:** నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్, భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేష్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ నంబర్ వన్ కార్ల్‌సన్ చేతిలో గుకేశ్ ఓటమి పొంది మొత్తం 3.5 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానానికి చేరాడు. మరోవైపు భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా మూడో విజయం అందుకున్నాడు. జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌పై విజయం సాధించి 6 పాయింట్లతో రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టోర్నమెంట్‌ను నెమ్మదిగా ప్రారంభించిన కార్ల్‌సెన్ మొత్తం 4.5 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకున్నాడు.

ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత గుకేశ్‌కు ఈ టోర్నీ కఠిన పరీక్షగా మారింది. ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. గుకేశ్ కొన్ని సందర్భాల్లో దూకుడుగా ఆడే ప్రయత్నం చేయడం అవకాశంగా మారిందని కార్ల్‌సన్ తెలిపాడు.



# ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలనం

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. ఐదో సీడ్ బెన్ షెల్టన్(అమెరికా) రెండో రౌండ్‌లోనే టోర్నీనుంచి నిష్క్రమించాడు. ప్రపంచ 62వ ర్యాంకర్ రఫెల్ కోలిగ్నాన్(బెల్జియం) అద్భుత ప్రదర్శనతో షెల్టన్‌ను 6-4, 7-5, 6-4 తేడాతో ఓడించి మూడో రౌండ్‌లో ప్రవేశించాడు. తొలిసెట్ నుంచే కొలిగ్నాన్..షెల్టన్‌పై ఆధిపత్యం చెలాయించాడు. అమెరికన్ ఆటగాడికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా వరుస సెట్లలో నెగ్గాడు. ఈ విజయంతో గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో మూడోరౌండ్‌కు చేరిన కొలిగ్నాన్ మరోసారి సత్తా చాటాడు. కాగా షెల్టన్‌కు ఇది నిరాశజనకంగా మారింది. 2023లో వింబుల్టన్ తర్వాత గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో మూడో రౌండ్‌కు ముందే షెల్టన్ నిష్క్రమించడం ఇదే తొలిసారి.

# సింగపూర్ ఓపెన్‌లో సింధూకు నిరాశ; క్వార్టర్స్‌లోనే నిష్క్రమణ


**సింగపూర్:** భారత్ స్టార్ ప్లేయర్ పీవీ సింధూకు సింగపూర్ ఓపెన్‌లో నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సెయంగ్(దక్షిణ కొరియా) చేతిలో వరుస గేమ్‌ల్లో ఓటమిపాలైంది. 48 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఆన్ సెయంగ్ 21-17, 21-14తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచి సింధు దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించింది. తొలి గేమ్‌లో ఒక దశలో స్కోరును 13-14కు దగ్గర చేసినా, కీలక సమయాల్లో ఆన్ సెయంగ్ చూపించిన కచ్చితత్వం సింధును వెనక్కి నెట్టింది. నెట్ వద్ద ఆన్ ఆధిపత్యం, వేగవంతమైన రిటర్న్లు ఆమెకు తొలి గేమ్‌ను అందించాయి. రెండోగేమ్‌లో ఆన్ 6-0తో ఆధిక్యంలోకి వెళ్లడంతో సింధుపై ఒత్తిడి పెరిగింది. అయినా భారత షట్లర్ పుంజుకుని స్కోరును 12-14కు తీసుకొచ్చి పోరును ఆసక్తికరంగా మార్చింది. కానీ చివర్లో చేసిన కొన్ని అనవసర తప్పిదాలు సింధూ అవకాశాలను దెబ్బతీశాయి. ఈ ఓటమితో ఒలింపిక్ చాంపియన్ ఆన్ సెయంగ్‌పై సింధూకు వరుసగా తొమ్మిదో పరాజయం ఎదురైంది.



కాగా ఆల్‌ఇంగ్లాండ్ రన్నరప్ లక్ష్యసేన్ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో కొకి వటాంబే(జపాన్) చేతిలో 19-21, 21-15, 15-21తో ఓడి ఇంట దారి పట్టాడు. పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్; మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధృవ్- తనీషాప్రత్యర్థులపై గెలుపుతో సెమీఫైనల్లో ప్రవేశించారు.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీకి భారీ నష్టాలు

## 5 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




**ముంబయి, మే 29:** ఈక్విటీ సూచీలు వారాంతంలో భారీ నష్టాలను చవిచూసాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడంలో నెలకొన్న అనిశ్చితి కీలకంగా కనిపిస్తోంది. వరుసగా మూడోసారి కూడా నష్టాలే చవిచూసాయి. సాధారణస్థాయికి తగ్గిన రుతుపవనాలు వంటివి కారణం అయినట్లు అంచనా. మధ్యప్రాచ్యం శాంతి ఒప్పందంపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ పెట్టారు. లేనిపక్షంలో ముడిచమురుధరలపై ప్రభావం చూపిస్తుందన్నది తెలిసిందే. చివరి అర్ధగంటలో అమ్మకాల వత్తిడి పెరిగింది. బిఎస్‌ఇలో ఇన్వెస్టర్ల సంపద రూ.5 లక్షలకోట్లు క్షీణించింది. ఎంఎస్‌సిఐ సూచీలో ఫెడరల్‌బ్యాంకు, ఎంసిఎక్స్ ఎక్స్ఛేంజి, నాల్కో, ఇండియన్ బ్యాంకులను తన గ్లోబల్ స్టాండర్డ్ సూచీలో చేర్చడం కూడా ఒక కారణం అయింది. అదే సమయంలో హ్యుండై మోటార్స్, జుబిలియంట్ ఫుడ్‌వర్క్స్, కళ్యాణ్ జ్యూయెలర్స్, రైల్ వికాస్ నిగమ్‌లను ఎంఎస్‌సిఐ తొలగించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 1092.06 పాయింట్లు క్షీణించి 74,775.74 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 359.40 పాయింట్లు దిగజారి 23,547 పాయింట్ల వద్దకు చేరింది.

గడచిన మూడు సెషన్లలోసెన్సెక్స్ 2.23శాతం, నిఫ్టీ 2.01శాతం క్షీణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.17 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 1.86, ఐసిఐసిఐబ్యాంకు 1.28శాతంచొప్పున నిఫ్టీలో ఎక్కువ వెనుకబడ్డాయి. మార్కెట్లలో బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 1.25 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం చొప్పున క్షీణించినట్లు స్పష్టం అయింది. బిఎస్‌ఇలో మొత్తం 1670 షేర్లు లాభాల్లో వెళితే 2599 షేర్లు క్షీణించాయి. 212 కంపెనీల షేర్లు మాత్రం ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి డాలర్‌తో చెలామణి 95.99వద్ద కదలాడింది. అంతకుముందురోజు 95.58కంటే మరికొంత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు 0.59శాతం క్షీణించి రూ.1.56 లక్షలకు చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై నెల సెటిల్‌మెంట్ ధరలు 1.54 శాతం క్షీణించి బ్యారెల్‌కు 92.27డాలర్లుగా కొనసాగాయి. సెన్సెక్స్‌లో టెక్‌మహీంద్ర, హెచ్‌సిఎల్, ఎల్‌అండ్‌టి, ఇన్ఫోసిస్ షేర్లు మినహా అన్నీషేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్‌కార్పొరేషన్, ఇండిగో, ఎన్‌టిపీసీ, మహీంద్ర అండ్ మహీంద్ర, టాటాస్టీల్ షేర్లు ఎక్కువ నష్టాలు చవిచూసాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్‌ధర 4530 వద్ద కొనసాగింది. ఇక విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి1040కోట్లు విత్‌డ్రాచేసారు.




# 91.97లక్షల కోట్లతో ఆర్బీఐ ఆస్తి అప్పుల పట్టీ

**ముంబయి, మే 29:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆస్తిఅప్పుల పట్టీ ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి వృద్ధి నమోదుచేసింది. దేశీయ పెట్టుబడులు, పసిడి నిల్వలు, విదేశీ పెట్టుబడులు భారీగా పెరగడంతో, ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ పరిమాణం 20.6 శాతం పెరిగి రూ. 91.97 లక్షల కోట్లకు చేరింది. శుక్రవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్బీఐ వివరాలను వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ. 2.87 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది.

నివేదిక ప్రకారం 2026 మార్చి 31 నాటికి ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్, అంతకుముందు ఏడాదితో పోలిస్తే రూ. 15.72 లక్షల కోట్ల మేర పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి బ్యాలెన్స్ షీట్ విలువ రూ. 76.25 లక్షల కోట్లుగా ఉంది. ఈ వృద్ధిరేటు గత ఆర్థిక సంవత్సరం 8.2 శాతంతో పోలిస్తే చాలా ఎక్కువ. తాజా వృద్ధితో ఆర్బీఐ ఆస్తిఅప్పులపట్టీ పరిమాణం దేశ జీడీపీలో 26.4 శాతానికి సమానంగా ఉంది. దేశీయ పెట్టుబడులు 44.9 శాతం, పసిడి నిల్వలు 63.8 శాతం, విదేశీ పెట్టుబడులు 7.9 శాతం పెరిగాయి. దీనివల్ల మొత్తం ఆస్తులలో దేశీయ ఆస్తుల వాటా గతేడాది 25.7 శాతం నుంచి 29.1 శాతానికి పెరిగింది.

విదేశీ ఆస్తుల వాటా 74.3 శాతం నుంచి 70.9 శాతానికి తగ్గింది. విదేశీ ఆస్తుల కన్నా దేశీయ ఆస్తులు వేగంగా పెరిగినట్లు ఇది సూచిస్తోంది. ఈ ఏడాది ఆర్బీఐ తన ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా రూ. 1.09 లక్షల కోట్లను తక్షణావసరాల నిధికి బదిలీ చేసింది.

కేంద్రానికి ప్రకటించిన రూ. 2.87 లక్షల కోట్ల డివిడెండ్, ప్రస్తుతం పశ్చిమాసియా సంక్షోభం వల్ల ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి ఎంతగానో దోహదపడనుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2023లో రూ. 63.45 లక్షల కోట్లుగా ఉన్న బ్యాలెన్స్ షీట్, 2024లో రూ. 70.47 లక్షల కోట్లకు, 2025లో రూ. 76.25 లక్షల కోట్లకు పెరిగి, తాజాగా రూ. 91.97 లక్షల కోట్లస్థాయిని బ్రేక్‌చేసింది.

# డేటా సెంటర్లలో గ్లోబల్ టాప్ అమెరికా

**న్యూఢిల్లీ, మే 29:** డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న డేటా సెంటర్ల రంగంలో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం డేటా సెంటర్లలో సగం అమెరికాలోనే ఉండటం డిజిటల్ ప్రపంచంపై ఆ దేశ పట్టును స్పష్టం చేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా స్టోరేజ్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ఈ ఆధిక్యం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 11,700కు పైగా డేటా సెంటర్లు ఉండగా, ఒక్క అమెరికాలోనే 5,427 సెంటర్లు ఉన్నాయి. ఇది ప్రపంచంలోని మొత్తం డేటా సెంటర్లలో సుమారు 46 శాతానికి సమానం. ఆ తర్వాత 529 సెంటర్లతో జర్మనీ రెండో స్థానంలో, 523 సెంటర్లతో యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మూడో స్థానంలో ఉన్నాయి. 449 డేటా సెంటర్లతో చైనా నాలుగో స్థానంలో, 337 సెంటర్లతో కెనడా ఐదో స్థానంలో నిలిచాయి. ఇక ఈ జాబితాలో మన దేశం 14వ స్థానంలో ఉంది. భారత్‌లో ప్రస్తుతం 153




డేటా సెంటర్లు ఉన్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. డేటా సెంటర్లు అంటే కంప్యూటర్ వ్యవస్థలను కలిగి ఉండే మౌలిక సదుపాయాలు. భారీ మొత్తంలో సమాచారాన్ని నిల్వ చేయడానికి, ప్రాసెస్ చేయడానికి, టెలికమ్యూనికేషన్ల కోసం ఇవి అత్యంత అవసరం. స్టాటిస్టా, క్లౌడ్‌సీన్ విడుదల చేసిన ఈ గణాంకాలు కేవలం డేటా సెంటర్ల సంఖ్యను మాత్రమే సూచిస్తాయి. అమెరికాలోని కొన్ని హైపర్‌స్కేల్ సెంటర్లు ఇతర దేశాల్లోని చిన్న సెంటర్ల కంటే ఎన్నో రెట్లు ఎక్కువ కంప్యూటింగ్ శక్తిని కలిగి ఉంటాయి. వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 గిగావాట్ల కొత్త డేటా సెంటర్ సామర్థ్యం తోడవుతుందని నిపుణుల అంచనా. అమెరికాలోని వర్జీనియా, టెక్సాస్, కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో డేటా సెంటర్లు కేంద్రీకృతం కావడం వల్ల విద్యుత్, నీటి వినియోగం, గ్రిడ్ స్థిరత్వంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# 7.51 బిలియన్ డాలర్లు క్షీణించిన ఆర్బీఐ ఫోరెక్స్ ఖజానా

**ముంబయి, మే 29:** భారతీయ రిజర్వుబ్యాంకు ఈనెల 22తో ముగిసిన వారానికిగాను విదేశీ కరెన్సీ రిజర్వు వివరాలను వెల్లడించింది. 7.51 బిలియన్ డాలర్లు క్షీణించి మొత్తం నిల్వలు 681.38 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించింది. భారత్‌రూపాయి దారుణంగా పడిపోవడం కూడా ఇందుకు కొంత కారణం అయింది. ఫోరెక్స్ రిజర్వులు బంగారం నిల్వలపరంగాను, విదేశీ కరెన్సీ ఆస్తులపరంగాను చోటుచేసుకున్నట్లు ఆర్బీఐ అంచనావేసింది. బంగారంనిల్వలు కూడా 4.53బిలియన్ డాలర్లు క్షీణించి 114.78 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తులపరంగా 2.8 బిలియన్ డాలర్లు క్షీణించి 543.03 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, యెన్, పౌండ్, స్టెర్లింగ్ వంటివాటి మారకం విలువల హెచ్చుతగ్గులను కూడా కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారని ఆర్బీఐ తెలిపింది. విదేశీప్రయాణాలు కుదించుకోవడం, ఇంధన వినియోగం తగ్గించుకోవడ, బంగారం కొనకుండా ఉండటం వంటి వాటితో పొదుపుచేయాలని ప్రధానిమోడీ కూడా పలుసార్లు దేశ ప్రజలకు విజ్ఞప్తిచేసారు. ఇందుకు ప్రధానకారణం కూడా విదేశీ కరెన్సీ నిల్వలు తగ్గడమే. బంగారం నిల్వలు 4.53 బిలియన్ డాలర్లు తగ్గి 114.786 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ (ఎస్‌డిఆర్‌లు) 77 మిలియన్ డాలర్లు తగ్గి 18.748 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సెంట్రల్‌బ్యాంకు వివరించింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి 33 మిలియన్ డాలర్లు క్షీణించి 4.818 బిలియన్ డాలర్లుగా ఉందని ఆర్బీఐ నివేదిక తెలిపింది.






# లక్షకోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్ దాటిన మైక్రాన్

**ముంబయి, మే 29:** ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో మరో సంచలనం నమోదైంది. ప్రముఖ మెమరీ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీ, ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను బ్రేక్‌చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టిస్తున్న ప్రభంజనంతో కంపెనీ షేర్లు రికార్డు స్థాయికి చేరగా, ఈవిజయం వెనుకఉన్న భారత సంతతి సీఈఓ సంజయ్‌మెహ్రోత్రా కృషి ఇపుడు చర్చనీయాంశం అయింది. కాన్పూర్‌లో పుట్టిన మెహ్రోత్రా, సిలికాన్ వ్యాలీ శిఖరాలను అధిరోహించడానికి ముందు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. బర్కిలీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన మెహ్రోత్రా, 1988లో శాన్‌డిస్క్ కంపెనీని హరారీ, యువాన్‌లతో కలిసి స్థాపించారు. ఫ్లాష్ మెమొరీ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఈ సంస్థ, 2016లో సుమారు 16 బిలియన్ డాలర్ల డీల్‌తో వెస్ట్రన్ డిజిటల్‌లో విలీనమైంది. ఫోర్బ్స్ కథనం ప్రకారం ఆ తర్వాత ఏడాది, అంటే 2017లో సంజయ్ మెహ్రోత్రా మైక్రాన్ టెక్నాలజీ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు.



# మార్కెట్‌లోకి టయోటా ఎలక్ట్రిక్ 'ఎబెల్లా'

**ముంబయి, మే 29:** టయోటా కిర్లోస్కర్ మోటార్ భారత ఆటోమొబైల్ మార్కెట్లోకి తన తొలి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారు అర్బన్ క్రూయిజర్ 'ఎబెల్లా'ను విడుదల చేసింది. ఈ మిడ్‌సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ టాప్ వేరియంట్ ధరను రూ. 23.60 లక్షలు ఎక్స్‌షోరూమ్‌గా కంపెనీ నిర్ణయించింది. మారుతీ సుజుకీ ఈవిటారా ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందిన ఈ కారు మార్కెట్లో ఉన్న హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జెడ్‌ఎస్ ఈవీ, టాటా కర్వ్ ఈవీలకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఇందులో 61 కిలోవాట్ అవర్స్ (కేడబ్ల్యూహెచ్) సామర్థం గల శక్తిమంతమైన బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. దీన్ని ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 543 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారు గరిష్ఠంగా 171 హార్స్ పవర్ శక్తిని, 189 న్యూటన్ మీటర్ల టార్క్‌ను విడుదల చేస్తుంది. స్పోర్టివ్ లుక్‌తో ఉన్న ఈ కారును కేఫ్ వైట్, బ్లూయిష్ బ్లాక్, స్పోర్టింగ్ రెడ్ వంటి ఆకర్షణీయమైన రంగుల్లో విడుదలచేసింది.

కారు లోపలి భాగం బ్లాక్, బ్రౌన్ కలర్ కాంబినేషన్‌తో లగ్జరీ స్థాయిలో ఉంది. ఇందులో పనోరమిక్ సన్‌రూఫ్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఎయిర్ ప్యూరిఫైయర్ వంటి ఎన్నో ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. ప్రయాణికుల భద్రత కోసం ఈ కారులో ఏకంగా 7 ఎయిర్‌బ్యాగ్‌లు, 360డిగ్రీల కెమెరాతో పాటు ప్రమాదాలను ముందుగానే గుర్తించి ఆపే లెవెల్ 2 ఏడీఏఎస్ సాంకేతికతను కూడా అర్బన్ క్రూయిజర్ 'ఎబెల్లా'లో జోడించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.